www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
ప్రకాశం
గురువారం 10, ఆగస్టు 2017





వర్షాలకు జీవం పోసుకున్న పెసర పైరు, (ఇన్‌సెట్‌లో) గుండ్లకమ్మను దాటుతున్న నూతన వధూవరులు

వానందం

అత్యధిక మండలాల్లో వర్షం.. సాగుకు జీవం

ఏడాది తర్వాత వాగులు, వంకల్లో జల సవ్వడి

నెమలిగుండ్ల వద్ద గుండ్లకమ్మలో చిక్కుకున్న పెళ్లి బృందం

సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన అగ్నిమాపక సిబ్బంది

15లో

అట్టహాసంగా 'శిద్దా' షష్ఠిపూర్తి

హరిహరక్షేత్రంలో పూజలతో ప్రారంభం

15లో


నేడు అక్కడే జన్మదిన వేడుకలు

రేపు ఒంగోలులో భారీ కార్యక్రమం



షష్ఠిపూర్తి వేడుకల్లో మంత్రి శిద్దా దంపతులు, కుటుంబ సభ్యులు





అట్టహాసంగా మంత్రి శిద్దా షష్ఠి పూర్తి వేడుకలు



రాఘవరావు, లక్ష్మీపద్మావతిలకు వస్త్రాలు సమర్పిస్తున్న కుటుంబ సభ్యులు

- శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కదిరి
- శిద్దా అభిమానులతో హరిహరక్షేత్రం కోలాహలం
- రామతీర్థం రిజర్వాయర్‌లో మంగళస్నానాలు



ఆశీర్వాదం అందుకుంటున్న మంత్రి శిద్దా దంపతులు

చీమకుర్తి : రాష్ట్ర అటవీ పర్యావరణ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన సతీమణి లక్ష్మీపద్మావతి షష్ఠిపూర్తి మహోత్సవం బుధవారం చీమకుర్తిలో అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత ఉదయాన్నే రామతీర్థం రిజర్వాయర్‌లో వారు శాస్త్రోక్తంగా మంగళస్నానం ఆచరించారు. కుమారుడు శిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్, కోడలు శృతి, మనుమరాలు ఆరాధ్య, కుమార్తె సునీత, అల్లుడు ఫణికుమార్‌లు సంప్రదాయబద్ధంగా మంగళస్నానం వేడుక నిర్వహించారు. తదుపరి హరిహరక్షేత్రానికి చేరుకోగా వేద పండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. 9గంటల నుంచి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రార్థన, దీక్షా ధారణ, సంపూర్ణ నవగ్రహ జపాలు, ఆయుష్యసూత్ర పారాయణ, అమృత మృత్యుంజయ జపం, నక్షత్ర జపాలు చేశారు. సాయంత్రం షష్ఠిపూర్తి మండపారాధన, చతుర్వేదపారాయణం నిర్వహించారు.

అభిమానుల కోలాహలం

హరిహరక్షేత్రంలో శిద్దా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సందర్భంగా అక్కడకు ఆయన అభిమానులు పెద్దఎత్తున వచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు మంత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కదిరిబాబురావులు ఉన్నారు. మంత్రి శిద్దా కుటుంబ సభ్యులైన వెంకటేశ్వరరావు, వెంకట్రావు, సుబ్బారావు, వెంకటకృష్ణారావు, పాండురంగారావు, నాగేశ్వరరావు, సురేష్‌బాబు, బాలాజీ, సుధాకర్, కాశీవిశ్వేశ్వరరావు, బొమ్మిశెట్టి వెంకటశ్రీనివాసరావు, క్రిష్ణసాయిగ్రూప్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు, హనుమంతరావు, ఒంగోలు గెలాక్సీ చలువాది బదరీనారాయణలు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి. సుబ్బారావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మన్నం శ్రీధర్‌బాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి మన్నం ప్రసాదు, చీమకుర్తి టీడీపీ అధ్యక్షుడు రావిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి హనుమంతరావు, ముండ్లమూరు ఎంపీపీ ఎం.వెంకట్రావు, టీడీపీ నాయకులు, ఆర్యవైశ్యనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వినోదరాయునిపాలేన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం


- ప్రకాశం 146వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- జడ్పీ హైస్కూల్‌లో ఆయన కాంస్య విగ్రహ ఏర్పాటు
- గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్

వినోదరాయునిపాలెం(నాగులుప్పలపాడు) : ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయునిపాలేన్ని రాష్ట్రంలోనే మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ చెప్పారు. బుధవారం ప్రకాశం జన్మ స్థలమైన వినోదరాయునిపాలేన్ని ఆయన సందర్శించారు. ప్రకాశం పేరుతో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఆయన కాంస్య విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుల తో మాట్లాడారు. ఈనెల 23వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యం లో ప్రకాశం కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి 146వ జయంతి ఉత్సవాల ను ఘనంగా జరుపుకుందామన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజిలు, హైస్కూలు ప్రహరీ నిర్మాణానికి రూ.60లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. దత్తత గ్రామమైన వినోదరాయు ని పాలెం అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ ఇప్పటికే ఓడీఎఫ్ గ్రామంగా చేశామని తెలిపారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవో కె. శ్రీనివాసరావు ప్రకాశం పంతులు మహనీయుడు పుట్టిన గడ్డను అభివృద్ధి చేసుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. ప్రకాశం పంతులు ట్రస్టు నిర్వాహక అధ్యక్షుడు భైరపునేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రకాశం వంటి మహనీయుడు ఈ గడ్డపై జన్మించడం గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జయంతి ఉత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని తీర్మానించడం, ఆయన స్మారకంగా పాఠశాల ఆవరణలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్న ప్రభాకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గతంలో ప్రతిపాదించిన జన్‌కో ప్లాంటు నిర్మాణం రద్దయినప్పటికీ భూములకు రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. కనపర్తి నుంచి పాఠశాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఉదయం పూట రాకపోకలు పునరుద్ధరించాలని విద్యార్థినులు కోరారు. అనంతరం నాగులుప్పలపాడు మండల కార్యాలయానికి చేరుకొని ఎంపీపీ వీరయ్యచౌదరి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు చుండూరి రంగారావులను మండల ప్రాధాన్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎస్.ఎం. శిలార్, ఈఓఆర్‌డీ బి.వి. సుబ్బారావు, తహసీల్దార్ సుజాతలు ప్రభాకర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జడ్పీ పాఠశాలలో ప్రకాశం పంతుల విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న పరకాల

అనుమతులు లేని కళాశాలలపై కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ఐవో

ఇంకొల్లులో పలు కళాశాలలను తనిఖీ చేసిన ఆర్ఐవో

ఇంకొల్లు : 'మండలంలో అనుమతులు లేని విద్యాసంస్థలు నడుస్తున్నాయి. ఒక కళాశాలలో చదువుతున్న విద్యార్థులను మరో కళాశాలలో చూపుతూ బోగస్ రికార్డులు నిర్వహిస్తున్నారు' దీనిపై స్థానికుల ఫిర్యాదుల మేరకు మండలంలోని గంగవరం వెళ్లే దారిలో ఉన్న విద్యాసంస్థలను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేని ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులను డీఎస్ఎం ఎయిడెడ్ కళాశాలలో చదువుతున్నట్లుగా రికార్డులు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యార్థులను ఆర్ఐవో మనోహర్‌బాబు అడిగిన ప్రశ్నలకు తాము డీఎస్ఎం కళాశాల విద్యార్థులమని చెప్పటంతో విషయం గుట్టురట్టయింది. కళాశాల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. రికార్డులు, మెటీరియల్‌ను సీజ్‌చేశారు. నివేదిత కళాశాలనూ తనిఖీ చేశారు. అనంతరం ఆర్ఐవో విలేఖరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా కళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందిన ఫిర్యాదు మేరకు ఆక్స్‌ఫర్డ్ కళాశాల యాజమాన్యానికి 15 రోజుల క్రితమే షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. దీనికి సమాధానం రాకపోవడంతో ఆకస్మికంగా తనిఖీ చేశామని, మరిన్ని విషయాలు వెలుగుచూశాయని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్న విద్యార్థులను దగ్గుబాటి నీలిమోహన్ మెమోరియల్ జూనియర్ కళాశాలలో చదువుతున్నట్లుగా రికార్డులు నిర్వహించటం తమ దృష్టికి వచ్చిందన్నారు. డీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి సెలవులో ఉండటంతో ఆమెను కళాశాలకు పిలిపించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అధికారులు విచారించారు. ఆయన వెంట ఇంటర్మీడియట్‌బోర్డ్ సూపరింటెండెంట్ ఎస్.కళాధర్ ఉన్నారు.



డీఎస్ఎం జూనియర్ కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్ఐవో

నెమలిగుండం వాగులో చిక్కుకున్న పెళ్లి బృందం

● తప్పిన పెను ప్రమాదం

● రక్షించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది



నెమలిగుండంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

రాచర్ల : ఊహించని విధంగా నెమలిగుండంలో ఉధృతంగా ఒక్కసారి వాగు రావడంతో పెళ్లి బృందం ఆ ప్రమాదం నుంచి దాదాపు 70 మంది సురక్షితంగా బయటపడిన సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే కంభం మండలం జగ్గంబొట్లక్రిష్టాపురానికి చెందిన చెట్లం రాంప్రసాద్ వివాహం సందర్భంగా మంగళవారం రాత్రి దాదాపు 70 మంది పెళ్లి బృందం వాహనాలలో నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం నెమలిగుండ్ల ఆలయంలోనే రాంప్రసాద్‌కు వివాహం జరుగగా బంధుమిత్రులందరూ భోజనం చేసి 12గంటల సమయంలో నెమలిగుండం నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఒక్కసారిగా గుండంలోకి భీకరమైన శబ్దంతో నీరు కొండల మీద నుంచి పడడం ప్రారంభమైంది. ఈ నీరు ఆర్యవైశ్య నిత్య అన్నదానసత్రం వెనుకభాగంలో ఉన్న బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆ సమయంలో పెళ్లి బృందం ఈ నీళ్ల ధాటికి అటువైపునే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పెళ్లి బృందం ఎటు వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రహించిన కొంత మంది రాచర్ల పోలీసుస్టేషన్‌కు, గిద్దలూరు ఫైర్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనితో గిద్దలూరు సీఐ వి.శ్రీరామ్ వెంటనే స్పందించి రాచర్ల పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో గిద్దలూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది, రాచర్ల పోలీసులు, రాచర్ల రెవెన్యూ తహసీల్దార్ కె.ఎలిజబెత్‌రాణితోపాటు రెవెన్యూ సిబ్బంది ప్రణాళిక ప్రకారం వాగుకు అటుపక్కన ఉన్న పెళ్లి బృందానికి తాళ్లు అందించి ఒకొక్కరినీ వాగు ఇవతలికి సురక్షితంగా చేర్చారు. దాదాపు 2గంటల పాటు 70 మందిని ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారు తమ వాహనాల్లో వెనుదిరిగారు. నెమలిగుండంలోకి ఊహించని విధంగా వస్తున్న నీరు భక్తులు వెళ్లే బ్రిడ్జిల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డు పెట్టకపోవడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ పని తీరుపై అటు భక్తులతోపాటు పెళ్లిళ్లకు వచ్చే వారు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెమలిగుండం నుంచి వచ్చే నీరు ఏఏ ప్రాంతాల గుండా వెళుతుంది. అక్కడ భక్తులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో దేవస్థాన నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది.

వీడుతున్న చిక్కుముడి

● మృతిచెందింది కార్పెంటర్‌గా గుర్తింపు

● అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

గిద్దలూరు : గిద్దలూరు - బేస్తవారపేట రోడ్డులో హసనాపురం సమీప కొండల్లో కనుగొన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వివరాలను గుర్తించారు. మార్కాపురంలో నివాసం ఉంటున్న తారక్ బ్రహ్మాచారి (30) మృతదేహంగా పోలీసులు నిర్థారణకు వచ్చారు. కార్పెంటర్‌గా పని చేస్తున్న బ్రహ్మాచారి గత నెల 22న కంభం వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చి ఆ తరువాత నుంచి కనిపించలేదు. దాంతో కుటుంబీకులు మార్కాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉన్నది. కాగా ఈ నెల 5వ తేదీ శనివారం కొమరోలు మండలం హసనాపురం కొండల్లో మృతదేహాన్ని గొర్రెల కాపరులు కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలు పోసి మృతదేహాన్ని కాల్చిన ఆనవాళ్ళు ఉండడంతో పోలీసులు హత్య కేసుగా దర్యాప్తు మొదలుపెట్టారు. ఆనవాళ్ళ ప్రకారం అది మార్కాపురానికి చెందిన కార్పెంటర్ బ్రహ్మాచారిదని పోలీసులు గుర్తించారు. బ్రహ్మాచారి కుటుంబీకులు సైతం మృతదేహంపై ఉన్న దుస్తులు, ఇతరత్రా ఆధారాల నిర్ధారించారు. హత్య కేసుగా దర్యాప్తు ముమ్మరం చేశారు. బ్రహ్మాచారి భార్యతోపాటు పోస్టల్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మార్కాపురం సమీపంలోని ఒక గ్రామంలో బ్రహ్మాచారి భార్య ప్రైవేటు స్కూలులో టీచర్‌గా పని చేస్తుండగా గతంలో అదే స్కూలులో టీచర్‌గా పని చేస్తూ పోస్టల్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తికి మధ్య గల సంబంధంపై అనుమానాలు రావడంతో ఇద్దరినీ విచారిస్తున్నారు.

షాక్‌కు గురై వ్యక్తి మృతి

వేముల (ముండ్లమూరు) : మండలంలోని వేముల గ్రామానికి చెందిన జానపాటి అంజయ్య (60) అనే వ్యక్తి విద్యుత్ షాకుకు గురై బుధవారం ఉదయం మృతిచెందారు. అంజయ్య బహిర్గభూమికి వెళ్తుండంగా సూరా ఏడుకొండల రెడ్డి పొలానికి వెళ్తున్న విద్యుత్ సర్వీసు వైర్‌కు ఉన్న స్టే వైరు తెగి కిందపడి ఉంది. ఆ వైరుకు అంజయ్య చేయి తగిలి షాక్‌కు గురై మృతిచెందాడు. బహిర్గభూమికి వెళ్ళిన అంజయ్య ఎంతసేపటికీ రాకపోవడంతో అనుమానంతో బంధువులు వెళ్ళి చూడగా మృతిచెందాడు. కుమారుడు వెంకటవీరాంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలరంగయ్య పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి 12 పొట్టేళ్ల మృతి



మృతి చెందిన పొట్టేళ్లు

మేదరమెట్ల: మండలంలోని అనమనమూరులో గోడ కూలి 12 పొట్టేళ్లు మృతి చెందాయి. బుధవారం వేకువ జామున అనమనమూరులో వర్షానికి తడవకుండా ఉండటానికి పొట్టేళ్లను కొష్టం లో ఉంచగా ఆ గోడ కూలి 12 పొట్టేళ్లు మృతి చెందాయి. చెన్నుపోయిన ఆంజనేయులుకు చెందిన 100 పొట్టేళ్ల మందలో 12 మృతి చెందడంతో కుటుంబ సభ్యులు వాపోతున్నారు. వాటి విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పొదిలి : మండలంలోని కొత్తలపల్లిలో బుధవారం పిడుగుపడి పొటేలు, గొర్రె మృతి చెందాయి. గ్రామంలోని ఊరు బయట బ్యారేనీ దగ్గర ఉన్న వెంకరెడ్డికి చెందిన గొర్రెల మందలో పిడుగు పడడంతో రూ.30వేలు విలువ చేసే పొటేలు, గొర్రె అక్కడిక్కడే మృతి చెందాయి. ఆ సమయంలో ఎవరు అక్కడా లేకపోవడంతో పెనుప్రమదాం తప్పింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ రవిశంకర్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

వాహనాల తనిఖీ

ముండ్లమూరు : మండలంలోని వేంపాడు వద్ద ఎస్ఐ బాలరంగయ్య బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 20 వాహనాలకు సంబంధించి పత్రాలు, డ్రైవింగ్‌లైసెన్స్, హెల్మెట్లు లేకపోవడంతో రూ.2,500లు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ బాలరంగయ్య తెలిపారు. వాహనచోదలకు తప్పనిసరిగా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.



విచారిస్తున్న డీఎస్పీ ప్రకాష్‌రావు

అట్రాసిటీ కేసు విచారణ

లింగసముద్రం : లింగసముద్రం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసును బుధవారం కందుకూరు డీఎస్పీ కే.ప్రకాష్‌రావు విచారించారు. గత శనివారం రాత్రి విలేకరి జడ సుధాకర్‌రావుపై ఉమ్మడిశెట్టి శ్రీ నివాసులు అలియాస్ ఢిల్లీ శ్రీను అనే వ్యక్తి దాడి చేసిన సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఎస్పీ గ్రామాన్ని సందర్శించి, సాక్షులను విచారించారు.

జిల్లాలో రక్షణ సంస్థల ఏర్పాటు

ప్రధాని మోదీకి ఎంపీ వైవీ లేఖ

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో రక్షణ శాఖకు సంబంధించిన సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీకి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ప్రధానికి లేఖ రాశారు. దొనకొండ, రామాయపట్నం ప్రాంతంలో చాలా భూమి ఉందని, కొత్తగా భూసేకరణ అవసరం లేదన్నారు. ప్రకాశం జిల్లాలో సీఎస్‌డీ డిపో, ట్రెయినింగ్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెజిమెంట్ సెంటర్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్, ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ ట్రైనింగ్ సెంటర్, ఎన్‌సీసీ ఫ్లయింగ్‌వింగ్, ఎయిర్‌మెన్ ట్రైనింగ్ సెంటర్‌తో పాటు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లాల అభివృద్ధికి ఐదేళ్ల ప్రణాళిక

కలెక్టర్లతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్



ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌చంద్

ఒంగోలు,ఆంధ్రజ్యోతి : రానున్న ఐదేళ్లలో జిల్లాలు అన్ని విధాలా అభివృద్ధి బాటలో పయనించేలా కలెక్టర్‌లు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. క్విట్ ఇండియా 70 ఏళ్ల పురస్కరించుకొని బుధవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఇక్కడి తన కార్యాలయం నుంచి కలెక్టర్ వినయ్‌చంద్ హాజరయ్యారు. భారత స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75ఏళ్ళు పూర్తవుతున్నదని ఇక ఐదేళ్ళు ఉన్నందున ఈ కాలంలో అన్ని జిల్లాల్లో వ్యవసాయం, సాంకేతిక, మౌలిక రంగాలు అన్నింటిలోనూ అభివృద్ధి ఉండేలా చూడాలని ఈ సందర్భంగా మోదీ సూచించారు. అందులో కీలక పాత్ర కలెక్టర్లదేనని అందువల్ల ఈ ఐదేళ్లూ ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. క్విట్ ఇండియా ఉద్యమం 70 వసంతాల సందర్భంగా ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారని కలెక్టర్ వినయ్‌చంద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. జిల్లాలో ఆదిశగా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఆంధ్రజ్యోతి
గిద్దలూరు
4
ప్రకాశం • గురువారం
10 ఆగస్టు 2017
గిద్దలూరు । కొమరోలు । రాచర్ల । కంభం । బేస్తవారపేట । అర్ధవీడు

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణంలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలోని యూనివర్సిటీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ బి.ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. 2013 నుంచి 2017 వరకు ఎలిజబిలిటీ టెస్టు ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్, టీటీసీ, ఐటీఐ, ఏపీ ఓపెన్ స్కూలు పాసైన వారు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు అర్హులని పే ర్కొన్నారు. ఏపీ ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసి అప్లికేషన్‌ను స్టడీసెంటర్‌లో ఇచ్చి , ఆన్‌లైన్‌లో ఈ నెల 24లోగా ఫీజులు చెల్లించాలన్నారు. వివరాలకు 9949214494 నెంబరులో సంప్రదించాలన్నారు.

పంటలకు జీవం

- గుండ్లకమ్మ వాగు ఉగ్రరూపం
- నల్లమల నుంచి నెమలిగుండంలోకి భారీగా నీరు
- కంభంలో మోస్తరు వర్షం.. కళకళలాడుతున్న పైర్లు

రాచర్ల : మండలంలోని జెపుల్లలచెరువు గ్రామ సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ వద్ద గుండంలోకి భారీగా వరదనీరు చేరుతోంది. కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం కురిసిన భారీ వర్షాలకు గుండంలోకి నీరు పెద్ద ఎత్తున కొండపై నుంచి ఉబికి పడుతోంది. దీంతో గుండంలోకి నీటి చెమ్మల మధ్య నీరు దూకుతున్న దృశ్యాన్ని భక్తులు చూసి పరవసించి పోతున్నారు. ఆ దృశ్యాలను సెల్ ఫోన్లలో బంధిస్తున్నారు. ఈ నీరంతా చోళ్లవీడు సమీపాన గుండ్లకమ్మనది ద్వారా వస్తుంది. దీంతో బుధవారం 2 గంటల పాటు అటు ఆకవీడుకు, ఇటు గిద్దలూరుకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 12న పెద్ద ఎత్తున ముహూర్తాలు ఉండడం, అందులో శనివారం కావడంతో నెమలిగుండంకు వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ఇటు పోలీసులు, అటు దేవాదాయశాఖ అధికారులు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

కంభంలో మోస్తరు వర్షం

కంభం : మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు మోస్తరు కురిసింది. దీంతో బోర్ల కింద వేసిన మిరప, పసుపు, సజ్జ పంటలకు జీవం పోసినట్లైంది. జూన్, జూలై మాసాల్లో మంచి వర్షాలు కురిసి పొలాన్నీ పంటలతో కళకళలాడాల్సి ఉండగా ఆగస్టు ప్రారంభమైనా వాతావరణం సానుకూలత చూపలేదు. దీంతో కంభం సబ్ డివిజన్‌లో బోర్లు ఉన్న పలువురు రైతులు తమ పొలాల్లో సజ్జ, మిరప, పసుపు పంటలను సాగుచేశారు. అయితే బోర్లలోనూ నీరు అడుగంటడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా కంభం మండలంలో మాత్రం మోస్తరు వర్షం మాత్రమే పడింది. ఈ వర్షం ఎండుతున్న పంటలకు ఉపకరిస్తుంది. కాగా ప్రస్తుత వర్షం కంది, కొర్రసాగుకు అనువుగా ఉంటుందని, రైతులు వాటిని సాగుచేసుకోవచ్చని ఏవో జి.మీరయ్య తెలిపారు.



కళకళలాడుతున్న పసుపు పంట

14న విద్యార్థులకు కథల పోటీలు

కొమరోలు : మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ఆయా పాఠశాలల్లో నీతి కథల పోటీలను నిర్వహించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల మేరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులను ప్రదానం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

రసం పీల్చు పురుగులను నివారించాలి

కొమరోలు : పత్తి పంటలో రసం పీల్చు పురుగులను నివారించాలని ఏవో జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని రెడ్డిచెర్ల, మల్లారెడ్డిపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సం, బోరాన్‌లను వాడాలన్నారు.

తరాలు మారిన తలరాతలు మారడం లేదు

గిద్దలూరు : తరాలు మారిన తలరాతలు మాత్రం మారడం లేదని, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని గిరిజన లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బి.సుబ్బానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిద్దలూరులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 జనాభా ఉన్న తాండాలను, గిరిజన గూడెంలను పంచాయతీలుగా మారుస్తామన్న హామీని తుంగలోకి తొక్కారన్నారు. జీవనాధారం కోల్పోతున్న గిరిజనులకు పాడిగేదెలు, ఆవులు, పొలాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. భూ ఆక్రమణలు, దాడుల నుంచి గిరిజనులను రక్షించాలన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన సంఘాలకు అటవీ ఉత్పత్తులు తెచ్చుకుని అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. కేవీపల్లి జాయింట్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షుడు మంత్రినాయక్ మాట్లాడుతూ అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు గోపాల్‌నాయక్, అంజినాయక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ లేక ఇక్కట్లు


గిద్దలూరు : పట్టణంలోని పలు రోడ్లలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా రహదారి మధ్యలో నిలిచిపోతుంది. దీంతో ఆయా రోడ్లపై వెళ్లాలంటే వాహనచోదకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నీరు నిల్వ ఉండి, బురదమయమై నడిచివెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ రోడ్డు, కొంగళవీడు రోడ్డు, తదితర ప్రధాన వీధుల్లో సైతం రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షం నీరంతా రోడ్ల మధ్యనే నిలబడుతోంది. మున్సిపల్ అధికారులు కొత్తగా రోడ్లు వేసేందుకు చూపిస్తున్న శ్రద్ధ ఉన్న రోడ్లలో కాలువలు ఏర్పాటుపై పెట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



క్లబ్ రోడ్డులో డ్రైనేజీ లేక నిలబడిన వర్షపు నీరు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కంభం : పట్టణంలోని వై.జంక్షన్ సమీపంలో ప్రధాన రాష్ట్రీయ రహదారి పక్కన 132/11కెవి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి చేతికి అందే ఎత్తులో ఉండి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఈ రహదారి వెంబడి వివిధ వాహనాలకు మరమ్మతులు చేసే మెకానిక్‌లు బంకులను ఏర్పాటు చేసుకున్నారు. సరిగ్గా ఈ విద్యుత్ తీగల కిందనే బంకులు ఉన్నాయి. పలువురు లారీ, ట్రాక్టర్ల డ్రైవర్లు టైర్లకు పంచర్ పడినా, గాలి తగ్గినా ఇతర ఏమైనా రిపేర్ల కోసం బంకుల దగ్గరకు వచ్చి కిందకు వేలాడుతున్న తీగల తాకే ప్రమాదం ఉంది. ఇటీవల ఇద్దరు లారీ డ్రైవర్లు తీగలను గమనించక వాటి వైపు వాహనాన్ని నడపుతుండగా చూసిన మెకానిక్‌లు కేకలు వేయడంతో ప్రమాదం తప్పినట్లు తెలిసింది. బంకు యజమానులు విద్యుత్ అధికారులను కలిసి తీగలను ఎత్తు పెంచాలని కోరగా వారు వచ్చి పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పి తిరిగి రాలేదని తెలిపారు. అందుకు అయ్యే ఖర్చు తామే భరిస్తామని దయచేసి ఎత్తు పెంచాలని వారు కోరుతున్నారు.



వేలాడుతున్న విద్యుత్ వైర్లు

బడి బయట 330 మంది పిల్లలు

- జిల్లా ఏఎల్ఎఫ్ కోఆర్డినేటర్ ఏసోబు



రికార్డులను తనిఖీ చేస్తున్న కోఆర్డినేటర్ ఏసోబు

గిద్దలూరు : ప్రస్తుతం 330 మంది పిల్లలు బడిబయట ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించడమే తమ లక్ష్యమని జిల్లా ఏఎల్ఎఫ్ కోఆర్డినేటర్ ఏసోబు పేర్కొన్నారు. విద్యార్థి గణన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని సీఆర్‌పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 780 మంది విద్యార్థులు బడిబయట ఉండగా, 350 మందిని ఇప్పటివరకు పాఠశాలలో చేర్పించినట్లు చెప్పారు. మిగిలిన వారిని కూడా సీఆర్పీలు బడిలో చేర్పించాలన్నారు. వలస వెళ్లిన విద్యార్థులను గుర్తించి, వివరాలు నమోదుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

గిద్దలూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ పథకాలను వినియోగించుకుని లబ్ధిపొందాలని ఏవో ఎన్.రామ్మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పొదలకొండపల్లి, తిమ్మాపురం, తంబళ్ళపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై పీవీసీ పైపులు సరఫరా చేస్తున్నామని, వంద శాతం రాయితీపై జింకు, బోరాన్ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతూ సాగు చేసిన పంటను నమోదు చేయించుకోవాలని, లేకపోతే ఇన్సూరెన్స్ రాదని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 1770 మంది ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రాధా, రజిత పాల్గొన్నారు.

అన్నాకు మద్దతుగా రాజీనామాలు

రాచర్ల : మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు టీడీపీకి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన మద్దతుదారులు పలువురు పార్టీని వీడారు. మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బచ్చిగారి లింగన్న, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నన్నూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పి.విమలాదేవి, గ్రామకమిటీ అధ్యక్షుడు ఉలాపు లింగన్న, జన్మభూమి కమిటీ సభ్యులు బుధవారం టీడీపీకి పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అంతేకాకుండా అన్నా ఆధ్వర్యంలో గతంలో 250 మందికి తీసుకున్న పార్టీ సభ్యత్వ కార్డులను వెనక్కు పంపుతున్నట్లు తెలిపారు.

చిన్న వర్షానికే చిత్తడి

కంభం : కందులాపురం పంచాయతీ పరిధిలో పలు రోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారి, నడిచేందుకు వీలులేని విధంగా తయారవుతున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి నెహ్రూనగర్, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై వర్షపు నీరు నిలిపోవడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీన్ని సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు ఉపాధి హామీ కింద రూ. 19 లక్షలు మంజూరైనట్లు తెలిసింది. సుమారు అర కిలోమీటర్ పైగా పొడవు ఉన్న ఈ మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తే నివాస ప్రాంతాల వారికి సౌకర్యంగా ఉంటుంది. అంతేగాక రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు దగ్గర దారి అవుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నెహ్రూనగర్‌లో ఓ రోడ్డు దుస్థితి

మాలల మహా సంగ్రామానికి తరలిరావాలి

మార్కాపురం వన్‌టౌన్ : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉలవపాడులో ఈ నెల 11న చేపట్టనున్నట్లు మాలల మహా సంగ్రామానికి హాజరు కావాలని మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు నూతలపాటి రాజు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవో హోంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. సంగ్రామానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.చెన్నకేశవులు, బి.నాగేశ్వరరావు, కొండప్ప, నరసింహారావు పాల్గొన్నారు.

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- గౌతమ్‌నంద
శ్రీనివాస	- దర్శకుడు
వెంకటేశ్వర	- ఫిదా
నటరాజ్	- నక్షత్రం

అమృతమూర్తికి అశృనివాళి



మంచిమనిషి, మా అందరి హృదయాలలో చిరునవ్వుతో చెరగని ముద్ర వేసిన మహోన్నతవ్యక్తి, ప్రేమ ఆప్యాయతానురాగాలను మాకు పంచి, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ యర్రగుంట్ల శేషయ్య గారి మరణం మాకు తీరనిలోటు.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. అశృనయనాలతో...

భార్య: యర్రగుంట్ల సుమలత

కుమార్తె: **యర్రగుంట్ల లిఖితశ్రీ**

కుమారుడు: **యర్రగుంట్ల తన్విక్**

అన్నయ్య - వదిన:

యర్రగుంట్ల శ్రీనివాసరావు(YS) - పద్మ

కుమారుడు: **యర్రగుంట్ల వరుణ్ చౌదరి**

కుమార్తె: **యర్రగుంట్ల రిషిత**

మరియు **ఇతర కుటుంబ సభ్యులు**

స్వర్గీయ శ్రీ **యర్రగుంట్ల శేషయ్య** గారు

PACS అధ్యక్షులు, కూనంనేనివారిపాలెం, చీమకుర్తి(మం)

మరణం: 25-07-2017

పెద్దకర్మ: తేది.10-08-2017 గురువారం కూనంనేనివారిపాలెం గ్రామం, చీమకుర్తి మండలం లోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది

ఆప్తమిత్రునికి అశృతాంజలి



స్నేహశీలి, మానవతామూర్తి, అందరి మంచికోరే మంచిమనిషి, చిరునవ్వుతో పలుకరించే నైజం, మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకొన్న మహోన్నతవ్యక్తి శ్రీ యర్రగుంట్ల శేషయ్య గారి మరణం మాకు తీరనిలోటు... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

పమిడి రమేష్ ఒంగోలు	**నల్లూరి శ్రీనివాసరావు** జిల్లా తెలుగు యువత ప్రచార కార్యదర్శి Airtel Store	**బి.మల్లిఖార్జునరెడ్డి** INGEMAR, S.A.
పోలినేని రవి కన్నయ్య స్టోన్ క్రషర్స్, బూదవాడ	**పోలినేని శ్రీధర్** కన్నయ్య స్టోన్ క్రషర్స్, బూదవాడ	**పంగులూరి శ్రీకాంత్‌బాబు** P.L.R స్టోన్‌క్రషర్స్
నల్లూరి ప్రదీప్ 36వ డివిజన్ అధ్యక్షులు, ఒంగోలు	**నల్లూరి శ్రీనివాసరావు** టిడిపి గ్రామ అధ్యక్షులు, పెద్దకొత్తపల్లి	**ఇంటూరి నరసింహారావు** బూదవాడ
దాయినేని ధర్మ ఒంగోలు పట్టణ ప్రధాన కార్యదర్శి	**సుంకర సురేష్‌బాబు** ఒంగోలు	**బెల్లం ప్రవీణ్‌బాబు** చింతలపాలెం
వీరమోసు దానారావు ఒంగోలు	**రావూరి రవీంద్రనాథ్ చౌదరి** లింగోజిపల్లి, కంభం(మం)	**మండవ రామకృష్ణ** సాయిబాబా ఫర్నీచర్, ఒంగోలు
మోపర్తి సందీప్ మాజీ సర్పంచ్, కొలచనకోట	**మందలపు కాంతారావు** APSPDCL, ఒంగోలు	**జి.మురళీకృష్ణ** సాహి కలర్స్‌ఏజెన్సీ, ఒంగోలు
కాటూరి కిరణ్‌కుమార్ సంస్కృతి స్కూలు, కందుకూరు	**బెజవాడ ప్రసాద్** తెలుగు యువత నాయకులు, కందుకూరు	**ఎం.వెంగళరావు** ట్రెండ్స్ రెడిమేడ్ షోరూమ్, ఒంగోలు
జాష్టి తాండవకృష్ణ శంఖరాపురం	**మారెళ్ళ లక్ష్మీనారాయణ** మండవవారిపాలెం	**జి.శ్రీనివాసరావు** ఒంగోలు
ఆర్ల వెంకటరావు (బుజ్జి) బసవన్నపాలెం	**మండవ లక్ష్మి ప్రసాద్** మండవవారిపాలెం	**ఎల్.కృష్ణారెడ్డి** CEO, P.A.C.S, K.V.పాలెం

స్వర్గీయ శ్రీ **యర్రగుంట్ల శేషయ్య** గారు

PACS అధ్యక్షులు, కూనంనేనివారిపాలెం, చీమకుర్తి(మం)

TDP నాయకులు, మరణం: 25-07-2017

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా : ఎమ్మెల్యే


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సంతమాగులూరు: పేద ప్రజల ఆరోగ్యం కోసం టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సంతమాగులూరు మండలం కుందుర్రు, మామిళ్లపల్లి గ్రామాలకు చెందిన కోట యసోదకు రూ.3.20లక్షలు, తలకుల సుబ్బరత్నంకు రూ.3.20లక్షలు, దండా రాములుకు రూ.3.20 లక్షలు, మందలపు భిక్షపతికు రూ.3.20లక్షలు, మందలపు శివరామయ్యకు రూ.2.25లక్షలు, నేలపాటి సూర్యకు రూ.2.25లక్షల గల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం చిలకలూరిపేటలో తన స్వగృహంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడవి శ్రీను, దావులూరి శ్రీను, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ అదుపు తప్పి ముగ్గురికి తీవ్రగాయాలు


గాయపడిన కొర్నపాటి కిశోర్, వీరాంజనేయులు, తిప్పాబత్తిన అంకమ్మరావు

అద్దంకి: మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు సంతమాగులూరు మండలం తంగేడుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన గట్టుపల్లి వీరాంజనేయులు, తిప్పాబత్తిన అంకమ్మరావు, కొర్నపాటి కిశోర్‌లు ఒకే మోటార్‌సైకిల్‌పై అద్దంకి ప్రాంతంలో బంధువులకు దశదినకర్మ సమాచారం చెప్పేందుకు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా బుధవారం రాత్రి అద్దంకి పట్టణం దాటిన తరువాత కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల సమీపంలో మోటార్‌సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయింది. దీంతో వారికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్ శశికాంత్ వైద్య చికిత్సలు అందించారు.

వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి గొలుసు అపహరణ


బాధితురాలు చల్లా పోలేరమ్మ

అద్దంకి: ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న వృద్ధురాలిని మోసగించి 3 సవర్ల బంగారపు గొలుసు అపహరించుకుపోయిన సంఘటనపై బుధవారం జరిగింది. అద్దంకి పోలీసుల కథనం మేరకు ముండ్లమూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన చల్లా పోలేరమ్మ మంగళవారం మధ్యాహ్నం మనుమడితో కలిసి అద్దంకి వచ్చింది. మనుమడిని ఒంగోలు స్కూల్‌కు పంపించేందుకు బస్సు ఎక్కించి ఎల్ఐసీ కార్యాలయంలో పని ముగించుకొని తిరిగి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు కోసం పోలేరమ్మ వేచి ఉండగా ఓ మహిళ వచ్చి తాను కూడా పోలవరం వెళ్తున్నాని, ఆటో ఉంది రమ్మని తీసుకు వెళ్లింది. ఆటో భవానీసెంటర్‌కు చేరిన తరువాత శింగరకొండలో తమ బంధువులు ఉన్నారని, వారిని ఎక్కించుకొని వెళ్దామని చెప్పి ఆటో ను శింగరకొండ వైపు తీసుకు వెళ్లారు. 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్దకు వెళ్లిన తరువాత కూల్‌డ్రింక్‌లో మత్తు కలిపి వృద్ధురాలికి తాగించారు. తరువాత ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారపు గొలుసును లాక్కొని పోలేరమ్మను అక్కడే వదిలేసి వెళ్లారు. కొద్ది సేపటి తరువాత స్థానికులు విచారించగా జరిగిన విషయాన్ని వివరించింది. దీంతో బంధువులకు సమాచారం అందించడంతో వచ్చి తీసుకువెళ్లారు. ఈ విషయమై పోలేరమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుబ్బరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సంఘటన జరిగిన తీరు పట్ల పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధురాలి మెడలో మరో 5 సవర్ల బంగారపు గొలుసులు ఉండగా ఒక్క 3 సవర్ల గొలుసే లాక్కొని వెళ్లడం ఏమిటని, సంఘటన జరిగిన వెంటనే వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లడం పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

శంఖవరప్పాడులో వైభవంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

శంఖవరప్పాడు(అద్దంకి రూరల్): అద్దంకి మండలం శంఖవరప్పాడు గ్రామంలో బుధవారం శ్రీకోదండరాములవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగాయి. సిద్ధాంతి కొండకావూరి సీతారామప్రసాద్ పర్యవేక్షణలో ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు భారీ అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజాకార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. కాగా శంకవరప్పాడు గ్రామానికి చెందిన గోగుల నందినికి కంటి వైద్య చికిత్స కోసం ముందస్తుగా మంజూరు చేసిన రూ.3.34లక్షల ఎల్ఓసీ పత్రాలను ఆమె కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమాల్లో కరి పరమేష్, శివాజి, నుసుము శ్రీనివాసరెడ్డి, సోము రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

పొలం కోసం రైతుపై దాడి

చీరాలటౌన్ : పొలం కోసం రైతుపై దాడి జరిగిన సంఘటన యద్దనపూడి మండలం జాగర్లమూడిగ్రామంలో బుధవారం జరిగింది. చీరాల అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కె.వీరయ్య అనే వ్యక్తి జాగర్లమూడిలో పూనయ్య అనే వ్యక్తి వద్ద 10సంవత్సరాల క్రితం 30సెంట్ల మాగాణి భూమి కొన్నాడు. అయితే ప్రస్తుతం యాకోబు అనే వ్యక్తి ఈ భూమి తనదని వాదిస్తూ వీరయ్యపై దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేరిన వీరయ్య నుండి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

శ్రీరామ కోటి పుస్తక ఆవిష్కరణ

అద్దంకి రూరల్: శ్రీరామకోటి ప్రచార సంఘం హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత రామకోటి పుస్తకాలు పంపిణీ చేయటం జరుగుతుందని పట్టణ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పోలవరపు అనుప్రసాద్ అన్నారు. బుధవారం అద్దంకి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆయన రామకోటి పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ కోఆర్డినేటర్ వడగండ్ల రవితేజ, దర్శి కోఆర్డినేటర్ నాగరాజు, అర్చకులు భాగవతుల వెంకటాచార్యులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

చీరాలటౌన్ : రైలు ఎక్కబోతూ జారిపడటంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చీరాల రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి జరిగింది. 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన పి.శ్రీనివాసరావు తెనాలి నుంచి ప్యాసింజర్ రైలులో అమ్మనబ్రోలు వెళుతూ చీరాల రైల్వేస్టేషన్‌లో మంచినీటి కోసం దిగాడు. ఈలోపు రైలు కదలటంతో హడావుడిగా రైలు ఎక్కబోగా పట్టు జారి కింద పడిపోయాడు. తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108వాహన సిబ్బంది ఇతన్ని చికిత్సనిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకే దక్కాలి

చీరాలటౌన్ : చంద్రన్నబీమా, భవననిర్మాణ సంక్షేమనిధి వంటి పథకాలను అర్హులకు అందేటట్లు చూడాలని చీరాల పంచవృత్తిదారుల సంఘం ప్రతినిధులు కోరారు. ఆ సంఘ గ్రామిక కళాఉత్సవాలు బుధవారం జాండ్రపేట ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగాయి. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.ప్రతాప్, విశ్రాంత పోలీసు అధికారి కట్టా వినయ్‌కుమార్, సామాజిక హక్కుల వేదిక కన్వీనర్ మేడా వెంకట్రావు, గ్రామకన్వీనర్ కె.దేవసహాయం, ప్రతినిధులు యోహాను, బైరాగిదాసు, సత్తారు, సుభాని, ఎన్.భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్ జన్మదినం

చీరాల : సినీనటుల అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని వన్‌టౌన్ సీఐ సూర్యనారాయణ అన్నారు. చీరాలలోని మోహన్‌థియేటర్ వద్ద బుధవారం ప్రముఖ సినీనటుడు మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేశారు. సీఐ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం చేశారు.

పుట్టావారిపాలెంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

సంతమాగులూరు: పుట్టావారిపాలెం జంక్షన్‌లో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికలోడుతో వెళ్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న పలు వాహనాలపై కొరడా ఝుళిపించారు. పలు వాహనాలపై రూ.4లక్షల అపరాధం రుసుం విధించినట్లు విజిలెన్స్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఘనంగా భద్రతా వారోత్సవాలు

సంతమాగులూరు: గురిజేపల్లి గ్రానైట్ క్వారీలలో జాతీయ భద్రతావారోత్సవాలను బుధవారం ఘనంగా జరిగాయి. ఇంపీరియల్ గ్రానైట్ క్వారీ, నరసింహారావు గ్రానైట్ క్వారీలలో భద్రతా అధికారులు తనిఖీలు నిర్వహించారు. భద్రతా నియమాలు తప్పని సరిగా పాటిస్తామని కార్మికుల చేత ఆయన ప్రమాణం చేయించారు.

మిన్నెకల్లులో వివాద స్థలం పరిశీలన

సంతమాగులూరు: మిన్నెకల్లు గ్రామంలో వివాదంగా మారిన స్థలాన్ని బుధవారం తహసీల్దార్ కాంతారావు పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రహదారి విషయంలో గత కొంతకాలంగా ఘర్షణ పడుతున్నారు. సోమవారం రహదారి సమస్య పరిష్కరించాలని ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పరిశీలించటం జరిగిందని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మోహన్‌బాబు, వీఆర్వో కళ్యాణి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

అద్దంకి టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిసంరక్షణ బాధ్యతను వారే తీసుకోవలని రోటరీ క్లబ్ కార్యదర్శి యర్రమోతు రమేష్‌బాబు అన్నారు. బుధవారం రోటరీ మాజీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు పుట్టినరోజు సందర్భంగా అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరరెడ్డి, అంజాద్‌బాషా, చుండూరి మురళి, కొత్తమాసు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం రాకతో రైతుల్లో ఆనందం

యద్దనపూడి : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం వల్ల యద్దనపూడి మండలంలో రైతులు ఆనందంలో ఉన్నారు. 40రోజుల క్రితం వేసిన పత్తి పంటకు సరైన నీరు లేక బెట్టకు వచ్చింది. ఈదశలో ఈ వర్షం పత్తిపంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. మండలంలో భారీ వర్షం వలన చిన్నచిన్న వాగులు సైతం పొంగాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పత్తి పంటను కాపాడుకునేందుకు నీటి కోసం సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు జీవం పోసింది.


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ అరుణ

క్రీడల్లోనూ రాణించాలి : ఎంపీపీ

మైలవరం(అద్దంకి రూరల్): విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ కరి అరుణ కోరారు. బుధవారం మైలవరం జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అరుణ మాట్లాడుతూ క్రీడలపై మక్కువ పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరపునేని అంజమ్మ, జడ్పీటీసీ బైరపునేని రామలింగయ్య, ఎంపీడీవో హేమాద్రినాయుడు, ఏపీవో కోటేశ్వరి, ఈసీ బంగారుబాబు, టీఏ జానీబేగం, హెచ్ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని తల్లిదండ్రుల ఫిర్యాదు

సంతమాగులూరు : కన్న కొడుకు మమ్మల్ని వృద్ధులని కనికరం లేకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని న్యాయం చేయండయ్యా అంటూ ఓ వృద్ధ దంపతులు తహసీల్దార్ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. కుందుర్రు గ్రామానికి చెందిన కటారు యోహాను, అతని భార్య కొండమ్మ వారి ఇంటిలో నివాసం ఉంటున్నారు. అయితే వారి కుమారుడు కోటేశ్వరరావు ఇంటిలో వద్దంటూ బయటకు వెళ్లిపొమ్మని రోజు కొడుతున్నారని వాపోయారు. దీంతో తహసీల్దార్ కాంతారావు ఫోన్లో వారి కుమారుడితో మాట్లాడారు. వృద్ధులు నివాసం ఉంటున్న ఇంటి పట్టా వారి పేరు మీద ఉందని, వారే హక్కుదారులని, వారిని ఇంటి నుంచి వెళ్ల గొట్టేహక్కు ఎవరికి లేదని ఆయన చెప్పి వారిని పంపించారు.

బాల్యానికి మూడుముళ్ళు



చలాకీగా చదువుకుంటూ... ఆటలాడుతూ గడపాల్సిన బాల్యం మూడుముళ్ళ బంధంతో బందీ అవుతుంది. శారీరక ఎదుగుదల మానసిక పరిపక్వత లేకుండానే పెళ్ళి కూతుర్లుగా మారుతున్న చిన్నారుల భ వితవ్యం మధ్యలోనే ముగిసిపోతుంది. చట్టా లు ఎన్ని ఉన్నా వాటిని ఖాతరు చేయని ప్రజ లు, గ్రామీణ ప్రాంతాలలో ఆడ పిల్లలపై ఉ న్న అపోహలు, పేదరికం, నిరక్షరాస్యత ఇలా కారణాలు ఏమైనా జిల్లాలో బాల్య వివాహాల కు అడ్డుకట్ట పడటం లేదు. దేశంలోనే బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల జాబితాలో మన జిల్లా 5వ స్థానంలో నిలిచింది. రాష్ట్రం లో బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో ఉండగా, మన జిల్లా రెండవ స్థానంలో నిలిచింది.

మార్కాపురం: జిల్లాలో జరుగుతున్న బాల్య వివాహాల్లో పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలో 80 శాతం జరుగుతున్నట్లు రికార్డుల్లో నమోదు అవుతుంది. గత 3 సంవత్సరాలుగా నిలిపివేసిన బాల్య వివాహాలు జాబితాలు పరిశీలిస్తే 2014లో 237, 2015లో 274, 2016లో 249 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు 9వ తేదీ నాటికి అధికారులు నిలిపివేసిన బాల్య వివాహాలు 135గా చెబుతున్నారు. ఇందులో ఎక్కువగా మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలో వివాహాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈనెల 4న ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో ఒకే రోజు జరుగుతున్న మూడు బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు.

బాల్య వివాహానికి కారణాలు అనేకం

చిన్న వయస్సులోనే వివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవటానికి కారణాలు అనేకంగా కనిపిస్తున్నాయి. ఆడ పిల్లపై గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అభద్రతభావంతో ఎక్కువ మంది చిన్న వయస్సులోనే వారికి మూడు ముళ్ళు వేసేస్తున్నారు. ఆడ పిల్లలను ఉన్నత చదువుల వైపు పంపేందుకు కూడా కొందరు ఇష్టపడకపోవటం, చాలా కుటుంబాల్లో ఉన్న పేదరికం కారణంగా అర్ధంతరంగా పసి వయస్సులోనే ఆడ పిల్లలు పెళ్ళికూతుళ్లుగా మారిపోతున్నారు. పైగా బంధువులు, రక్త సంబందీకుల సంబంధాలు పోతాయంటూ మేనరికం అడ్డుపెట్టుకొని కూడా వివాహాలు చేస్తున్నారు. మేనరికం వల్ల వచ్చే అనర్ధాలను గ్రామాలలో ప్రచారం చేయటంలో కాని, ప్రజల్లో అవగాహన కల్పించటంలో గాని ఐసీడీఎస్ అధికారులు వెనుకబడి ఉన్నారని చెప్పక తప్పదు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని సమాచారం తెలుసుకున్న తరువాత నిలిపివేసినా ప్రయోజనం ఉండటం లేదు. తరువాత యథావిధిగా కొన్ని రోజుల విరామం తీసుకొని యథేచ్ఛగా వివాహాలు చేస్తున్నారు. అధికారులు మాత్రం తాము ఇన్ని వివాహాలు నిలిపివేశామని రికార్డుల్లో లెక్కలు చూపుకుంటున్నారు.

> **పెళ్ళి కూతురుగా మారుతున్న చిన్నారులు**
> **చట్టాలు ఎన్ని ఉన్నా నిరుపయోగం**
> **బాల్య వివాహాల్లో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానం**

బాల్య వివాహాల వల్ల నష్టాలు

చిన్న వయస్సులోనే ఆడ పిల్లలకు పెళ్ళిళ్లు చేయటం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో అనర్ధాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చటం ద్వారా ప్రసవ సమయంలో ఇబ్బందులు రావటం, కొన్ని సందర్భాలలో మాతృ మరణాలు సంభవించటం జరుగుతాయి. అంతేకాకుండా పుట్టే బిడ్డను కూడా అంగవైకల్యంతో పుట్టటం జరుగుతుందని, తల్లి శారీరక ఎదుగుదలలో కూడా ఆటంకాలు ఏర్పడి అనారోగ్యం పాలవుతారని చెబుతున్నారు. ఇవన్ని ప్రజల్లో ఎక్కువగా ప్రచారం నిర్వహించాల్సిన దానికి బదులుగా వివాహాలు జరుగుతున్నాయన్న సమయంలో అధికారులు అప్రమత్తమవుతున్నారు. పైగా బాల్య వివాహాలు జరుపుతున్న వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవటంలో కూడా అధికారులు ఉదాశీన వైఖరి అవలంభిస్తున్న కారణంగా బాల్య వివాహాలు యథేచ్ఛగా జరిగిపోతూనే ఉన్నాయి.

చట్టాలు నిరుపయోగం

బాల్య వివాహాలను అరి కట్టేందుకు 2006లో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం బాల్య వివాహం ప్రోత్సహించిన వారికి, వి వా హం జరుపుతున్న వారికి, పెండ్లి పత్రికలు ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ యజమానికి రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. అయితే, ఇవి ఎక్కడా అమలు కావటం లేదు. కేసులు నమోదుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వకుండా కౌన్సెలింగ్ ద్వారానే అరికట్టాలని భావిస్తున్నారు. ఈ కారణంగా ఎటువంటి భయం లేకుండా బాల్య వివాహాలను జరుపుతున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 895 బాల్య వివాహాలను అధికారులు నిలిపివేస్తే, జిల్లాలో పట్టుమని పది కేసులు కూడా నమోదు కాలేదనటం చట్టాలు నిరుపయోగంగా ఉన్నాయనటానికి నిదర్శనం.

2006 చట్టం ప్రకారం ప్రతి పంచాయతీలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన కమిటీని నియమించాల్సి ఉంది. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై ఆ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాలపై చర్చించి చర్యలు తీసుకునేందుకు అధికారుల దృష్టికి తీసుకురావాలి. ఇది ఎక్కడా అమలు జరుగుతున్న దాఖలాలు లేవు.

అపోహలు వీడేలా ప్రచారం జరగాలి

సాగర్, చైల్డ్ లైన్ ప్రతినిధి



బాల్య వివాహాలు అరికట్టేందుకు ముఖ్యంగా గ్రామాలలో ఆడ పిల్లలపై చిన్నచూపు, అపోహలు తొలిగిపోయేలా ప్రచారం నిర్వహించాలి. అవసరమైన సమయంలో చట్టాన్ని ఉపయోగించి అధికారులు కూడా కఠినంగా వ్యవహరించకపోతే ప్రజల్లో భయం లేకుండా పోతుంది. కే వలం వివాహాలు జరుగుతున్న సమయంలోనే కాకుండా అన్ని వేళల్లో బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలి.

వర్షాకాలం.. మీ బైకు భద్రం!



కొద్ది పాటి జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలు

చినుకుపడితే చిత్తడయ్యే రోడ్లు.. అడుగడుగునా బురద, గోతులు.. వర్షాకాలం వచ్చిందంటే చాలు ద్విచక్రవాహనాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. నిండా బురదతో అధ్వానంగా తయారవుతాయి. చాలా మంది ఆ బురదను తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇది సరికాదంటున్నారు మన మెకానిక్‌లు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ కాలం మన్నుతాయని చెబుతున్నారు.

◆ ఒంగోలు

● చిన్న చిన్న విడిభాగాల్లో సమస్యలు...


- వర్షం కారణంగా వీల్స్ బేరింగ్‌లో నీరు చేరే ప్రమాదం ఉంది. నీళ్ల అరిపోయాక బేరింగ్‌లో అయిల్ పోయడం మంచిది. రోడ్డపై ఏర్పడే గుంతల్లో వాహనాలు వేగంగా వెళితే ఈ బేరింగ్స్‌లోని బాల్స్ దెబ్బతింటాయి.
- చైన్ ప్యాకెట్ కవర్ ఉన్నా లోనికి నీరు చేరే ప్రమాదముంది. దీంతో గడగడ శబ్దం వస్తుంది. వెంటనే గ్రీస్ రాయాలి. అయిల్ పోయాలి. దీన్ని ఉపేక్షిస్తే చైన్ వదులుగా మారి, ఆపై చెడిపోతుంది.
- షాక్‌అబ్జల్ దెబ్బతింటే షాకింగ్, అబ్జార్బింగ్‌లలో ఇబ్బందులు తప్పవు.

● చిన్న చిన్న విడిభాగాల్లో సమస్యలు...

- వర్షంలో బయటకు వెళ్లివచ్చాక ఒక్కసారి శుభ్రంగా తుడవాలి.
- వాహనం టైర్లలో గాలిని తరుచూ చెక్ చేయించుకోవాలి.
- గుంతల్లోంచి జాగ్రత్తగా వెళ్లాలి. లేదంటే పడిపోయే ప్రమాదముంది.
- ఇంజిన్‌లోకి నీరు చేరకుండా చూసుకోవాలి.
- సైలెన్సర్‌పై పడే బురద మరకలను వెంటనే తుడిచేయాలి.
- వర్షం నీరు కారణంగా బ్రేకులు, కిక్‌రాడ్లు, క్లచ్, గేర్లు జామ్ అయ్యే ప్రమాదముంది. సర్వీసింగ్‌కు ఇచ్చి, ఆయిల్, గ్రీస్ వేయించాలి.
- వాహనం బయట పార్క్ చేయాల్సి వస్తే వర్షం నేరుగా ఇంజిన్‌పై పడకుండా, మధ్య స్టాండ్ వేయాలి.

● ఇంజిన్ జర భద్రం...

ఏ వాహనానికైనా ఇంజిన్ గుండెకాయలాంటిది. ఇది దెబ్బతింటే వేలకువేలు పెట్టాల్సిందే! వర్షాలతో రోడ్లపై పెద్దమొత్తంలో నీరు నిల్వడం సహజం. అందులోంచి దూసుకుపోయినప్పుడు సైలెన్సర్‌లోకి నీరు చేరుతుంది. వెంటనే ప్రభావం చూపకున్నా రెండు రోజుల తర్వాత గరగర శబ్దం మొదలై, ఆ ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది. నీటిలో తడిచి ఆయిల్‌సీల్స్ సహా పలు విడిభాగాలు దెబ్బతింటాయి. అందువల్ల సైలెన్సర్ మునిగే నీళ్లలోంచి వెళ్లకపోవడమే మంచిది.



● సైలెన్సర్‌ను తుడిచేద్దాం..

వర్షాలకు త్వరగా దెబ్బతినే విడిభాగం సైలెన్సర్. నికెల్ కోటింగ్‌తో ఉండే సైలెన్సర్‌కు మట్టి, బురద అంటినప్పుడు శుభ్రం చేయకుంటే ఆ కోటింగ్ దెబ్బతింటుంది. అందువల్ల సైలెన్సర్‌కు అంటిన బురదను ఎప్పటికప్పుడు తుడిచివేయాలి. లేకపోతే రంధ్రాలు పడి, గరగర శబ్దం వస్తుంది. ఆ తర్వాత కొత్తది కొనక తప్పదు. ప్రస్తుతం మార్కెట్లో కొత్త సైలెన్సర్ ధరలు రూ. 1600 నుంచి రూ.1800 వరకు ఉన్నాయి. 150సీసీ బైక్‌లకైతే రూ.2 వేలపైగానే ఉంటున్నది. అందువల్ల సైలెన్సర్‌ను ఎప్పటికప్పుడు తుడుచుకోవడం ఉత్తమం.



● మడ్‌గార్డ్, రీములు

బురదతో దెబ్బతినే విడిభాగాల్లో రీములు, మడ్‌గార్డ్‌లు ముఖ్యమైనవి. బురద అంటినప్పుడు ఎక్కువ కాలం వాటర్ సర్వీసింగ్ చేయించకుండా ఉంటే ఫైబర్ మడ్‌గార్డు, నికెల్ కోటింగ్ ఉన్న ఉక్కు రీములైనా, స్టీల్ రీములైనా దెబ్బతింటాయి. అందువల్ల వర్షంలో తడిసినా, బురద పట్టినా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. లేదా సర్వీసింగ్ చేయించాలి.



● పెట్రోల్ ట్యాంక్ జాగ్రత్త..

పెట్రోల్‌ట్యాంక్‌కు ఎంత పకడ్డందీ మూత ఉన్నా వర్షం జోరందుకుంటే నీరు లోనికిపోతుంది. పెట్రోల్‌తోసహా కార్బొరేటర్‌లోకి చేరుతుంది. వెంటనే వాహనం మొరాయిస్తుంది. అంతటితో అగితే ఫర్వాలేదు. కార్బొరేటర్ నుంచి వెళ్లే వాల్వ్ ద్వారా ఇం జిన్‌కు నీరు చేరితే మర మ్మతులు తప్పవు. భా రీ వర్షం కురిసినప్పుడు వర్షంలో ఉంచ కపోవడమే మంచిది.



ఎస్‌జీటీలను నేడు రిలీవ్ చేయండి

ఒంగోలు విద్య : జిల్లాలో బదిలీ అయిన సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులను ప్రస్తుతం తాము పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ చేసి పంపాలని డీఈవో విజయభాస్కర్ ఆదేశించారు. గురువారం రిలీవ్ అయిన ఉపాధ్యాయులందరూ శుక్రవారం కొత్తపాఠశాలల్లో చేరాలని ఆయన ఆదేశించారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సిద్ధంచేసి ఉంచాలని ఎంఈవోలను ఆదేశించారు.

ప్రస్తుతం ఎస్‌జీటీ బదిలీ ఉత్తర్వులు పాత తేదీలతోనే జనరేట్ అవుతున్నాయి. తేదీల మార్పు కోసం మూడు రోజులుగా ఎదురు చూసినా ఫలితం దక్కలేదు. వెబ్ సైట్‌లో బదిలీ ఉత్తర్వులు ఒకసారి జనరేట్ ఆయితే మళ్లీతేదీలు మార్చి కొత్త ఉత్తర్వులు జనరేట్ కావు. దీంతో ఉపాధ్యాయులు పాత తేదీలతోనే బదిలీ ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకొని రిలీవ్ కావాలని తెలిపారు. భాషాపండితులకు అప్‌గ్రేడ్ పోస్టుల్లోకి శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

దొనకొండలో మెగా ఇండస్ట్రియల్ పార్కు

- ఒంగోలును ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- కలెక్టర్‌తో భేటీ అయిన ఆయా సంస్థల ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్: దొనకొండలో ఏర్పాటుచేయనున్న మెగా ఇండస్ట్రియల్ పార్కు, ఒంగోలు నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు వి.రామనాథ్ తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్‌ను వి.రామనాథంతో పాటు ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఈవో ప్రకాష్ గౌతమ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. వి.రామనాథ్ మాట్లాడుతూ త్వరలో దొనకొండలో మెగా ఇండస్ట్రియల్ పార్కు రూపు దిద్దుకోనుందన్నారు. రాష్ట్ర నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి కావాల్సిన నిర్మాణ సామగ్రిని తయారుచేసే యూనిట్లను దొనకొండలో నెలకొల్పేందుకు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఇందుకోసం 20వేల ఎకరాల స్థలం అవసరం ఉందన్నారు. అమరావతికి దగ్గరగా దొనకొండ ఉండటంతో ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. స్థలం ఎంపిక పరిశీలన కోసం వారం రోజుల్లో దొనకొండకు వస్తామన్నారు. ఈవిషయంపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడనున్నట్లు తెలిపారు. అలాగే దొనకొండలో టైటాన్ సివిల్ ఏవియేషన్, కాస్మి చైనా బిల్డింగ్ మెటీరియల్, స్పానిష్ వెహికిల్ టెక్నాలజి టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకోసం సమన్వయం చేస్తున్నామన్నారు.

ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఈవో ప్రకాష్ మాట్లాడుతూ ఒంగోలు నగరంతో పాటు శ్రీకాకుళం, ఏలూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం నగరాలను ఆకర్షణీయ నగరాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. అందులో భాగంగా ఆ నగరాల్లో అన్నిరకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్రణాళికలు రూపొందించి ఆర్థిక వనరులు సమీకించడం జరుగుతుందన్నారు. అందుకు కలెక్టర్ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్‌చంద్ మాట్లాడుతూ దొనకొండలో వీలైనంత త్వరగా పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఒంగోలు నగరాన్ని ఉన్నత శ్రేణి ప్రమాణాలతో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచే విధంగా ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం తగదు!

ఒంగోలు విద్య: జిల్లా మార్కెటింగ్ సొసైటీలో (డీసీఎంఎస్) జరిగిన అవకతవకలకు సంబంధించి విచారణాధికారి పురుషబాబు పీడీసీసీ బ్యాంకు స్టాఫ్ అసిస్టెంట్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు సమన్లు జారీ చేసి సంబంధం లేని విచారణతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఏపీ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఏసుపాదం, పి. చైతన్య, ఎన్.స్ఫూర్తికిరణ్, ఆర్.గౌతమ్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విచారణ పేరుతో బ్యాంకు ఉద్యోగులను పదేపదే పిలవడం సరైన విధానం కాదన్నారు. డీసీఎంఎస్ కనిగిరి ఆస్తి వేలానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు బ్యాంకు ఉద్యోగులను బలిపశువును చేయవద్దని కోరారు. వేలం ద్వారా వచ్చిన సొమ్ము మొత్తం బ్యాంకులో పనిచేస్తున్న డీఆర్ ఓఎస్డీ పేరు మీద సస్పెన్స్ ఖాతాలో ఉందని తెలిపారు. ఆ సొమ్ముమీద లావాదేవీలు నిరోధించే అధికారం పూర్తిగా వారికే ఉందన్నారు. ఇందులో బ్యాంకుకు, ఉద్యోగులకు ఎటువంటి ప్రమేయం ఉండదన్నారు. సంబంధంలేని విషయాలపై విచారణ పేరుతో విచారణాధికారి పదే పదే పిలిపించడంతో బ్యాంకు దైనందిన కార్యక్రమాలకు విఘాతం కలగడంతో పాటు రైతులకు అసౌకర్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఉద్యోగులను భయభ్రాంతులు మానసిక క్షోభకు గురిచేస్తున్న విచారణాధికారి తీరును వారు తీవ్రంగా ఖండించారు.

జిల్లాకు హార్టీకల్చర్ కళాశాల మంజూరు

ఒంగోలు విద్య: జిల్లాకు హార్టీకల్చర్ కళాశాల మంజూరైంది. గుడ్లూరు మండలం చినలాటరపి గ్రామంలో 2017-18విద్యా సంవత్సరం నుండి కళాశాల ఏర్పాటుకు అనుమతిస్తూ డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలకు 50సీట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం కళాశాల మంజూరైన చినలాటరపిలో మౌలికవసతులు లేకపోవడంతో యూనివర్సిటీ కేంద్రమైన పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరం కళాశాలను నిర్వహించనున్నారు. కళాశాలకు కేటాయించిన 50 సీట్లను భర్తీచేసి మొదటి సెమిస్టర్‌ను వెంకటరామన్నగూడెం కళాశాలలోనే నిర్వహించనున్నారు. కళాశాలకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేసింది. జిల్లాలో హార్టీకల్చర్ కళాశాలకు విడుదలైన నిధుల వినియోగానికి సంబంధించి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా లు, నగదు పుస్తకాలు అకడమిక్ రికార్డులు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రయివేటు ట్రేడర్లకు అనుమతి

- సుబాబుల్ కొనుగోళ్లపై ప్రభుత్వ ఉత్తర్వులు
- అమలుపై రైతులలో సందేహాలు

ఒంగోలు, ఆంధ్రజ్యోతి: సుబాబుల్, జామాయిల్ వంటి సామాజిక వనాల కర్ర కనుగోళ్ళు విధానంలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. మిల్లర్లతో పాటు ప్రయివేటు ట్రేడర్లు వాటిని కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈమేరకు బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు 2016 ఫిబ్రవరి 19న ప్రభుత్వం జారీచేసిన జీవో నెం.143 ప్రకారం రాష్ట్రంలో ఏఎంసీల ద్వారా పేపరు మిల్లుల వారు సుబాబుల్, జామాయిల్ కర్ర కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం సక్రమంగా అమలు జరగడంలేదని దళారులు పాత్ర అధికమై కనీస ధరలు కూడా దక్కడం లేదని రైతాంగం ఆరోపిస్తున్నది. ఇదేవిషయమై పదిరోజుల క్రితం ఒంగోలులో రైతాంగం పెద్దఎత్తున ఆందోళన కూడా చేపట్టింది.

కాగా, ఈవిధానంలో మార్పులుచేసి రైతులకు ఉపయుక్తంగా ఉండేలా ప్రైవేటు ట్రేడర్లను కూడా కొనుగోళ్లకు అనుమతించాలన్న డిమాండ్ ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. ఇందుకు సంబంధించి 2016 జూన్‌లో నెల్లూరు కలెక్టర్, అదే ఏడాది ఆగస్టులో మన జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖలు వ్రాశారు. అమలులో ఉన్న జీవో నెం. 143 ప్రకారం మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారని అలేఖలో ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో రెండు పేపర్‌మిల్లుల ఆధిపత్యం వల్ల తీవ్ర నష్టం జరుగుతున్నదని ప్రైవేటు వ్యాపారులకు అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు 2016 ఆగస్టు 8న అప్పటి మనజిల్లా కలెక్టర్ సుజాత శర్మ ప్రభుత్వానికి లేఖ వ్రాశారు. అలాగే, నెల్లూరు జిల్లాలో రైతులతో జరిగిన సమావేశంలో ప్రయివేటు ట్రేడర్లను అనుమతించాలని రైతులు కోరారని 2016 జూన్ 16న అప్పటి జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఏఎంసీల నుంచి లైసెన్సులు పొందిన ట్రేడర్లను మాత్రమే అనుమతించారు. అలాగే, గుర్తింపు పొందిన వేబ్రిడ్జిల వద్ద కాటాలో తూకం, బ్యాంకు అకౌంట్ల ద్వారా రైతులకు నగదు కోరినట్లు ఆలేఖలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆలేఖలో ఆధారంగా మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ప్రభుత్వానికి నివేదించగా తుది పరిశీలన అనంతరం సామాజిక వనాల కర్ర కొనుగోళ్లకు ప్రయివేటు ట్రేడర్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గత కర్ర కొనుగోళ్లకు సంబంధించి ఇచ్చిన జి.ఓ 143కి సవరణ ఇస్తూ తాజా ఉత్తర్వులు ఇచ్చారు.

కాగా కర్ర కొనుగోళ్లలో ఇతర మార్గదర్శకాలు అన్నీ జీవో నెం.143కి లోబడే ఉంటాయని తాజా ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్ పోకడ చూస్తే ప్రభుత్వం ఏతరహా ఉత్తర్వులు ఇచ్చినా, ఎలాంటి విధానం అమలులోకి తెచ్చినా, సామాజిక వనాల మార్కెట్‌లో దళారులు పాత్ర అధికంగానే ఉండి రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికారా ఆయా కంపెనీలకు ఏజంట్లుగా, దళారులుగా పనిచేస్తున్న వారు తాజా ఉత్తర్వులు ఆధారంగా ప్రయివేటు ట్రేడర్లుగా అవతారం ఎత్తే అవకాశం కూడాలేకపోలేదు. అదే జరిగితే రైతుల కోరిక, ప్రభుత్వం ఆలోచన వృథా ప్రయాసగానే మిగలక తప్పదు.

11 నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్ : జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు స్థానిక హైదరీ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాకుల సుబ్బారావు చెప్పారు. బుధవారం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే రాష్ట్ర మ్యాచ్‌లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతి రోజూ 60 మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అబ్బూరి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ సుకుమార్, ఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ యాప్‌పై టీడీపీ నగర కమిటీ అవగాహన

నగరంలో దొంగతనాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ యాప్‌పై టీడీపీ నగర కమిటీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టూటౌన్ సీఐ దేవప్రభాకర్‌తో కలిసి మరాఠీపాలెంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి, దొంగతనాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నగర కమిటీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దాయినేని ధర్మ, షేక్ సైదా, చంద్ర పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఆందోళన

ఒంగోలు కలెక్టరేట్ : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్న ఫెడరేషన్ నాయకులు వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నినాదాలు చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలదంకి నరసింగరావు, గుంటూరి రంజిత్, ఎం. అక్కారావు, సురభి, కుమార్, వై. పౌలు, సిహెచ్. ఆగస్టీన్, చిన్న, సుబ్బారావు, విజయ్, తిరుమలరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సినీ హీరో మహేష్ జన్మదిన వేడుకలు

సూపర్‌స్టార్ ప్రిన్స్ మహేష్‌బాబు సేవాదళ్ ఆధ్వర్యంలో స్థానిక కొప్పోలు రోడ్డులోని రాజీవ్ గృహ కల్ప రెండో లైనులో సినిమా హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు గంటా సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహేష్‌బాబు జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. మహేష్‌బాబు యూత్ ఫోర్స్ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, అఖిల్, ఆల్ఫా, సునీల్, రాకేష్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి తినిపిస్తున్న అభిమానులు

వైభవంగా రాఘవేంద్రస్వామి పూర్వారాధన

ఒంగోలు కల్చరల్ : శ్రీ గురురాఘవేంద్రస్వామి పూర్వారాధన మహోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. సంతపేటలోని రాఘవేంద్ర బృందావనంలో జరుగుతున్న శ్రీ గురు రాఘవేంద్ర 346వ ఆరాధనోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీ రాఘవేంద్ర స్వామి అష్టోత్తర శత సమష్టి పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ, గోక్షీరాభిషేకం, మహా పంచామృత అభిషేకాలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి గోపీచంద్, కార్యదర్శి మండవ వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షులు దేవరపల్లి మధుసూదనరెడ్డి, కోశాధికారి పెనుబోతు నవీన్‌కుమార్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. గురువారం ఉదయం ఉత్తర ఆరాధన, అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు.

ఉలిచిలో నివాసగృహాలకు జియోట్యాగింగ్

ఒంగోలు రూరల్ : ఒంగోలు మండలం ఉలిచిలో గృహాలకు జియోట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్ చేశామని ఈఓఆర్‌డీ ఎ.బాలచెన్నయ్య చెప్పారు. ఒంగోలు మండల కార్యాలయంలో బుధవారం ఈఓఆర్‌డీ ఎ.బాలచెన్నయ్య మాట్లాడుతూ మొత్తం 738 ఇళ్లకు జియోట్యాగింగ్ చేశామని, పన్ను కూడా 4లక్షల 38 రూపాయలు నిర్ధారించామన్నారు. గ్రామసర్పంచ్ యర్రంనేని అంజమ్మ, గ్రామ కార్యదర్శి ఉషాకిరణ్ సహకారంతో పూర్తయిందని చెప్పారు.

సమాజ సేవ కోసమే యూత్ కాంగ్రెస్ ఏర్పాటు

ఒంగోలు కలెక్టరేట్ : యువకులు సమాజ సేవ పట్ల అంకిత మవ్వాలనే ఉద్దేశంతో యువజన కాంగ్రెస్ ఆవిర్భవించిందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుర్రాల రాజ్‌విమల్ చెప్పారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో బుధవారం జరిగిన అఖిల భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దిన వేడుకలకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలోనే 70 లక్షల సభ్యత్వం కలిగిన అతి పెద్ద సంస్థగా యువజన కాంగ్రెస్ ఎదిగిందని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు ఈదా సుధాకర్, ఎస్ఎన్‌పాడు, కనిగిరి ఇన్‌చార్జులు వేమా శ్రీనివాసరావు, పాశం వెంకటేశ్వర్లు, మన్నం వెంకయ్య, సురేష్, రసూల్, నాయబ్, జయప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లాలో 22.3 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 22.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నాగులుప్పలపాడు మండలంలో 98.0మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పీసీపల్లి మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. యద్దనపూడిలో 94.6 మి.మీ, పొదిలిలో 77.4, చీమకుర్తిలో 76.6, హనుమంతునిపాడులో 70.6, కొత్తపట్నంలో 65.2, కారంచేడులో 56.6, పర్చూరులో 50.6, మర్రిపూడిలో 49.4, చినగంజాంలో 43.6, దర్శిలో 39.0, కొనకనమిట్లలో 36.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, మార్టూరులో 36.2మి.మీ, చీరాలలో 35.6, సంతనూతలపాడులో 33.2, మద్దిపాడులో 32.4, ఒంగోలులో 31.8, అద్దంకిలో 30.0, కొరిశ పాడులో 30.0, కురిచేడులో 24.0, పెద్దారవీడులో 21.2, మార్కాపురంలో 19.6, పుల్లలచెరువులో 18.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అదేవిధంగా, యర్రగొండపాలెంలో 17.8మి.మీ., జే. పంగులూరులో 17.4, బల్లికురవలో 16.6, దోర్నాలలో 16.6, తర్లుబాడులో 13.6, వేటపాలెంలో 13.4, తాళ్ళూరులో 12.4, త్రిపురాంతకంలో 11.6, కొండపిలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు నగరం: వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో యాస్మిన్ కోరారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశం హాలులో బుధవారం జరిగిన వైద్యాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే వెంటనే తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న శానిటేషన్ నిధుల వినియోగం కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు చేరిన రాజీవ్ సద్భావన యాత్ర

ఒంగోలు కలెక్టరేట్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని తమిళనాడు రాష్ట్రంలోని పెరంబదూర్ నుంచి ప్రారంభమైన రాజీవ్ సద్భావన యాత్ర బుధవారం రాత్రి ఒంగోలుకు చేరింది. స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్‌లో సద్భావన యాత్రకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ యాత్ర ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతి రోజున ఢిల్లీకి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ గుర్రాల రాజ్‌విమల్, శ్రీపతి ప్రకాశం, దాసరి నాగలక్ష్మీ, పాశం వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మారెడ్డి, రంగస్వామి, రవి, నవీన్, నరేష్, కె. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునిగా అహ్మద్‌పటేల్ విజయంపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్: గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ సలహాదారు అహ్మద్ పటేల్ విజయం సాధించడం పట్ల డీసీసీ అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు శ్రీపతి ప్రకాశంలు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నీతికి-నిజాయితీకి మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో నీతి గెలిపించిందన్నారు. రాజ్యసభ సీటు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలుపన్ని కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ముఖ్యనాయకులపై వివిధ ప్రభుత్వ రంగ సంస్థలతో దాడులు చేయించినా కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ ఘన విజయం సాధించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ రాయితీలపై అవగాహన కలిగిఉండాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న జీఎం ఆనంద్‌కుమార్

ఒంగోలు నగరం: జిల్లాలోని పరిశ్రమల యజమానులు ప్రభుత్వ రాయితీలపై తగిన అవగాహన ఉండాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ఆనందకుమార్ అన్నారు. రాయితీలను పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశం హాలులో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేకమంది సరైన అవగాహన లేక పోవటంతో రాయితీలను పొందలేక పోతున్నారన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, విద్యుత్తు రాయితీ, పన్ను మినహాయింపు, స్టాంపు డ్యూటీ మినహాయింపులు ఇస్తుందన్నారు. ఈ రాయితీలు జిల్లాకు విడుదల చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల యజమానులు ఈ నెలాఖరులోగా రాయితీలు పొందేందుకు తగిన డాక్యుమెంట్లతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో డిక్కీ జిల్లా కో ఆర్డినేటర్ వి.భక్తవత్సలం, సిండికేట్ బ్యాంకు ఎల్‌డీఎం వెంకటేశ్వర్‌రావు, ఐఎల్ఏ ప్రతినిధి కె.నరేశ్వరరావు, మార్టూరు గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘం నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. వేదికతో పాటు స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌మురళీ, స్టెప్ సీఈవో డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పక్కాదారి పడుతున్న డీసీఎంఎస్ విచారణ


ఒంగోలు విద్య: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) సినిమా వ్యాపారంపై జరుగుతున్న విచారణ పక్కదారి పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధం లేని వారిని కూడా పిలిచి విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సహకార సంఘాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సినిమా వ్యాపారం నిర్వహించారు. ఈ వ్యాపారంలో డీసీఎంఎస్‌కు తీవ్ర నష్టాలు వచ్చాయి. ఈ విషయం రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ దృష్టికి వెళ్లడంతో ఆయన డీసీవో నుంచి నివేదిక తెప్పించుకొని ఏడుగురు ఆడిటర్లు, అసిస్టెంటు రిజిస్ట్రార్‌లను సస్పెండ్ చేశారు. ఈ విషయంపై నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణకు ఆదేశించారు. నర్సరావుపేట డీఆర్‌గా పనిచేస్తున్న సీహెచ్ పురుషబాబును విచారణాధికారిగా నియమించారు. విచారణలో ఆయనకు సహకరించేందుకు మరో అధికారుల బృందాన్ని ఆయనకు కేటాయించారు. పురుషబాబు డీసీఎంఎస్‌పై విచారణను ముమ్మరం చేశారు.

అయితే, ఈ విచారణ పక్కాదారి పడుతుందని బ్యాంకు సిబ్బంది ఆరోపిస్తున్నారు. బ్యాంకు సిబ్బందికి సంబంధం లేని విషయంలో నోటీసులు ఇచ్చి పిలిపించి భయభ్రాంతులకు లోను చేస్తున్నారని బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

సంబంధం ఉన్న వారినే పిలిచా : పురుషబాబు

డీసీఎంఎస్‌తో వ్యాపార లావాదేవీలు ఇతరత్రా సంబంధం ఉన్న అధికారుల ను మాత్రమే విచారణకు పిలిచామని విచారణాధికారి పురుషబాబు తెలిపారు. సంబంధం లేనివారికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలవలేదన్నారు. విచారణ మరోవారం రోజుల్లో పూర్తవుతుందని, నెలాఖరులోపు విచారణ నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తానని పురుషబాబు తెలిపారు.

దినఫలాలు



అదృష్టసంఖ్యలు: 1, 3




మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. దూరంలో ఉన్న ప్రియతములు కలయిక ఆనందం కలిగిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ రంగాల వారికి శుభప్రదం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వేడుకలు, శుభకార్యాలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. గృహ రుణాలు మంజూరవుతాయి. సహకార సంఘాలు, కాలనీ సమావేశాల్లో పాల్గొంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ప్రముఖులతో సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. పెద్దల సహకారంతో విద్యాసంస్థలతో పనులు పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థికపరమైన సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. దూరప్రయాణాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. ఆర్థిక విషయాల్లో బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. సంకల్పం ఫలిస్తుంది.



సింహరాశి: (జూలై24-ఆగస్టు23): రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పాత వస్తువుల విక్రయంపై దృష్టి సారిస్తారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. పెట్టుబడులపై దృష్టి పెడతారు.



కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. న్యాయ పోరాటాల్లో విజయం సాధిస్తారు. దూరంలో ఉన్న బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సహోద్యోగుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. వృత్తిపరమైన శిక్షణకు అనుకూలం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): చిన్నారులు విషయంలో పెద్దలుగా మీ బాధ్యత నిర్వర్తిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వేడుకలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఉత్సాహం కలిగించే సమాచారం అందుతుంది. సంకల్పం ఫలిస్తుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): విద్య, ప్రయాణాలు, కాంట్రాక్టు వ్యవహారాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రవాణా, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సన్నిహితుల అంతరంగం తెలుసుకుని నడుచుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో ఆర్థికంగా లాభిస్తుంది. పెట్టుబడుల్లో ప్రోత్సాహకరం. విలువైన వస్తువులు సేకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు వినోదాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. పట్టుదలతో పనిచేసి లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ప్రయివేటు ట్రేడర్లకు అనుమతి

- **సుబాబుల్ కొనుగోళ్లపై ప్రభుత్వ ఉత్తర్వులు**
- **అమలుపై రైతులలో సందేహాలు**

ఒంగోలు, ఆంధ్రజ్యోతి: సుబాబుల్, జామాయిల్ వంటి సామాజిక వనాల కర్ర కొనుగోళ్ళు విధానంలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. మిల్లర్లతో పాటు ప్రయివేటు ట్రేడర్లు వాటిని కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈమేరకు బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు 2016 ఫిబ్రవరి 19న ప్రభుత్వం జారీచేసిన జీవో నెం.143 ప్రకారం రాష్ట్రంలో ఏఎంసీల ద్వారా పేపరు మిల్లుల వారు సుబాబుల్, జామాయిల్ కర్ర కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం సక్రమంగా అమలు జరగడంలేదని దళారులు పాత్ర అధికమై కనీస ధరలు కూడా దక్కడం లేదని రైతాంగం ఆరోపిస్తున్నది. ఇదేవిషయమై పదిరోజుల క్రితం ఒంగోలులో రైతాంగం పెద్దఎత్తున ఆందోళన కూడా చేపట్టింది.

కాగా, ఈవిధానంలో మార్పులుచేసి రైతులకు ఉపయుక్తంగా ఉండేలా ప్రైవేటు ట్రేడర్లను కూడా కొనుగోళ్లకు అనుమతించాలన్న డిమాండ్ ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. ఇందుకు సంబంధించి 2016 జూన్‌లో నెల్లూరు కలెక్టర్, అదే ఏడాది ఆగస్టులో మన జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖలు వ్రాశారు. అమలులో ఉన్న జీవో నెం. 143 ప్రకారం మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారని లేఖలో ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో రెండు పేపర్‌మిల్లుల ఆధిపత్యం వల్ల తీవ్ర నష్టం జరుగుతున్నదని ప్రైవేటు వ్యాపారులకు అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు 2016 ఆగస్టు 8న అప్పటి మనజిల్లా కలెక్టర్ సుజాత శర్మ ప్రభుత్వానికి లేఖ వ్రాశారు. అలాగే, నెల్లూరు జిల్లాలో రైతులతో జరిగిన సమావేశంలో ప్రయివేటు ట్రేడర్లను అనుమతించాలని రైతులు కోరారని 2016 జూన్ 16న అప్పటి జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఏఎంసీల నుంచి లైసెన్సులు పొందిన ట్రేడర్లను మాత్రమే అనుమతించారు. అలాగే, గుర్తింపు పొందిన వేబ్రిడ్జిల వద్ద కాటాలో తూకం, బ్యాంకు అకౌంట్ల ద్వారా రైతులకు నగదు కోరినట్లు ఆలేఖలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆలేఖలో ఆధారంగా మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ప్రభుత్వానికి నివేదించగా తుది పరిశీలన అనంతరం సామాజిక వనాల కర్ర కొనుగోళ్లకు ప్రయివేటు ట్రేడర్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గత కర్ర కొనుగోళ్లకు సంబంధించి ఇచ్చిన జి.ఓ 143కి సవరణ ఇస్తూ తాజా ఉత్తర్వులు ఇచ్చారు.

కాగా కర్ర కొనుగోళ్లలో ఇతర మార్గదర్శకాలు అన్నీ జీవో నెం.143కి లోబడే ఉంటాయని తాజా ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్ పోకడ చూస్తే ప్రభుత్వం ఏతరహా ఉత్తర్వులు ఇచ్చినా, ఎలాంటి విధానం అమలులోకి తెచ్చినా, సామాజిక వనాల మార్కెట్‌లో దళారులు పాత్ర అధికంగానే ఉండి రైతులు నష్టపోతున్నారు. ఇప్పటిదాకా ఆయా కంపెనీలకు ఏజంట్లుగా, దళారులుగా పనిచేస్తున్న వారు తాజా ఉత్తర్వులు ఆధారంగా ప్రయివేటు ట్రేడర్లుగా అవతారం ఎత్తే అవకాశం కూడాలేకపోలేదు. అదే జరిగితే రైతుల కోరిక, ప్రభుత్వం ఆలోచన వృధా ప్రయాసగానే మిగలక తప్పదు.

జిల్లాలో 22.3 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 22. 3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నాగులుప్పలపాడు మండలంలో 98.0మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా వీసీపల్లి మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. యద్దనపూడిలో 94.6 మి.మీ, పొదిలిలో 77.4, చీమకుర్తిలో 76.6, హనుమంతునిపాడులో 70.6, కొత్తపట్నంలో 65.2, కారంచేడులో 56.6, పర్చూరులో 50.6, మద్దిపాడులో 49.4, చినగంజాంలో 43.6, దర్శిలో 39.0, కొనకనమిట్లలో 36.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, మార్టూరులో 36.2మి.మీ, చీరాలలో 35.6, సంతనూతలపాడులో 33.2, మద్దిపాడులో 32.4, ఒంగోలులో 31.8, అద్దంకిలో 30.0, కొరిశ పాడులో 30.0, కురిచేడులో 24.0, పెద్దారవీడులో 21.2, మార్కాపురంలో 19.6, పుల్లలచెరువులో 18.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అదేవిధంగా, యర్రగొండపాలెంలో 17.8మి.మీ., జె. పంగులూరులో 17.4, బల్లికురవలో 16.6, దోర్నాలలో 16.6, తర్లుబాడు లో 13.6, వేటపాలెంలో 13.4, తాళ్ళూరులో 12.4, త్రిపురాంతకంలో 11.6, కొండపిలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు నగరం: వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ యాస్మిన్ కోరారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశం హాలులో బుధవారం జరిగిన వైద్యాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే వెంటనే తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న శానిటేషన్ నిధుల వినియోగం కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు చేరిన రాజీవ్ సద్భావన యాత్ర

ఒంగోలు కలెక్టరేట్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని తమిళనాడు రాష్ట్రంలోని పెరంబదూర్ నుంచి ప్రారంభమైన రాజీవ్ సద్భావన యాత్ర బుధవారం రాత్రి ఒంగోలుకు చేరింది. స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్‌లో సద్భావన యాత్రకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ యాత్ర ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతి రోజున ఢిల్లీకి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ గుర్రాల రాజ్‌విమల్, శ్రీపతి ప్రకాశం, దాసరి నాగలక్ష్మి, పాశం వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మారెడ్డి, రంగస్వామి, రవి, నవీన్, నరేష్, కె. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునిగా అహ్మద్‌పటేల్ విజయం పట్ల హర్షం

ఒంగోలు కలెక్టరేట్: గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ సలహాదారు అహ్మద్ పటేల్ విజయం సాధించడం పట్ల డీసీసీ అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు శ్రీపతి ప్రకాశంలు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నీతికి-నిజాయితీకి మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో నీతి గెలిపించిందన్నారు. రాజ్యసభ సీటు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలుపన్ని కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ముఖ్యనాయకులపై వివిధ ప్రభుత్వ రంగ సంస్థలతో దాడులు చేయించినా కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ ఘన విజయం సాధించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ రాయితీలపై అవగాహన కలిగిఉండాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న జీఎం ఆనంద్‌కుమార్

ఒంగోలు నగరం: జిల్లాలోని పరిశ్రమల యజమానులు ప్రభుత్వ రాయితీలపై తగిన అవగాహన ఉండాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ఆనందకుమార్ అన్నారు. రాయితీలను పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశం హాలులో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేకమంది సరైన అవగాహన లేక పోవటంతో రాయితీలను పొందలేక పోతున్నారన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, విద్యుత్తు రాయితీ, పన్ను మినహాయింపు, స్టాంపు డ్యూటీ మినహాయింపులు ఇస్తుందన్నారు. ఈ రాయితీలు జిల్లాకు విడుదల చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల యజమానులు ఈ నెలాఖరులోగా రాయితీలు పొందేందుకు తగిన డాక్యుమెంట్లతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో డిక్కీ జిల్లా కో ఆర్డినేటర్ వి.భక్తవత్సలం, సిండికేట్ బ్యాంకు ఎల్‌డీఎం వెంకటేశ్వరరావు, ఐఎల్‌ఏ ప్రతినిధి కె.సర్వేశ్వరరావు, మార్టూరు గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘం నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. వేదికతో పాటు స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌మురళి, స్టెప్ సీఈవో డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పక్కాదారి పడుతున్న డీసీఎంఎస్ విచారణ

ఒంగోలు విద్య: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) సినిమా వ్యాపారంపై జరుగుతున్న విచారణ పక్కదారి పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధం లేని వారిని కూడా పిలిచి విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సహకార సంఘాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సినిమా వ్యాపారం నిర్వహించారు. ఈ వ్యాపారంలో డీసీఎంఎస్‌కు తీవ్ర నష్టాలు వచ్చాయి. ఈ విషయం రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ దృష్టికి వెళ్లడంతో ఆయన డీసీవో నుంచి నివేదిక తెప్పించుకొని ఏడుగురు ఆడిటర్లు, అసిస్టెంటు రిజిస్ట్రార్‌లను సస్పెండ్ చేశారు. ఈ విషయంపై నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణకు ఆదేశించారు. నర్సరావుపేట డీఆర్‌గా పనిచేస్తున్న సీహెచ్ పురుషబాబును విచారణాధికారిగా నియమించారు. విచారణలో ఆయనకు సహకారించేందుకు మరో అధికారుల బృందాన్ని ఆయనకు కేటాయించారు. పురుషబాబు డీసీఎంఎస్‌పై విచారణను ముమ్మరం చేశారు.

అయితే, ఈ విచారణ పక్కాదారి పడుతుందని బ్యాంకు సిబ్బంది ఆరోపిస్తున్నారు. బ్యాంకు సిబ్బందికి సంబంధం లేని విషయంలో నోటీసులు ఇచ్చి పిలిపించి భయభ్రాంతులకు లోను చేస్తున్నారని బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

సంబంధం ఉన్నవారినే పిలిచా: పురుషబాబు


డీసీఎంఎస్‌తో వ్యాపార లావాదేవీలు ఇతరత్రా సంబంధం ఉన్న అధికారుల ను మాత్రమే విచారణకు పిలిచామని విచారణాధికారి పురుషబాబు తెలిపారు. సంబంధం లేనివారికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలవలేదన్నారు. విచారణ మరోవారం రోజుల్లో పూర్తవుతుందని, నెలాఖరులోపు విచారణ నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తానని పురుషబాబు తెలిపారు.

జలకళ

జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షంతో చెరువులు, వాగులు, కుంటలు జల కళ సంతరించుకున్నాయి. పంట పొలాల్లో నీరు చేరింది. ఒంగోలు నగరంలో తెల్లవారుజాము నుంచే భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.


రాచర్ల మండలం నెమలిగుండం బ్రిడ్జిపై నుంచి పెళ్లిబృందాన్ని అవతలి ఒడ్డుకు చేర్చుతున్న పోలీసులు


తర్లుపాడులో నిండిన కుంట


అద్దంకి మండలం తిమ్మాయిపాలెం పొలాల్లో ...



పొదిలి చిన్నచెరువుకు జలకళ



మర్రిపూడిలో ప్రవహిస్తున్న వాగు



ఒంగోలు లాయర్‌పేట రైతుబజారు వద్ద రోడ్డుపై నీరు



బల్లికురవ మండలం నక్కబొక్కలపాడులో జూట్ పంటలో నిలిచిన నీరు


నెమలిగుండంలోకి ప్రవహిస్తున్న వర్షం నీరు


పర్చూరు వాగులోకి చేరిన నీరు


ముండ్లమూరులో కళకళలాడుతున్న ఉప్పువాగు


నిండిన ఉప్పుగుండూరు చెక్‌డ్యామ్


చీరాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న మురుగు కాలువ

చెక్‘ధామ్’లే....

- నిధులు బొక్కేందుకే నిర్మాణం
- కొద్దిపాటి వర్షానికే బద్ధలు
- వాటర్‌షెడ్ నిధుల నీళ్ల పాలు

అద్దంకి: ప్రభుత్వం గ్రామాలలో భూగర్భజలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టేందుకు వాటర్‌షెడ్ పథకం ద్వారా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. అయితే వాటి నిర్మాణాలు నాసిరకంగా జరగటంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నిధులు నీళ్ల పాలయ్యాయి. కలవకూరు పంచాయతీ పరిధిలోని గుర్రంవారిపాలెం సమీపంలో గత ఏడాది నల్లవాగుపై నాలుగు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. అప్పట్లో కురిసిన చిన్నపాటి వర్షానికే ఒక చెక్‌డ్యామ్ బద్ధలుగా పగిలిపోయింది. మట్టికట్ట కోతకు గురైంది. మరో దానికి కూడా పగుళ్ళు వచ్చాయి. వాటికి ఇటీవల మొక్కుబడిగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. భారీ వర్షాలు కురిసి నల్లవాగుకు నీటి ఉధృతి వస్తే మరలా కొట్టుకుపోవటం ఖాయమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఇటీవల విప్పర్లవారిపాలెం వద్ద వాటర్‌షెడ్ అధికారులు ఎటువంటి అనుమతులు ఇవ్వకుండానే 2.5 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ ప్రస్తుతం కురిసిన చిన్నపాటి వర్షానికే బద్ధలుగా పగిలిపోయింది. వాగుకు చేరిన చిన్నపాటి నీటి ప్రవాహానికి దెబ్బతింది. నిర్మాణం సమయంలోనే నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడం, వాటర్‌షెడ్ అధికారులు వెళ్లి పరిశీలించి అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న చెక్‌డ్యామ్ పనులను నిలిపివేయాలని సూచించారు. అయినా బిల్లులు పొందవచ్చన్న ఉద్దేశంతో పనులను కొనసాగించారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి నల్లవాగుకు కొద్దిమేర నీటి ప్రవాహం రావడంతో చెక్‌డ్యామ్ పగిలిపోవడంతో పాటు కట్ట కోతకు గురైంది. పగిలిపోయిన చెక్‌డ్యామ్‌ల స్థానంలో పునఃనిర్మాణం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




విప్పర్లవారిపాలెం సమీపంలో చిన్నపాటి వర్షానికే దెబ్బతిన్న చెక్‌డ్యామ్

చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదు

సుందరరావు, పీవో వాటర్‌షెడ్, అద్దంకి

విప్లర్లవారిపాలెం వద్ద నల్లవాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. గతంలో నాణ్యతా ప్రమాణాలు లేకుండా పనులు జరుగుతున్నట్లు తెలిసి పరిశీలించిన సమయంలో కూడా పనులు చేయవద్దని సూచించడం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లో బిల్లుల చెల్లింపు చేయం.

ఒంగోలులో భారీ వర్షం

ఒంగోలు కార్పొరేషన్: నగరంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురవటంతో ప్రజలకు పాట్లు తప్పలేదు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. ప్రధాన వీధులన్నీ వర్షపు నీరు, మరోవైపు పొంగిన మురుగుతో చెరువులను తలపించాయి. ఉదయం వేళ కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాయాలకు వెళ్లే ఉద్యోగులకు తీవ్ర ఆటంకం ఏర్పడటంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితితో ఇబ్బందులు పడ్డారు. భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బాపూజి మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణ, ఏకలవ్య నగర్, మసాన్ దర్గా సెంటర్, భాగ్యనగర్ సమీపంలోని బధిరుల ఆశ్రమ పాఠశాల వద్ద నీరు నిలవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంతో పాటు చలిగాలులు వీయడంతో జన సంచారం మందగించింది.


భాగ్యనగర్‌లో రోడ్డుపై పారుతున్న నీరు

ప్రజానీకానికి ఇబ్బందులు

మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచే నగరంలో కారు మబ్బులు కమ్మి గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. దీంతో నగరమంతా జలమయం అయింది. తర్వాత వర్షం నిలవడంతో యధావిధిగా రాకపోకలు కొనసాగాయి. మళ్లీ బుధవారం తెల్లవారుజాము నుంచే వర్షం మొదలు కాగా 8 గంటల వరకు ముసురు పట్టి మబ్బులు కమ్మి చీకటి వాతావర ణం కనిపించింది. ఒకవైపు ఉరుములు, మెరుపులతో వర్షం కురవటంతో ఉదయం వేళ జన సంచారం అంతగా లేదు. వర్షంలోనే విద్యార్థులు పాఠశాలకు పరుగులు పెట్ట గా, ఉద్యోగులు గొడుగులు చేత పట్టుకుని విధులకు హాజరయ్యారు.

చిరు వ్యాపారులకు తిప్పలు

ఏరోజుకారోజు అమ్మకాలతో జీవనం సాగించే చిరు వ్యాపారులకు వర్షం ప్రభావం తీవ్రంగా కనిపించింది. కొందరు వ్యాపారులు జోరు వానలో సైతం అలాగే రోడ్డుపై కూర్చుని అమ్మకాలు సాగించారు. కాగా మధ్యాహ్నం నుంచి తెరపివ్వడంతో జన సంచారం కనిపించింది. ముసురు, చలితో టిఫిన్ బండ్లు, స్వీట్‌కార్న్, వేరుశనగ కాయలు, టీ దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.



త్రోవగుంట వద్ద జాతీయ రహదారిపై నీరు


తడిచిన శర్మా కాలేజీలోని పీడీసీఏ గ్రౌండ్


పీవీఆర్ పాఠశాల ఆవరణలో...


జలమయమైన కేశవరాజుకుంట

జోరువానలో జీవన పోరాటం



ఒంగోలు, ఆంధ్రజ్యోతి : నిత్యం ఆ గుడి వద్ద పూలు అమ్ముకోవడమే ఆమె వృత్తి. అదే ఆమె జీవనాధారం. అందుకు జోరువానలోనూ జీవన పోరాటం చేస్తున్నది. నగరంలోని సాయిబాబా దేవాలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలా ప్రతిరోజు గుడికి వచ్చే కొందరు వ్యక్తులు ఆమె వద్ద పూలు కొని దేవుడికి పూజలు చేస్తుంటారు. అలాంటి వారికి ఇబ్బంది కలగకూడదన్న భావనతోనో లేక ఒక రోజు, రెండురోజులు అందుబాటులో లేకపోతే ఖాతాదారులు మరొకరి వద్దకు వెళ్తారన్న భయమో కానీ బుధవారం ఉదయం నగరంలో కురిసిన జోరు వానను సైతం లెక్క చేయకుండా పూలు అమ్మింది. పైన కురుస్తున్న జల్లుల నుంచి రక్షణ కోసం గొడుగు పట్టి కింద నీటిలో పూలు కొట్టుకుపోకుండా అక్కడ అందుబాటులో ఉండే పండ్లు, కూరగాయలు ప్యాకింగ్ చేసే పెట్టెలు రక్షణగా పెట్టింది. బతుకుదెరువు కోసం జీవన పోరాటం చేస్తున్న ఆ మహిళ అందరికీ స్ఫూర్తిదాయకం.

నీతి ఆయోగ్ నూతన వైస్ చైర్మన్ ఎవరు?

1. 2017 ఆగస్టు 2న సురేశ్‌ప్రభు లోక్‌సభలో వెల్లడించిన వివరాల ప్రకారం ముంబై - అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టుకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్న దేశం?
ఎ) దక్షిణ కొరియా బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) అమెరికా

2. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'NOTA' తొలగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది. 'NOTA' ని విస్తరించండి.
ఎ) None of the above
బి) Nothing of the above
సి) Not intersted on above applicants
డి) Nothing opinion on the above

3. 2017 ఆగస్టు 1న కేంద్రం ప్రారంభించిన వెబ్ పోర్టల్ e-Rakam ప్రధాన ఉద్దేశం?
ఎ) మహిళలపై వివక్షకు వ్యతిరేక వేదిక
బి) రక్షణపరమైన అంశాలను ప్రజలకు వెల్లడించడం
సి) వ్యవసాయ ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్
డి) బాలలపై లైంగిక నేరాలను అరికట్టడం

4. ఇటీవల రాజీనామా చేసిన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్?
ఎ) వి.కె.సారస్వత్ బి) అమితాబ్ కాంత్
సి) సింధుశ్రీ కుల్లార్ డి) అరవింద్ పనగడియా

5. నీతి ఆయోగ్‌కి సంబంధించి సరైనది?
ఎ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా
బి) ప్రణాళిక సంఘం స్థానంలో ఏర్పడిన సంస్థ
సి) 2015 జనవరి 1న ఏర్పాటు డి) పైవన్నీ

6. నీతి ఆయోగ్ నూతన వైస్ చైర్మన్?
ఎ) వివేక్ డెబ్రాయ్
బి) అరవింద్ సుబ్రమణ్యం
సి) రాజీవ్ మెహ్రా డి) రాజీవ్ కుమార్

7. నవాజ్ షరీఫ్ స్థానంలో పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ఖమర్ జావెద్ బజ్వా
బి) షాహిద్ ఖాకన్ అబ్బాసీ
సి) బిలావర్ భుట్టో డి) షెహబాజ్ షరీఫ్

8. ఇరాన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) అహ్మది నెజాద్ బి) రియాల్ షరీఫ్
సి) హసన్ రోహని డి) ర్యుబిన్ రివ్లిన్

9. 2017 ఆగస్టు 1న భారత్‌తో ఖైదీల పరస్పర మార్పిడి ఒప్పందం కుదుర్చుకొన్న దేశం?
ఎ) సోమాలియా బి) దక్షిణాఫ్రికా
సి) కెన్యా డి) సౌదీ అరేబియా



ఎస్.మహిపాల్ రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

10. 2017 ఆగస్టు 2న ప్రయోగించిన 'వీనస్' అనే పర్యావరణ ఉపగ్రహం ఏ రెండు దేశాల సంయుక్త ప్రాజెక్టు?
ఎ) ఇజ్రాయెల్ - అమెరికా
బి) ఇజ్రాయెల్ - ఇండియా
సి) ఇజ్రాయెల్ - ఫ్రాన్స్
డి) ఇజ్రాయెల్ - రష్యా

11. సబ్సిడీ తొలగింపులో భాగంగా ఎల్పీజి సిలిండర్లపై నెలకు ఎంత పెంచాలని కేంద్రం నిర్ణయించింది?
ఎ) రూ.8 బి) రూ.4
సి) రూ.7.50 పై. డి) రూ.12.50 పై.

12. ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన భారత అధికారిణి?
ఎ) ఎస్. అపర్ణ బి) విక్రమ్ సేథ్
సి) సయ్యద్ అక్బరుద్దీన్
డి) రాజీవ్ కుమార్ చందర్

జికె అండ్ కరెంట్ అఫైర్స్

13. 'తెలంగాణ ఉన్నత విద్య మండలి' ప్రస్తుత చైర్మన్?
ఎ) దేవులపల్లి ప్రభాకరరావు బి) పాపిరెడ్డి
సి) నందిని సిధారెడ్డి డి) కె.ఆర్.నందన్

14. టపాసుల తయారీలో ఏ లోహాల వినియోగాన్ని నిషేధిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది?
ఎ) లిథియం, మెర్క్యురీ బి) ఆర్సెనిక్, ఆంటిమొని
సి) సీసం డి) పైవన్నీ

15. దేశంలోనే తొలిసారిగా 'హెలికాప్టర్ ట్యాక్సీ' సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) డెహ్రాడూన్
సి) బెంగళూరు డి) ముంబై


16. 'స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ)' నూతన మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) మహమ్మద్ ముస్తఫా బి) రాజీవ్ మెహ్రా
సి) ఉషా అనంత సుబ్రమణ్యం డి) వేద ప్రకాశ్

17. బాధ్యతలు నిర్వర్తించని, పనితీరు సరిగాలేని 50 ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులతో తప్పని సరిగా పదవీవిరమణ చేయించాలని నిర్ణయించిన రాష్ట్రం?
ఎ) మధ్యప్రదేశ్ బి) బీహార్
సి) ఉత్తరప్రదేశ్ డి) గుజరాత్

18. దేశ చరిత్రలోనే తొలిసారిగా ప్రైవేట్ రంగంలో క్షిపణి తయారీ పరిశ్రమను ఏ నగరంలో ప్రారంభించారు?
ఎ) ఖడక్‌వాస్లా(మహారాష్ట్ర)
బి) చిత్తోర్‌ఘర్(రాజస్థాన్)
సి) హైదరాబాద్(తెలంగాణ)
డి) అవడి(తమిళనాడు)

19. ఇటీవల ప్రవేశపెట్టిన 'Humraaz' ఎవరి కోసం ఉద్దేశించింది?
ఎ) ఆర్థిక శాఖ బి) సైన్యం
సి) మహిళలు డి) వ్యవసాయం

20. 13వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు, ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీకి వచ్చిన ఓట్లు?
ఎ) 516 - 272
బి) 516 - 244
సి) 771- 516
డి) 516 - 284



21. పీటర్ ఓనిల్ ఇటీవల ఏ దేశానికి ప్రధానిగా ఎన్నికయ్యారు?
ఎ) ఫిజి బి) పపువా న్యూగినియ
సి) ఆస్ట్రేలియా డి) ఐర్లాండ్

22. జాతీయ చేనేత దినోత్సవం?
ఎ) ఆగస్టు 2 బి) ఆగస్టు 5
సి) ఆగస్టు 7 డి) ఆగస్టు 8

23. ప్రపంచ గిరిజన దినోత్సవం?
ఎ) ఆగస్టు 9 బి) ఆగస్టు 11
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 8

24. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన Rakam వెబ్‌పోర్టల్‌ను విస్తరించండి.
ఎ) రాష్ట్రీయ కిసాన్ అగ్రి మార్కెట్
బి) రాష్ట్రీయ కిసాన్ అగ్రి మూవ్‌మెంట్
సి) రాష్ట్రీయ కిసాన్ అగ్రి మండి
డి) రాష్ట్రీయ కిసాన్ అగ్రిమంచ్

25. ఏ దేశంలో భారత రాయబారిగా ప్రభాత్‌కుమార్ నియమితులయ్యారు?
ఎ) మంగోలియా బి) కజకిస్థాన్
సి) అజర్‌బైజాన్ డి) ఫిజి

26. 2017 ఆగస్టు 4 కేంద్ర నోటిఫికేషన్ ప్రకారం మరణ ధృవీకరణ పత్రాల జారీకి ఆధార్ తప్పనిసరి. అయితే దీని నుంచి మినహాయించిన రాష్ట్రాలు?
ఎ) అసోం, మంగోలియా, జమ్మూకశ్మీర్
బి) అసోం, మణిపూర్, మేఘాలయా
సి) మణిపూర్, త్రిపుర, సిక్కిం
డి) జమ్మూకశ్మీర్ మాత్రమే

27. 2017 ఆగస్టు 4న లోక్‌సభ ఆమోదం ప్రకారం 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ' ఏ నగరంలో ఏర్పాటైంది?
ఎ) విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)
బి) జామ్‌నగర్(గుజరాత్)
సి) డెహ్రాడూన్(ఉత్తరాఖండ్) డి) అలపూజ(కేరళ)

28. ఇటీవల కేంద్ర ఆమోదం పొందిన 'అభయ' మొబైల్ యాప్‌ను మహిళల రక్షణ కోసం ఏ రాష్ట్రం రూపొందించింది?
ఎ) తెలంగాణ బి) కర్ణాటక
సి) హర్యానా డి) ఆంధ్రప్రదేశ్

29. ఢిల్లీ రేడియో కేంద్రం తొలి మహిళ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) స్తుతి నారాయణ్ బి) శైలజా సుమన్
సి) అనుపమ కార్తిక్ డి) పద్మజారావు

30. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ పరపతి విధాన సమీక్షలో ప్రకటించిన వడ్డీ రేట్ల శాతం?
ఎ) రెపోరేటు - 6 బి) రివర్స్ రెపోరేటు - 5.75
సి) నగదు నిల్వల నిష్పత్తి - 4
డి) పైవన్నీ సరైనవే

31. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు?
ఎ) 123 బి) 122 సి) 124 డి) 121

అవార్డులు

32. మండలి వెంకటకృష్ణారావు సంస్కృతి పురస్కారం-2017 గ్రహీత?
ఎ) మంతెన శ్రీధర్ బి) జాలూరి గౌరిశంకర్
సి) సుద్దాల అశోక్‌తేజ డి) గోరటి వెంకన్న

33. 2017కు గాను 'నేషనల్ జియోగ్రాఫిక్ ట్రావెల్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును ఎవరు పొందారు?
ఎ) నియాలియో తైముపెంకో బి) ఆంథోని ల్యూ
సి) స్తెఫాని ఎడ్గర్ డి) సెర్గియో టాపిరో వెలాస్కో

34. 2017కు గాను 'జాలాది జాతీయ ప్రతిభా పురస్కారం' గ్రహీతలు?
ఎ) గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ
బి) గోరటి వెంకన్న, అనంత శ్రీరాం
సి) సుద్దాల అశోక్‌తేజ, సిరివెన్నెల సీతారామశాస్త్రి
డి) రామజోగయ్యశాస్త్రి, అనంత శ్రీరాం

35. 'రామన్ మెగసెసె అవార్డు-2017' గ్రహీతలు?
ఎ) అబ్దాన్ నబాన్ - ఇండోనేషియా
బి) గెఫ్సీ షణ్ముగం - శ్రీలంక
సి) టోపిబాయ్ - సింగపూర్
డి) పైవారందరూ



36. 'రామన్ మెగసెసె అవార్డు-2017' గ్రహీతలకు సంబంధించి సరికానిది?
ఎ) మోషియాకి ఇషిజావా - జపాన్
బి) లిలియ డిలిమ - ఫిలిప్పీన్స్
సి) సతోషి ఓమురా - జపాన్
డి) ఫిలిప్పీన్స్ ఎడ్యుకేషనల్ థియేటర్ ట్రస్ట్

సమాధానాలు

1) సి	7) బి	13) బి	19) బి	25) బి	31) ఎ
2) ఎ	8) సి	14) డి	20) బి	26) ఎ	32) ఎ
3) సి	9) ఎ	15) సి	21) బి	27) ఎ	33) డి
4) డి	10) సి	16) ఎ	22) సి	28) డి	34) ఎ
5) డి	11) బి	17) బి	23) ఎ	29) బి	35) డి
6) డి	12) ఎ	18) సి	24) సి	30) డి	36) సి

క్రీడలు

1. థామస్ బాబ్ నేతృత్వంలోని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ప్రకటించిన ఒలింపిక్ వేదికల్లో సరికానిది?
ఎ) 2020 - టోక్యో(జపాన్)
బి) 2024 - పారిస్(ఫ్రాన్స్)
సి) 2028 - లాస్ ఏంజిల్స్(అమెరికా)
డి) 2032 - మాడ్రిడ్(స్పెయిన్)


2. 2017కి గాను 'ఈస్ట్ బెంగాల్ క్రికెట్ క్లబ్' ఎవరిని 'భారత్ గౌరవ్' పురస్కారానికి ఎంపిక చేసింది?
ఎ) మిల్కాసింగ్(అథ్లెట్)
బి) బైచుంగ్ భూటియా(ఫుట్‌బాల్)
సి) ధన్‌రాజ్‌పిళ్లై(హాకీ)
డి) లతా మంగేష్కర్(గాయని)

3. పారిస్ సెయింట్ జర్మన్(పిఎస్‌జి) ఫుట్‌బాల్ క్లబ్ ఏ ఆటగాడిని అత్యధిక ధరకు(222 మిలియన్ యూరోలు) కొనుగోలు చేసింది?
ఎ) నెయిమార్(బ్రెజిల్)
బి) లియోనల్ మెస్సీ(అర్జెంటీనా)
సి) క్రిస్టియానో రొనాల్డో(పోర్చుగల్)
డి) డిగో మారడోనా(అర్జెంటీనా)

4. భారత బాక్సర్ విజేందర్ ఎవరిని ఓడించి WBO ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ గెలుపొందాడు?
ఎ) జుల్ఫికర్(చైనా)
బి) రాకి మార్సియానో(అమెరికా)
సి) జార్జ్ ఫోర్‌మన్(అమెరికా)
డి) జార్జి చువాలో(కెనడా)

5. 'ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యమిచ్చిన నగరం?
ఎ) లండన్(బ్రిటన్) బి) సోచి(రష్యా)
సి) హెల్సింకి(ఫిన్లాండ్) డి) బీజింగ్(చైనా)

6. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2017లో 100 మీటర్ల పురుషుల పరుగు పందెం విజేత?
ఎ) జస్టిన్ గ్లాటిన్(అమెరికా)
బి) క్రిస్టియన్ కేల్మన్(అమెరికా)
సి) ఉసేన్ బోల్ట్(జమైకా)
డి) మైకెల్ ఫెరా(జమైకా)



7. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2017లో 100 మీటర్ల మహిళల పరుగు పందెం విజేత?
ఎ) ఎలైనీ థామ్సన్(జమైకా)
బి) టోరి బోయి(అమెరికా)
సి) మరిజోసిటాలు(ఐవరికోస్ట్)
డి) డఫ్నీ షిప్పర్స్(నెదర్లాండ్)

8. డోపింగ్‌లో పట్టుబడిన టెన్నిస్ ప్లేయర్ సారా ఇరాని ఏ దేశస్థురాలు?
ఎ) ఫ్రాన్స్ బి) అమెరికా సి) స్పెయిన్ డి) ఇటలీ

సమాధానాలు

1) డి	3) ఎ	5) ఎ	7) బి
2) సి	4) ఎ	6) ఎ	8) డి

JOBS ఉద్యోగాలు

సిపిసిఎల్

ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలోని చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సిపిసిఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 33

విభాగాలు - ఖాళీలు: ఇంజనీర్(కెమికల్ 15, మెకానికల్ 6, ఎలక్ట్రికల్ 3, సివిల్ 1, మెటలర్జి 2), ఐటి & ఎస్ ఆఫీసర్ 1, హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ 3, సేఫ్టీ ఆఫీసర్ 1, మార్కెటింగ్ ఆఫీసర్ 1

అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి. పోస్టును అనుసరించి ఉండాల్సిన అదనపు అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లోని ప్రకటనలో చూడవచ్చు.

వయసు: జూలై 31 నాటికి 30 ఏళ్ల మించరాదు

ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 11 నుంచి

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 1


దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 8

వెబ్‌సైట్: www.cpcl.co.in

What is the average number..

QUANTITATIVE APTITUDE

Direction (1-5): Study the following bar graph and table carefully and answer the given questions.
Bar graph shows the percentage of number of Manager, Clerk and PO in five different Banks P, Q, R, S and T and table shows the total number employees in five different Banks.



Banks	Total no. of employees
P	1250
Q	2050
R	1800
S	1150
T	1620

1. What is the total number of Clerks in Bank P, Q and R together?
(1) 1785 (2) 1821 (3) 1479 (4) 1692
(5) None of these
2. The number of PO in Bank P is **approximately** what percentage of the number of PO in Bank T?
(1) 121% (2) 116% (3) 75% (4) 101%
(5) None of these
3. What is the ratio between the number of Manager and Clerk in Bank Q?
(1) 3 : 5 (2) 7 : 5 (3) 8 : 7 (4) 5 : 7
(5) None of these
4. What is the average number of employees from all the Banks together?
(1) 1654 (2) 1600 (3) 1580 (4) 1574
(5) None of these
5. What is the difference between the number of Manager and PO in Bank S?
(1) 138 (2) 126 (3) 136 (4) 135 (5) None of these

Direction (6-10): Study the following information carefully and answer the given questions.
A box contains 5 black, 1 white, some blue and some red balls. The probability of picking out 1 blue ball is $\frac{1}{5}$ and probability of picking out 1 red ball is $\frac{1}{2}$.

6. What is the probability of picking out 1 black ball from the box?
(1) $\frac{1}{2}$ (2) $\frac{1}{3}$ (3) $\frac{1}{4}$ (4) $\frac{1}{5}$ (5) None of these
7. When two balls are picked out, then what is the probability that one is blue and other is black?
(1) $\frac{1}{19}$ (2) $\frac{2}{19}$ (3) $\frac{3}{19}$ (4) $\frac{4}{19}$ (5) None of these
8. B is twice as efficient as A and A can do a piece of work in 15 days. A started the work and after a few days B joined him. They completed the work in 11 days, from the starting. For how many days did they work together?
(1) $\frac{7}{3}$ days (2) 3 days (3) 2 days
(4) $\frac{11}{3}$ days (5) 1 days
9. A rectangular park 60m long and 40m wide has two concrete crossroads running in the middle of the parkand rest of the park has been used as a lawn. If the area of the lawn is 2109 m^2, then what is the width of the road?
(1) 3 m (2) 5 m (3) 3.5 m (4) 4.5 m
(5) None of these
10. The ratio between the number of passengers travelling by I[st] class and II[nd] class between the two railway stations is 1 : 50, whereas the ratio of I[st] class and II[nd] class fares between the same stations is 3 : 1. If on a particular day, ₹1325 were collected from the passengers travelling between these stations, then what was the amount collected from the II[nd] class passengers ?
(1) ₹ 750 (2) ₹1000 (3) ₹ 850 (4) ₹ 1250
(5) None of these

Direction (11-15): In the following question two equations I and II are given. Solve the equations and answer the questions.



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's Special

Give Answer if
(1) $a > b$ (2) $a \geq b$ (3) $a < b$ (4) $a \leq b$
(5) $a = b$ or the relationship can't be established

11. I. $a - 8\sqrt{a} + 15 = 0$ II. $2b^2 + 7b - 225 = 0$
12. I. $3a^2 + 5a - 28 = 0$ II. $2b^2 + 23b + 63 = 0$
13. I. $2a + 9b = 15$ II. $a + 3b = 9$
14. I. $a^2 + 10a - 11 = 0$ II. $2b^2 - 7b + 6 = 0$
15. I. $60a^2 - 326a - 22 = 0$
II. $36b^2 - 196b - 11 = 0$

Hints & Solutions

(1-5):

1. (2) Required total
$= 1250 \times \frac{36}{100} + 2050 \times \frac{30}{100} + 1800 \times \frac{42}{100} = 450 + 615 + 756 = 1821$
2. (2) No. of PO in Bank P
$= 1250 \times \frac{30}{100} = 375$
No. of PO in Bank T
$= 1620 \times \frac{20}{100} = 324$
$\therefore$ Required %
$= \left(\frac{375}{324} \times 100\right)\% = 115.74\% \approx 116\%$
3. (5) Required ratio = 50 : 30 = 5 : 3
4. (4) Required average
$= \frac{1250 + 2050 + 1800 + 1150 + 1620}{5}$
$= \frac{7870}{5} = 1574$
5. (1) Required difference
$= 1150 \times \left(\frac{38 - 26}{100}\right)$
$= 1150 \times \frac{12}{100} = 138$

(6-10):

6. (3) Let us assume there are m blue balls and n red balls.
Probability of picking out 1 blue ball is
$\Rightarrow \frac{m}{(6 + m + n)} = \frac{1}{5} \Rightarrow 5m = 6 + m + n$
$\Rightarrow 4m = 6 + n$
Similarly probability of picking out 1 red ball is
$\left(\frac{n}{(6 - m - n)}\right) = \frac{1}{2}$
$2n = 6 + m + n$
$\Rightarrow 4m = 6 + (6 + m)$
$\Rightarrow 4m = 12 - m$
$\Rightarrow 3m = 12$
and $n = 6 + m \Rightarrow n = 10$
$\frac{5_{c_1}}{20_{c_1}} = \frac{5}{20} = \frac{1}{4}$
7. (2) Let us assume there are m blue balls and n red balls.
Probability of picking out 1 blue ball is
$\frac{m}{(6 + m + n)} = \frac{1}{5} = 6 + m + n$
$\Rightarrow 4m = 6 + n$
Similarly probability of picking out 1 red ball is
$\left(\frac{n}{6 - m - n}\right) = \frac{1}{2}$
$= 2n = 6 + m + n$
$\Rightarrow 4m = 6 + (6 + m)$
$\Rightarrow 4m = 12 - m$
$\Rightarrow 3m = 12 \quad \Rightarrow m = 4$
and $n = 6 + m \Rightarrow n = 10$
$\frac{{}^4C_1 \times {}^5C_1}{20C_2} = \frac{4 \times 5}{190} = \frac{2}{19}$
8. (3) Efficiency A : B = 1 : 2 = $x : 2x$
Let total unit = $15x$
Since work completed in 11 days which means
A continued for 11 days and B joined him in Middle
$\therefore 11x + B(2x) = 15x$ (where B is the no. of days for which B worked)
B = 2 days
9. (1) Area of Park = 60 × 40 = 2400 m^2
Let Bredth of the roads running inside the park is x.
ATQ,
$(60 + 40)\,x - x^2 = 2400 - 2109$
$\Rightarrow x = 3\ m$
10. (4) Let the number of passengers travelling by I[st] Class and II[nd] Class be x and $50x$ respectively.
Then amount collected from I[st] Class and II[nd] Class will be ₹ $3x$ and ₹ $50x$ respectively.
Given, $3x + 50x = 1325$
$\Rightarrow 53x = 1325 \Rightarrow x = 25$
$\therefore$ Amount collected from II[nd] Class
= 50 × 25 = ₹ 1250

(11-15):

11. (2) I. $a - 8\sqrt{a} + 15 = 0$
$\Rightarrow a - 5\sqrt{a} - 3\sqrt{a} + 15 = 0$
$\Rightarrow \sqrt{a}(\sqrt{a} - 5) - 3(\sqrt{a} - 5) = 0$
$\Rightarrow (\sqrt{a} - 3)(\sqrt{a} - 5) = 0 \Rightarrow a = 9, 25$
II. $2b^2 + 7b + 225 = 0$
$\Rightarrow 2b^2 - 18b + 25b - 225 = 0$
$\Rightarrow 2b(b - 9) + 25(b - 9) = 0$
$\Rightarrow (2b + 25)(b - 9) = 0 \Rightarrow b = -\frac{25}{2}, 9$
Clearly, $a \geq b$
12. (1) I. $3a^2 + 5a - 28 = 0$
$\Rightarrow 3a^2 + 12a - 7a - 28 = 0$
$\Rightarrow 3a(a + 4) - 7(a + 4) = 0$
$\Rightarrow (3a - 7)(a + 4) = 0 \Rightarrow a = \frac{7}{3}, -4$
II. $2b^2 + 23b + 63 = 0$
$\Rightarrow 2b^2 + 14b + 9b + 63 = 0$
$\Rightarrow 2b(b + 7) + 9(b + 7) = 0$
$\Rightarrow (2b + 9)(b + 7) = 0 \Rightarrow b = -\frac{9}{2}, -7$
Cleary, $a > b$
13. (1) I. $2a + 9b = 15$ ...... (i)
$a + 3b = 9$ ...... (ii)
Equation (i) – Equation (ii) × 2, we get
$2a + 9b - 2a - 6b = 15 - 18$
$\Rightarrow 3b = -3 \Rightarrow b = -1$
Put the value of b in euqation (ii),
$a + 3 \times (-1) = 9$
$\Rightarrow a = 9 + 3 = 12$
Clearly, $a > b$
14. (3) I. $a^2 + 10a - 11 = 0$
$\Rightarrow a + 11a - a - 11 = 0$
$\Rightarrow a(a + 11) - 1(a + 11) = 0$
$\Rightarrow (a - 1)(a + 11) = 0$
$\Rightarrow a = 1, -11$
II. $2b^2 - 7b + 6 = 0$
$\Rightarrow 2b^2 - 4b - 3b + 6 = 0$
$\Rightarrow 2b(b - 2) - 3(b - 2) = 0$
$\Rightarrow (2b - 3)(b - 2) = 0 \Rightarrow b = \frac{3}{2}, 2$
Clearly, $a < b$
15. (5) I. $60a^2 - 326a - 22 = 0$
$\Rightarrow 30a^2 - 163a - 11 = 0$
$\Rightarrow 30a^2 + 2a - 165a - 11 = 0$
$\Rightarrow 2a(15a + 1) - 11(15a + 1) = 0$
$\Rightarrow (2a - 11)(15a + 1) = 0$
$\Rightarrow a = \frac{11}{2}, -\frac{1}{15}$
II. $36b^2 - 196b - 11 = 0$
$\Rightarrow 36b^2 + 2b - 198b - 11 = 0$
$\Rightarrow 2b(18b + 1) - 11(18b + 1) = 0$
$\Rightarrow (2b - 11)(15b + 1) = 0$
$\Rightarrow b = \frac{11}{2}, -\frac{1}{18}$

JOBS ఉద్యోగాలు

ఇండియన్ ఆయిల్

ఇండియన్ ఆయిల్- **మార్కెటింగ్ ప్రొఫెషనల్స్ (ఆఫీసర్స్)**పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
అర్హత: 60 శాతం మార్కులతో (రెండేళ్ల పీజీ డిప్లొమా/ పీజీ)(మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో బిజినెస్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: యుజిసి నెట్(2017 నవంబరు) స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
యుజిసి నెట్‌లో రాయాల్సిన సబ్జెక్ట్: మేనేజ్‌మెంట్ (కోడ్ 17)
2017 జనవరి& అంతకు ముందు జరిగిన యుజిసి నెట్ ఎగ్జామ్ స్కోర్స్‌ను పరిగణనలోకి తీసుకోరు.
అభ్యర్థులు ముందుగా యుజిసి నెట్(2017 నవంబరు) ఎగ్జామ్‌కు దరఖాస్తు చేసుకొని రోల్ నెం/ రిజిస్ట్రేషన్ నెం వచ్చిన తరవాతనే ఇండియన్ ఆయిల్ సంస్థకు అప్లయ్ చేసుకోవాలి.
యుజిసి నెట్ సమాచారం కోసం http://cbsenet.nic.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు
వెబ్‌సైట్: www.iocl.com

ఎన్‌సిఇఆర్‌టి

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి)- **ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 240
పోస్టుల వారీ ఖాళీలు: ప్రొఫెసర్ 36, అసిస్టెంట్ ప్రొఫెసర్ 133, అసోసియేట్ ప్రొఫెసర్ 71
అర్హత: (ఎంఇడి/ ఎమ్మె) (ఎడ్యుకేషన్/ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్/ సెక్యూరిటీ/ డిఫెన్స్ సైన్స్/ ఫుడ్ టెక్నాలజీ/ అగ్రికల్చర్)/ పీజీ(సైన్స్/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ బోటనీ/ జువాలజీ)/ ఎమ్మె- ఎడ్యుకేషన్/ ఎంటెక్/ మాస్టర్ (ఫైన్ ఆర్ట్స్/ జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 65 ఏళ్లకు మించరాదు
ఎంపిక: షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 18
చిరునామా: Section Officer, Recruitment - 1 Section, Room No.12, 5th floor, Zakir Hussain Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi - 110016
వెబ్‌సైట్: www.ncert.nic.in

బిఇఎల్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
కాంట్రాక్ట్ వ్యవధి: అయిదేళ్లు
ఖాళీలు: 16
అర్హత: ఆర్మీ/ ఎయిర్ ఫోర్స్/ నేవీలో కనీసం పదిహేనేళ్లు పనిచేసిన జెసిఒ ర్యాంక్ ఎక్స్ సర్వీస్‌మన్ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: సెప్టెంబరు 1 నాటికి 52 ఏళ్లు మించరాదు
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఇచ్చిన నమూనాలో నింపిన దరఖాస్తు ఫారాన్ని సబ్మిట్ చేసుకోవాలి.
దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.bel-india.com

అడ్మిషన్లు



మ్యాట్ - సెప్టెంబరు 2017

దేశవ్యాప్తంగా ఉన్న 160 బిజినెస్ స్కూళ్లలో ఎంబిఏ, పీజీడిఎం & ఎలైడ్ ప్రోగ్రాముల ప్రవేశానికి ఉద్దేశించిన **మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్ -సెప్టెంబరు 2017)**కు ప్రకటన విడుదలయింది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆఖరు ఏడాది పరీ క్షలు రాస్తున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
మ్యాట్‌ను పేపర్ బేస్డ్/ కంప్యూటర్ బేస్డ్ విధానాల్లో నిర్వహిస్తారు. **పేపర్ బేస్డ్ టెస్ట్:** సెప్టెంబరు 3న
కంప్యూటర్ బేస్డ్ టెస్ట్: సెప్టెంబరు 9 నుంచి
దరఖాస్తు ఫీజు: రూ.1400
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: http://apps.aima.in/matsept17

నేడు విద్యా సంస్థల బంద్

త్రిపురాంతకం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి నాలుగు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు గోపీ తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ళు మూసివేతను ఆపాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేటు స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

సంబరంగా ఆదివాసీ దినోత్సవం

- గిరిజనులు అభివృద్ధి చెందాలి
- జీసీసీ మేనేజర్ శ్రీనివాసరావు
- గిరిజనుల ర్యాలీ

ఎర్రగొండపాలెం రూరల్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని జీసీసీ మేనేజర్ వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురుకుల పాఠశాలలో జరిగిన సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. గిరిజనులు ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకొని ప్రశాంత జీవనానికి అలవాటు పడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డీటీ ఆధ్వర్యంలో చెంచు మహిళలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆదివాసీ దినోత్సవాన్ని సంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు చెవుల అంజయ్య, వీటీడీఏ అధ్యక్షుడు ఈదెన్న, వెంకటయ్య, ఆర్డీటీ కోఆర్డినేటర్ శాంతమ్మ, పాలుట్ల, బిళ్ళ గొందిపెంట, మురికిమళ్ళ, ఎర్రగొండపాలెం గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

11 సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఎర్రగొండపాలెం రూరల్ : శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణ మాస మూడవ శుక్రవారం సందర్భంగా ఈ నెల 11న చెంచు ముత్తైదువులకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు అవకాశం కల్పించినట్లు ఐటీడీఏ ఏపీవో జేవీ మురళి తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొన్న మహిళలు పూజ అనంతరం కలశం మీద రవిక, అమ్మవారి ప్రసాదం ఉచితంగా అందజేస్తామని చెప్పారు. శ్రీశైల ప్రభ పుస్తకంతోపాటు అతి శీఘ్రదర్శనం ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత భోజన వసతిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జి ల్లాలకు చెందిన చెంచు మహిళలు 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా శ్రీశైలంలో ఉన్న చెంచు మ్యూజియం వద్దకు చేరుకోవాలని కోరారు.

పింఛన్ కోసం ఎదురుచూపులు


వితంతువు మేరమ్మ

పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ఓ వితంతువు భర్త మృతి చెంది మూడేళ్లయినా నేటికీ పింఛన్ కోసం పడిగాలు కాస్తోంది. వితంతు పింఛన్ కోసం ఆ బాధిత మూడుసార్లు దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని బాధితురాలు కొమ్ము మేరమ్మ తెలిపింది. పనిచేసేందుకు చేయి కూడా లేకపోవడంతో ఆరిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని ఆమె విలపిస్తోంది. నిరుపేద అయిన మేరమ్మ పూరి ఇల్లు ఇటీవల కూలిపోయి, గోడలు మాత్రమే మిగిలాయి. ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలని మేరమ్మ వేడుకుంటోంది.

మరణ ధృవీకరణ పత్రం లేదు

దీనిపై పంచాయతీ కార్యదర్శి వీరస్వామిరెడ్డి వివరణిస్తూ మేరమ్మకు సంబంధించి తన భర్త మరణ ధృవీకరణ పత్రం లేకనే పింఛన్ మంజూరు జరగలేదు. గతంలో పనిచేసిన కార్యదర్శి నుంచి ధృవీకరణ పత్రం తీసుకోవాల్సి వుండగా, ఆమె తీసుకోలేదు. అంగన్‌వాడీ కార్యకర్త ద్వారా సమాచారం సేకరిస్తున్నాం.

ప్రహరీ పనులు పరిశీలించిన ఎంపీడీవో

త్రిపురాంతకం : పలు జడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీగోడల నిర్మాణానికి జడ్పీ చైర్మన్ ద్వారా 13వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న పనులను ఎంపీడీవో కె.మాణిక్యరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపవరం గ్రామంలో జడ్పీ పాఠశాలకు నిర్మిస్తున్న ప్రహరీగోడ పనులను పరిశీలించి అధికారులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల ప్రహరీగోడ కోసం 10 లక్షల మంజూరు కాగా ప్రస్తుతం పూర్తి దశలో ఉండగా మరో 5 లక్షలు నిధులు అయ్యే అవకాశం ఉంది. పాఠశాలలో మొక్కలు నాటాలని, అవసరమైన మేర మొక్కలు సరఫరా చేస్తామని ఎంపిడి ఓ తెలిపారు. గతంలో ప్రహరిగోడ లేన్నందున పశువులన్నీ పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి మొక్కలను నాశనం చేసేవని ఇప్పుడు ఆ ఇబ్బంది లేనందున మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. రామసముద్రం జడ్పీ పాఠశాలకు 15 లక్షలు, మేడపి జడ్పీ పాఠశాలకు 15 లక్షల రూపాయలు ప్రహరీగోడలకు మంజూరు కాగా పనులు పూర్తి కావచ్చాయన్నారు. దూపాడుకు 10 లక్షలు, త్రిపురాంతకంకు 5 లక్షలు, గొల్లపల్లికి 5 లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఏఈ మహంకాళయ్య తెలిపారు. కార్యక్రమంలో చంద్రమౌళిరెడ్డి, శరబారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న అధికారులు

కార్మిక నిధులను సంక్షేమానికే వినియోగించాలి

త్రిపురాంతకం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే నిధులు పక్కదారి పట్టకుండా కార్మికులకే వినియోగించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. త్రిపురాంతకంలోని బలిజ అన్నదాన సత్రంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు శిక్షణ ఇవ్వడం ద్వారా నిర్మాణ రంగంలో మెళకువలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అ.ధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఏజీటీయూసీ నాయకులు దాసరి మల్లికార్జున, షేక్ రహిమాన్, సీపీఐ నాయకులు గురునాథం, శిక్షణ నిర్వాహకులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందంజలో ఉండాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మాణిక్యరావు

పుల్లలచెరువు : అభివృద్ధిలో మండలం ముందంజలో ఉండాలని, అందు కోసం అధికారులంతా సమష్టిగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మాణిక్యరావు అన్నారు. బుధవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంటే రూ.12 వేల ప్రోత్సాహకం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు చేయాలన్నారు.

అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలని అన్నారు. ఉపాధి పథకం ద్వారా పంట కుంటలు, పండ్ల తోటల పెంపకాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ భాస్కర్‌రావు, ఈవోఆర్డీ వెంకటరెడ్డి, ఎంఈవో రాంసింగ్‌నాయక్, ఏపీవో మోసే, ఏపీఎం రవీంద్ర కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గృహ లబ్దిదారుల ఎంపికలు

త్రిపురాంతకం: ప్రజాసాధికార సర్వే ఆధారంగా గృహ లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని దువ్వలి, లేళ్ళపల్లి, కంకణాలపల్లి గ్రామాలలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన ప్రజా సాధికార సర్వే ఆధారంగా ఉన్న జాబితాను, ప్రస్తుత దరఖాస్తులను పరిశీలించి సమీక్షించారు. అంతరం లబ్ధిదారులను ఎంపిక చేశారు. దువ్వలిలో 37 మందికిగాను, 36 మందిని, లేళ్ళపల్లిలో 109 మందిని, కంకణాలపల్లిలో 133కు గాను 127 మందిని ఎన్టీఆర్ గృహాలకు అర్హులుగా తేల్చారు.

ఈగ్రామసభలలో హౌసింగ్ ఏఈఈ రాజేశ్వరరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ పెద్దలు, ఎన్టీఆర్ గృహ లబిదారులు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజలు


వర్షంతో అధ్వానంగా తయారైన సోమేపల్లి రోడ్డు

చినుకు పడితే చిత్తడే

త్రిపురాంతకం : సోమేపల్లి రోడ్డు చినుకు పడితే నడిచేందుకు వీలు లేకుండా అధ్వాన్నంగా తయారైంది. కేజీ రోడ్డు నుంచి సోమేపల్లి గ్రామానికి సుమారు 3 కిలోమీటర్లపైనే ఉండగా ఎప్పుడో 30 ఏళ్ల నాడు వేసిన కంకర, మట్టి రోడ్డే నేటికీ ఉండటంతో పూర్తిగా గుంతలు పడి దర్శనమిస్తుంది. దీంతో చిన్నపాటి వర్షం పడిన రోడ్డు మొత్తం బురదమయంగా మారి వర్షపు నీటితో చెరువులను, కుంటలను తలపిస్తుంది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులే తప్ప గ్రామానికి వెళ్ళే రోడ్డును పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి గ్రామానికి మె రుగైన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రూ.1350 నగదు స్వాదీనం

గంగదేవిపల్లె(దొనకొండ) : గంగదేవిపల్లె గ్రామంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న వ్యక్తులను బుధవారం అరెస్టు చేసి రూ.1350 నగదును స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం దర్శి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర నూర్ బాష సంఘ ఉపాధ్యక్షుడిగా మస్తాన్

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం బిరుదులనరవకు చెందిన దూదేకుల మస్తాన్ రాష్ట్ర నూర్ బాష సంఘ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు కె.నాగుల్ మీరా నియామకపత్రాలు పంపారు.

ప్రజా జీవితంలో మమేకం ఆకాశవాణి

- ఆర్డీవో కిశోర్
- ఘనంగా మార్కాపురం ఆకాశవాణి రజతోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

మార్కాపురం వన్‌టౌన్ : ప్రజల జీవితంలో ఆకాశవాణి మమేకమైందని ఆర్డీవో పి.కిశోర్ అన్నారు. మార్కాపురం ఆకాశవాణి కేంద్రం 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాలు స్థానిక రేడియో కేంద్రంలో ప్రోగ్రాం హెడ్ బీఆర్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డీవో మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఆకాశవాణి కేంద్రం ప్రారంభించి 25 ఏళ్ల పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ఎప్పటి నుంచో అన్ని వర్గాల ప్రజలకు ఏకైక సమాచార సాధనం రేడియో అన్నారు. ఇంటర్‌నెట్ వచ్చినా ఆకాశవాణికి ఆదరణ తగ్గలేదన్నారు. విజ్ఞానం, వినోదం అందిస్తూ మార్కాపురం కేంద్రం ప్రజల జీవితాల్లో భాగమైందని పేర్కొన్నారు.

డీఎస్పీ ఎన్‌వీ రామాంజనేయులు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అన్ని వర్గాలకు చేరువైన ఆకాశవాణి కొత్త కార్యక్రమాలతో శ్రోతలకు మరింత చేరువైందన్నారు. గతంలో తాను కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సిద్ధమయ్యేటప్పుడు ఆకాశవాణిలో వచ్చే చర్చా వేదికలు, కరెంట్ అఫైర్స్, వార్తలు ప్రామాణికంగా తీసుకొని చదివానన్నారు. వివిధ భారతి కార్యక్రమాల్లో ఎన్నో మారుమూల ప్రాంతాల నుంచి ఫోన్‌లు రావడం ఆకాశవాణికి ఉన్న ప్రాముఖ్యత తగ్గలేదని నిరూపిస్తుందన్నారు. కంభం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.డేవిడ్ లివింగ్ స్టన్ మాట్లాడుతూ తొలుత రేడియోలకు లైసెన్సులు ఉండేవని, 1970 నుంచి 80 దశకంలో ప్రజల మనస్సులో రేడియో అత్యున్నత స్థానం పొందిందన్నారు. సృజనాత్మకత పెంచేది రేడియో అని, రేడియో కళాకారులు ఎంతో గొప్పవారన్నారు. విద్యార్థులకు బడి ఎలా దేవాలయమో ఆకాశవాణి అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞాన వినోద ఖని అని పేర్కొన్నారు. ప్రోగ్రాం హెడ్ సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కళాకారులను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. ఏఈ ఎంకే పద్మ మాట్లాడుతూ త్వరలో మార్కాపురం కేంద్ర పరిధి పెరుగుతుందన్నారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం ఆర్డీవో, డీఎస్పీ కేంద్ర సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కేంద్రం సీనియర్ అనౌన్సర్ కేవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బత్తిన సేవలు చిరస్మరణీయం



బత్తిన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మార్కాపురం వన్‌టౌన్ : బీజేపీకి అంకిత భావంతో పని చేసిన సీనియర్ నాయకుడు బత్తిన నరసింహారావు సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకుడు పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం బత్తిన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో పార్టీకి బత్తిన మూలస్తంభమని, ఆయన అనేక సేవా కార్యక్రమాలు చేసి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పీవీ కృష్ణారావు, బొంతల కృష్ణ, ఎం. రమణయ్య, వై.సుబ్బారావు, మద్దెల లక్ష్మి, ఇమాం, శంకరరావు, కె.నరసింహారావు, జి. శ్రీధర్, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తర్లుపాడు : అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంఈవో డి.సుజాత అన్నారు. స్థానిక హిందూ ప్రాథమిక(ఎ.ఎ) పాఠశాల ఉపాధ్యాయులు మేకల చంద్రశేఖర రాజు, బీసీహెచ్ వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం పాఠశాలలో సన్మానం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చంద్రశేఖరరాజు, వెంకటేశ్వర్లు 8 ఏళ్ల పాటు ఉత్తమ సేవలను అందించారని కొనియాడారు. సర్పంచ్ కందుల విజయకళావతి మాట్లాడుతూ ఇద్దరూ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యను అందించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వరాలు, ఫాస్టర్ ఎం.విజయకుమార్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.జయమ్మ, సంఘ నాయకులు లింకన్, లక్ష్మయ్య, గుంటు రత్నకుమార్, కొండయ్య పాల్గొన్నారు.

పంటలకు జీవం

- వర్షాలతో ఊపందుకోనున్న నాట్లు



కళకళలాడుతున్న కొర్ర పంట

తర్లుపాడు : మండలంలో మంగ్గ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు జీవం పోసుకున్నాయి. నెల రోజుల నుంచి వర్షం లేక వాడుముఖం పట్టిన కంది, మినుము, కొర్ర, సజ్జ, జొన్న పంటలకు ఈ వర్షాలు ఉపకరిస్తాయి. మండలంలో 750 హెక్టార్లలో కంది, 150 హెక్టార్లలో సజ్జ, 100 హెక్టార్లలో కొర్ర, 50 హెక్టార్లలో మినుము పంటలను సాగు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాలన్నీ తడులతో కళకళాడుతున్నాయి. గానుగపెంట, పోతలపాడు గ్రామాల్లో అత్యధికంగా వర్షం కురవడంతో చెక్ డ్యాంలకు, కుంటలకు నీరు చేరింది. ఆయా గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బోర్లకు నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో వ్యవసాయం పనులు ముమ్మరం కానున్నాయి. ఎక్కువగా మిరప నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

మార్కాపురంలో వర్షం



తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపునీరు

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు మోస్తరు వర్షం కురిసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వేసవిని తలపిస్తున్న ఎండలు, ఉక్కపోత, నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న పట్టణ ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనమిచ్చింది. తహసీల్దార్ కార్యాలయం, పలు వీధుల్లో నీరు నిలిచింది.

పొదిలిలో డ్రైనేజీ అస్తవ్యస్తం


- పలు ప్రాంతాలు జలమయం



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వర్షపునీరు

పొదిలి : పట్టణంలో గురువారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా కావడంతో మురుగునీరు బయటకు పోయే మార్గం లేక రహదారుల పైకి చేరింది. శివారు కాలనీలోని కొన్నిచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ కాలువలను సైతం ఆక్రమించుకోవడంతో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా జూనియర్ కాలేజ్ రోడ్డు, అమ్మశాల వీధి, నేతపాలెం, ఇస్త్రాంపేట, బేస్తపాలెం, ఒంగోలు రహదారి ఇరువైపులా బాప్టిస్టుపాలెం ఎస్సీ కాలనీ సమీపంలో పిచ్చిరెడ్డికాలనీ, టైలర్స్ కాలనీ, ఎక్సైజ్ కార్యాలయ భవన ఆవరణలో వర్షపునీరు నిలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్ని మాసాలుగా పారిశుధ్య సిబ్బంది కొరత కారణంగా కొన్ని ప్రాంతాల్లో కాలువలు పూడిక తీయడం లేదు. వర్షపునీటితో పాటు మురికినీరు కూడా రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. బుధవారం 8 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో చిన్న చెరువుకు వచ్చే వాగు పొంగి ప్రవహించింది. దీంతో చెరువులోకి మోస్తరు నీరు చేరింది. జలమయమైన ప్రాంతాలను తహసీల్దార్ విద్యాసాగరుడు, డిప్యూటీ తహసీల్దార్ జానీబేగ్, ఆర్ఐ రవిశంకర్‌లు పరిశీలించారు. మొత్తం మీద చాలా కాలం తరువాత పొదిలిలో భారీవర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్యారాధన



అలంకరణలో రాఘవేంద్ర స్వామి మూల విరాట్

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలో స్థానిక గురు రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన రాఘవేంద్ర సార్వభౌముని 346వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మధ్యారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బిళిగిరి రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ స్వామి బృందావనంలో ప్రవేశించిన రోజు మధ్యారాధనగా నిర్వహించడం సంప్రదాయమన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రాచార్యుల ఆధ్వర్యంలో ప్రశాంతాచార్యులు స్వామి మూల విరాట్‌ను, ప్రహ్లాదరాయులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఫల పంచామృతాభిషేకాలు, సుప్రభాతం, నిర్మాల్య విసర్జన, ఉత్సవరాయుల పాదపూజ, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, తులసి అర్చన నిర్వహించారు. మహిళా మండలి విష్ణు సహస్ర నామ భజన చేపట్టారు. గణపతిపూజ, గోపూజ, ధ్వజారోహణం, ప్రార్థనోత్సవం, లక్ష్మి పూజ, ధాన్య పూజ, హనుమాన్ చాలీసా భజన కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. బృందావన్ సేవా సమితి అధ్యక్షుడు కొత్త లక్ష్మీనారాయణ, కార్యదర్శి మొగిలి లక్ష్మి సుబ్బయ్య, కోశాధికారి ఇమ్మడిశెట్టి శ్రీనివాస మూర్తి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు రథోత్సవం

రాఘవేంద్ర స్వామి ఉత్తరాధన పురస్కరించుకొని గురువారం విశేష పూజా కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.

15 నిమిషాల్లో పాస్ పుస్తకం



పాస్ పుస్తకాన్ని అందజేస్తున్న తహసీల్దార్ చంద్రలీల

తర్లుపాడు : ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన 15 నిమిషాల్లో పాస్ పుస్తకం ఇచ్చే విధానాన్ని బుధవారం తహసీల్దార్ బి.చంద్రలీల ప్రారంభించారు. తర్లుపాడు గ్రామానికి చెందిన వాగిచెర్ల మోహన్‌కు 15 నిమిషాల్లో పాస్ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 నిమిషాల్లో పాస్ పుస్తకం కావాల్సిన రైతులు మీ సేవకు ఆధార్ కార్డు స్వయంగా తీసుకొని వెళ్లి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు ఇ. శేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మీ సేవ ప్రతినిధి యాసిన్, ఉద్యానవన శాఖ ఏవో మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

మార్కాపురం


శ్రీనివాస	- వైశాకం
రాధాకృష్ణ	- డిజె
సాయిబాలాజి	- ఫిదా
విశ్వేశ్వర	- దండుపాళ్యం-2
జగదీశ్వరీ	- గౌతమ్‌నంద
విజయా	- నిన్ను కోరి

పొదిలి

వెంకటేశ్వర	- ఫిదా
హరికృష్ణ	- గౌతమ్‌నంద
రాఘవేంద్ర	- నక్షత్రం

రోజా పూల మొక్క @132

చిటపట చినుకులతో నేలమ్మ మురిసిపోతుంది. ఎటు చూసినా పచ్చని అందాలే. మొక్కలు తెచ్చిన అందమే అదంతా. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. మొక్కలు పెంచడం పరిపాటి. అయితే అరిజోనా (అమెరికా)లోని 'టోంబ్‌స్టోన్ పట్టణం'లో 1885లో నాటిన ఓ రోజా పూల మొక్క నేటికీ విరబూస్తూ ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోంది.



ఎన్నో రోజా పువ్వు మొక్కల్ని చూసి ఉంటారు. కానీ 'టోంబ్‌స్టోన్ రోస్ ట్రీ' మాత్రం అన్నింటికన్నా ప్రత్యేకం. 1885లో నాటిన ఈ మొక్క రోజు రోజుకు వృద్ధి చెందుతూ తొమ్మిది వేల చదరపు అడుగుల్లో విస్తరించింది. వసంతకాలంలో ఈ పూల మొక్కను చూస్తే.. ఎన్నో తెలుపు రోజా పూలతో నేలపై అరవిరిసిన వెన్నెల్లా తోస్తుంది. ప్రపంచంలోనే 'అతి పెద్ద రోజా పూల పొద'గా ఇది గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ చెట్టుకు 132 సంవత్సరాల చరిత్ర ఉంది.



ఈ పూల మొక్క అందాలను ఆస్వాదించాలంటే వసంతకాలం(మార్చి నుంచి ఏప్రిల్) అనువైన సమయం. అంతేకాదు ఈ కాలంలో ప్రత్యేకంగా ఇక్కడ 'రోజ్ ఫెస్టివల్' కూడా జరుగుతుంది.

ఈ రోజా పూల మొక్క 'ద వైట్ లేడీ బ్యాంక్సియా రోజ్' జాతికి చెందింది. ఈ చెట్టు చూడటానికి పొదలా ఉంటుంది. సాధారణంగా రోజా పూల మొక్కలకు ముళ్లు ఉంటాయి. కానీ ఈ మొక్కకు ముళ్లు ఉండక పోవడం విశేషం. 'బ్యాంక్స్ రోజ్' అని కూడా వీటిని పిలుస్తారు. బ్రిటన్‌కు చెందిన పర్యావరణవేత్త, వృక్ష శాస్త్రజ్ఞుడు 'సర్ జోసెఫ్ బ్యాంక్స్' పేరు మీదుగా వీటికి ఆ పేరు వచ్చింది.

స్కాట్లాండ్‌కు చెందిన హెన్నీ గీ, మేరీలు 1884లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత స్కాట్లాండ్ వదిలి వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. మేరీకి తన కుటుంబాన్ని వదిలి వచ్చినందుకు ఎంతో బాధగా ఉండేది. అంతేకాదు తాను చిన్ననాటి నుంచి ఎంతో ప్రేమగా పెంచుకున్న మొక్కలు, ఆ తోట అస్తమానం గుర్తుకు వచ్చేవి. ఈ విషయాలన్నింటినీ వివరిస్తూ తన కుటుంబానికి ఉత్తరం రాసింది. మేరీ కుంటుంబం మేరీ ప్రేమగా పెంచిన కొన్ని మొక్కల కొమ్మలను ఆమెకు బహుమతిగా పంపింది. అవి చూసిన మేరీ ఎంతో సంతోషపడింది. అందులోని రోజా పూల కొమ్మను 'టోంబ్‌స్టోన్'లో ఉంటున్న తన స్నేహితురాలు అమెలియా ఆడమ్సన్‌కు బహుమతిగా ఇచ్చింది మేరీ. తమ స్నేహానికి గుర్తుగా అమెలియా, మేరీలు రోజా పూల కొమ్మను నాటారు. తమ స్నేహంలానే, ఆ రోజా పూల మొక్క కూడా కలకాలం ఉంటుందని మేరీ, అమెలియాలు ఆనాడు ఊహించి ఉండరు. వారు పెట్టిన ఆ మొక్క ఎంతో ఎదిగి 'అతిపెద్ద రోజా పూల మొక్క'గా పేరు పొందింది. కానీ ఆ మొక్కకు అంత పేరు రావడానికి కారణం ఈథెల్ మెసియా. ఆమె ఎవరంటే.. అమెలియా ఇంటిని కొనుగోలు చేసిన ప్రకృతి ప్రేమికురాలు. మెసియా ఆ ఇంటిని కొన్నప్పటికే ఆ పూల మొక్క ఎంతో ఏపుగా పెరిగింది. దాన్ని చూసి మెసియా ఎంతో మురిసిపోయింది. తీగలు వృద్ధి చెందేలా వెదురు కర్రలతో దానికో షెడ్ నిర్మించింది. అలా ఆ చెట్టు మరింత పెరిగి తొమ్మిది వేల చదరపు అడుగుల్లో విస్తరించింది.

రంగులు వేయండి



మీకు తెలుసా?



● నారింజ (ఆరెంజ్) రంగు ఎంత దూరం నుంచయినా కనిపిస్తుంది. అందుకే ట్రాఫిక్ సిగ్నల్ లైట్లలో ఈ రంగును ఉపయోగిస్తారు.

● అమెరికాలో స్కూలు బస్సులకు నారింజ రంగునే ఉపయోగిస్తారు.

ఔనా!

ఉప్పును వంటల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. బట్టలు నానపెట్టడానికి, చేతులు కడుక్కునేందుకు, పళ్లు తోముకోవడానికి, దిష్టి తీసేందుకు వినియోగిస్తుంటారు. ఇలా.. మహా అయితే ఓ పది, పదిహేను రకాలుగా వాడుకుంటాం. కానీ ఉప్పును.. 1400 రకాలుగా వాడుకోవచ్చుట. ఈ విషయాన్ని సాల్ట్ ఇన్‌స్టిట్యూట్ వాళ్లు కొన్ని సంవత్సరాలుగా పరిశోధనలు చేసి మరీ చెబుతున్నారు.



నవ్వుల్ నవ్వుల్

మేనేజర్ : ఏమయ్యా ఆదీ! నీ బలహీనత ఏమిటి?

ఆది : ఆఫీసు నుంచి ఇంటికి వెళదామని అనుకున్నాక ఇక ఏ పని చేయలేను.


మేనేజర్ : మరి నీ బలం ఏమిటి?

ఆది : ఆఫీసుకు వచ్చేంత వరకు ఇంటికి వెళదామనుకోను.

మేనేజర్ : !!!!!!!!!!!!



దారి కనుక్కోండి



అక్షరం ఒకటే!

కింది గడుల్లో ఒకే ఒక ఆంగ్ల అక్షరం రాయండి. తెలుగు మాట వినిపిస్తుంది.

1. ☐ షయం
2. ☐ డియం
3. ☐ రాఫి
4. ☐ డికిలి

- గంగరాజు మోహనరావు, అరుతిపట్టు




చెప్పగలరా?


వేసవిలో ఉన్నాను కానీ వాసవిలో లేను
దరిలో ఉన్నాను కానీ దారిలో లేను
నదిలో ఉన్నాను కానీ గదిలో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

అక్షరం ఒకటే: 1. v 2. b 3. g 4. p

బొమ్మ గీయండి







శ్లాబు ఊరుస్తుండంతో గొడుగులు వేసుకుని పని చేస్తున్న డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది

వానందం

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : జిల్లాలో వానలు జోరందుకున్నాయి. జిల్లాలోని దక్షిణ ప్రాంతంలో కొన్ని మండలాలు మినహా ఇతర అన్ని చోట్లా తగు స్థాయిలో వర్షం కురవడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి ఈ వర్షాలు సాగుకు జీవం పోయడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. జిల్లాలో ఆది, సోమవారాలలో కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు జల్లులు కురవగా మంగళవారం సాయంత్రం నుంచి కాస్తంత మంచి వర్షమే పడింది. రాత్రికి పలు ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి (గడిచిన 24 గంటల్లో) జిల్లాలో 22.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. దాదాపు 20 మండలాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నాగులుప్పలపాడు మండలంలో 98.0 మి.మీ వర్షపాతం నమోదైంది. యద్దనపూడిలో 94.6, పొదిలిలో 77.4, చీమకుర్తిలో 76.6, హనుమంతునిపాడులో 70.6, కొత్తపట్నంలో 65.2, కారంచేడులో 56.6, పర్చూరులో 50.6 మి.మీ వర్షం కురిసింది. మద్దిపాడు మండలంలో 49.4, చిన్నగంజాంలో 43.6, దర్శిలో 39.0, కొనకనమిట్లలో 36.8, మార్టూరులో 36.6, చీరాలలో 35.6, సంతనూతలపాడులో 33.4, మద్దిపాడులో 32.4, ఒంగోలులో 31.8, అద్దంకి, కొరిశపాడులలో 30.0మి. మీ వంతున వర్షపాతం నమోదైంది. మరో 20 మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

గుండ్లకమ్మలో చిక్కుకున్న పెళ్లి బృందం సురక్షితం

నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఆ నీరంతా బుధవారం ఉదయానికి గుండ్లకమ్మలో చేరి ప్రవాహం పెరిగింది. ఆ ఉధృతిలో ఓ పెళ్లి బృందం చిక్కుకోగా అధికారులు అప్రమత్తమై వారిని రక్షించారు. బేస్తవారిపేట మండలం జె.బి. కృష్ణాపురానికి చెందిన సి.హెచ్. రాంప్రసాద పెళ్లి కోసం 70 మందితో కూడిన బృందం మంగళవారం రాత్రి రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయకస్వామి గుడికి వెళ్లారు. అక్కడ గుండ్లకమ్మకు ఒక వైపు కల్యాణ మండపం, మరోవైపు దేవాలయం ఉంటుంది. మంగళవారం రాత్రి కల్యాణ మండపంలో ఆ బృందమంతా బస చేసింది. బుధవారం ఉదయం 8 గంటలకు పెళ్లి పూర్తి కాగా అనంతరం దేవుడి దర్శనం కోసం వారంతా గుండ్లకమ్మను దాటి వెళ్లారు. ఆ సమయంలో కొద్దిపాటి నీరు మాత్రమే వాగులో ఉండగా వారు తిరిగి వచ్చే సమయానికి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో వాగు దాటేందుకు వీలుకాక పెళ్లి బృందం అక్కడ చిక్కుకుపోయింది. విషయం తెలుసుకున్న రాచర్ల మండల రెవెన్యూ అధికారులు స్వయంగా దిగి అగ్ని మాపక సిబ్బంది సాయంతో వారందరినీ సురక్షితంగా ఇవతల వైపు ఒడ్డుకు చేర్చారు. కొరిశపాడు మండలం హనుమాపురంలో వర్షానికి గోడకూలి 12 గొర్రెలు మృతిచెందాయి.

వాగులు, వంకల్లో నీటి ప్రవాహం

తాజా వర్షంతో పాటు రెండు రోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు జల్లులు కురవడంతో పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలు, ఇతర వనరుల్లో ఏడాది తర్వాత నీటి ప్రవాహం కన్పిస్తోంది. అర్ధవీడు మండలంలోని జంపలేరు వాగు, పర్చూరు సమీపంలోని పర్చూరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. హనుమంతునిపాడు మండలం వేములపాడు - గాయంవారిపల్లి గ్రామాల మధ్య ఉన్న ఏనుగుమంద వాగు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దర్శి, అద్దంకి, మార్టూరు, పర్చూరు, చీరాల, చీమకుర్తి, పొదిలి, ఒంగోలు తదితర ప్రాంతాల్లోకి పలు వాగులు, వంకల్లో నీటి ప్రవాహం కనిపించింది.

పాడి పరిశ్రమకు ఊరట

తాజా వర్షాలు పశువులు, పాడి పరిశ్రమకు ప్రాణం పోశాయి. వారం క్రితం వరకు పొలాల్లో పచ్చి మేత, నీళ్ల దొరక్క పశుపోషకులు అవస్థలు పడ్డారు. పలు ప్రాంతాలలో ఈ సీజన్‌లో సాగు చేసిన పశుగ్రాస పంటలు కూడా వాడిపోయే పరిస్థితి వచ్చాయి.

వ్యవసాయానికి ఊపిరి

తాజా వర్షం వ్యవసాయానికి ఊపిరి పోసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చీరాల, పర్చూరు, మార్టూరు, అద్దంకి, దర్శి, ఒంగోలు తదితర వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో మంచి వర్షాలే కురిశాయి. ఈ ప్రాంతంలో ఇప్పటికే సాగులో ఉన్న వేరు శనగ, కంది, పత్తి, మొక్కజొన్న, జూట్ పంటలకు తాజా వర్షం ఉపకరించనుంది. అలాగే పొదిలి, మార్కాపురం, కనిగిరి యర్రగొండపాలెం సబ్‌డివిజన్‌లోని అత్యధిక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మొత్తంగా తాజా వర్షాలు ప్రస్తుతం పొలంలో ఉన్న పైర్లకు జీవం పోయడంతో పాటు తదుపరి పంటల సాగుకు కూడా ఉపకరిస్తాయని రైతులు చెప్తున్నారు. నెలాఖరు వరకు కంది, పత్తి, ఆముదం సాగుకు అవకాశం ఉంది. అలాగే మిర్చి, వరి ఇతరత్రా పంటలు సాగు కూడా ఊపందుకోనుంది.



ఒంగోలులోని లాయర్‌పేట రైతు బజార్‌వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పట్టణాల్లో జన జీవనానికి ఆటంకం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణ ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేకించి ఒంగోలు నగరంలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు పలు విడతలుగా కురిసిన భారీ వర్షానికి ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారులన్నీ తటాకాలను తలపించాయి. కాలువలు పొంగి మురుగు రోడ్లపైకి చేరింది. శివారు కాలనీల్లో మురుగు కాలువలు లేక చిత్తడిగా మారి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలలో నీరు చేరింది. ప్రభుత్వ కార్యాలయాల సముదాయమైన ప్రకాశం భవన్‌లోని తొలి అంతస్తులో ఉండే పలు కార్యాలయాల శ్లాబు పెచ్చులూడి ఉరుస్తుండటంతో ఉద్యోగులు గొడుగులు పట్టుకుని పని చేయాల్సిన వచ్చింది. వ్యవసాయం, వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో ఈ పరిస్థితి కన్పించింది.

అంతా ఓకే కదా!

గిద్దలూరులో తాజా పరిస్థితిపై మంత్రి లోకేష్ ఆరా

ఎమ్మెల్యే అశోక్‌తో సమాలోచనలు

అభివృద్ధికి సహకరిస్తామని హామీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

గిద్దలూరుల తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ పరిస్థితిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే వివిధ రూపాల్లో సమాచారం తెప్పించుకున్న ఆయన బుధవారం తనను కలిసిన శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డితో ఇదే అంశంపై వివరంగా మాట్లాడినట్లు తెలిసింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఇచ్చిన వివరాలు, అంతకు ముందే గూఢచార శాఖ, ఇతర రూపాల్లో తెప్పించుకున్న సమాచారాన్ని అన్వయిస్తూ 'మీరు ఇదే పంథాలో ముందుకు సాగండి. మీ నడవడికే మీకు, పార్టీకి కూడా కలిసి వస్తుంది' అని అన్నట్లు తెలిసింది. లోకేష్‌ను బుధవారం అమరావతిలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కలిశారు. మాజీ ఎమ్మెల్యే రాంబాబు టీడీపీకి రాజీనామా, అనంతర పరిస్థితి వారి మధ్య ప్రస్తావనకు వచ్చింది. ఆ సందర్భంగా అశోక్‌రెడ్డి తాను పార్టీలో చేరిన తర్వాత టీడీపీ శ్రేణులను ఎలా కలుపుకుపోయింది, ఎలా ప్రయత్నిస్తున్నది వివరించారు. రాంబాబుతో ఉన్న టీడీపీ శ్రేణుల్లోని ముఖ్యులు, ప్రత్యేకించి కంభం మండలానికి చెందిన పలువురు తనతో కలిసి పయనిస్తున్న విషయాన్ని లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. రాంబాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు ప్రముఖులు కూడా తనకు మద్దతు తెలిపి కలిసి పని చేస్తున్నారని కూడా చెప్పినట్లు సమాచారం. అర్ధవీడు మండలంలో ఇటీవల వైసీపీలో చేరిన వారిలో అత్యధికులు పార్టీకన్నా రాంబాబుకే ప్రాధాన్యం ఇచ్చే వారని చెప్పినట్లు తెలిసింది. రాంబాబు గతంలో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసినప్పుడు ఆయనకు మద్దతివ్వడంతోపాటు, ఆతర్వాత ఆయన రాజకీయంగా ఎటు అడుగు వేస్తే అటు వెళ్లిన వారే ఇప్పుడు వైసీపీలో చేరారని చెప్పినట్లు తెలిసింది. కొమరోలు మండలంలో అన్నా రాంబాబుతో వెళ్లిన ఒకరిద్దరు నాయకులు కూడా ఆది నుంచి టీడీపీకి చెందిన వారు కాదని లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్తున్నారు. అయితే అంతకుముందు ఎలా ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో కూడా టీడీపీకి మద్దతిచ్చిన వారందరినీ కలుపుకుపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఆ మేరకు వారికి సంకేతాలు కూడా పంపానని తెలిపారు. ఇలా పలు అంశాలను అశోక్‌రెడ్డి విడమరచి చెప్తుండగా 'ఇవన్నీ నిజమే. మా వద్ద ముందున్న నివేదిక ఉంది. అటు గూఢచార శాఖతోపాటు, ఇటు పార్టీలో ఉన్న సర్వే బృందంతో సమాచారం తెప్పించుకున్నాం. మీ పనితీరు బాగుంది. వ్యవహార శైలి అంతకన్నా బాగుంది. ఇదే పంథాలో ముందుకు సాగి ఇంకా రావాల్సిన వారందరినీ సమీకరించుకుని పార్టీని మరింత బలోపేతం చేయండి' అని లోకేష్ సూచించినట్లు తెలిసింది. తదనంతరం అశోక్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలకు అనుసంధానంగా లేని కుగ్రామాలకు రహదారుల నిర్మాణ ఆవశ్యతను వివరించారు. అందుకు సంబంధించిన ఆయా గ్రామాల వారీ పరిస్థితులు, రోడ్ల నిర్మాణ అవసరాలను తెలిపే జాబితాను ఆయనకు వివరించారు. వెంటనే ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తానని లోకేష్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమైన సాగర్ జలాల మళ్లింపు పథకాన్ని తాము విస్మరించలేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన ఆ హామీని నెరవేరుస్తామని కూడా లోకేష్ చెప్పారు.



లోకేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శిద్దా షష్ఠి పూర్తి మహోత్సవాలు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల షష్ఠి పూర్తి మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వందలాది వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చీమకుర్తిలోని హరిహర క్షేత్రంలో బుధవారం నుంచి కార్యక్రమాలకు శ్రీకారం పలికారు. 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్న శిద్దాకు షష్ఠిపూర్తి మహోత్సవం నిర్వహించాలని ఆయన కుమారుడు, యువ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ దంపతులు, కుమార్తె సునీత, అల్లుడు ఫణికుమార్ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మూడ్రోజులు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పిల్లల ఒత్తిడితో అందుకు శిద్దా దంపతులు అంగీకరించారు. బుధవారం హరిహర క్షేత్రంలో ఆయన పూజా కార్యక్రమంలో ఉండగానే సీనియర్ రాజకీయ నాయకుడు, అనంతపురం ఎంపీ జె.సి. దివాకర్‌రెడ్డి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే కదిరి బాబూరావుతోపాటు, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి. సుబ్బారావు, ఇతర ఆయా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు వచ్చి శిద్దాకు శుభాకాంక్షలు చెప్పారు. తొలిరోజు ముందుగా రామతీర్థం జలాశయంలో మంగళస్నానాలు ఆచరించిన శిద్దా దంపతులు, కుటుంబ సభ్యులు ఆ తర్వాత హరిహర క్షేత్రంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. గురువారం కూడా హరిహర క్షేత్రంలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. అయితే గురువారమే మంత్రి రాఘవరావు జన్మదినం కావడంతో ఆయన ఉదయాన్నే కేక్ కట్ చేస్తారు. అనంతరం వేద పండితులు శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులకు షష్ఠిపూర్తి మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ప్రజలు, అభిమానుల కోసం ఆయన షష్ఠిపూర్తి మహోత్సవాలను శుక్రవారం ఒంగోలు నిర్వహించనున్నారు. నగరంలోని ఏ1 కల్యాణ మండపంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. ఆ సందర్భంగా శిద్దా దంపతులకు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు సహచర మంత్రులతోపాటు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, ఇతర రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు కూడా పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు సమాచారం. వీరందరికి తోడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, టీడీపీకి చెందిన పలు వురు ముఖ్య నాయకులు ఒంగోలు వస్తున్నారు. జిల్లాలో పార్టీలకతీతంగా రాజకీయ నాయకులతో పాటు, అధికార, అనధికార ప్రముఖులు, ప్రత్యేకించి శిద్దా ప్రాతినిధ్యం వహిస్తున్న దర్శి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న శిద్దా కుమారుడు సుధీర్ గురువారం హరిహర క్షేత్రం వద్ద, శుక్రవారం ఒంగోలు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం వచ్చినా సమస్య లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు సమీపంలోని కల్యాణ మండపాలను కూడా తీసుకుని అక్కడ కూడా భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రుల రుణం తీసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వారికి శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసు కుంటున్నామని ఈ సందర్భంగా సుధీర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.



శిద్దా దంపతులకు నమస్కరిస్తున్న అనంతరపురం ఎంపీ దివాకర్‌రెడ్డి

అమరావతిలో ప్రకాశంపంతులు స్మృతి చిహ్నాలు

- ఆంధ్రకేసరి జన్మస్థలమైన వినోదరాయునిపాలెం అభివృద్ధికి అన్ని విధాలా కృషి
- గ్రామంలో 9 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు
- ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ వెల్లడి


ప్రభుత్వ సలహాదారు ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినయ్‌చంద్

ఒంగోలు కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు స్మృతి చిహ్నాలను చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని ఎన్నెస్పీ అతిథిగృహంలో కొద్దిసేపు ఆయన విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ వినయ్‌చంద్ మర్యాదపూర్వకంగా ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు ఈనెల 23వ తేదీన జరగనున్న ప్రకాశంపంతులు జయంతి వేడుకల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన త్యాగధనుడు ప్రకాశంపంతులు అని, ఆయనను గుర్తు పెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రకాశంపంతులు జయంతి వేడుకలను రాష్ట్ర పండువగా నిర్వహిస్తుందని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవ చేసిన ప్రకాశం పంతులును చిరకాలం గుర్తుండిపోయేలా రాజధాని అమరావతిలో స్మృతి చిహ్నాలను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ప్రకాశంపంతులు జన్మస్థలమైన జిల్లాలోని వినోదరాయునిపాలెం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగా 9 అడుగుల ఆయన కంచు విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకోసం స్థల పరిశీలన కూడా చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గ్రామంలోని జడ్పీ పాఠశాల ప్రహరీని రూ.10లక్షలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. జెన్‌కో భూసేకరణ ద్వారా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి వెనక్కి ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. జెన్‌కో ఉన్నతాధికారి విజయానంద్‌తో మాట్లాడి త్వరలో సానుకూల ఉత్తర్వులు పొందేలా తనవంతు కృషి చేస్తానని ప్రభాకర్ తెలిపారు. ప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు, పురపాలక శాఖ మంత్రి నారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈదర హరిబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ ప్రత్యేక దృష్టి సారించి తమవంతు సంపూర్ణ సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్‌చంద్ పలు అంశాలను ప్రభుత్వ సలహాదారు ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వినోదరాయునిపాలెం గ్రామంలో 11 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.55 లక్షలు మంజూరు చేశామని, త్వరలో వాటి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిషన్ అంత్యోదయ పథకం కింద 206 గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయనున్నామని, అందులో భాగంగా వినోదరాయునిపాలెం గ్రామాన్ని కూడా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసరావు, సీపీవో కేటీ.వెంకయ్య, నాగులుప్పలపాడు ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, చుండూరి రంగారావు, బి.సూర్యనారాయణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన ప్రకాశం, శ్రీకాకుళం మ్యాచ్

- వర్షం కారణంతో మూడో రోజు మ్యాచ్ రద్దు


వర్షం కురుస్తుండడంతో పిచ్ తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

ఒంగోలు కార్పొరేషన్ : ఒంగోలు శర్మాకళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-16 ప్రకాశం, శ్రీకాకుళం మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడరోజు మ్యాచ్ వర్షం కారణంగా పిచ్ అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో ఇరు జట్ల తొలి ఇన్నింగ్స్ స్కోరు ఆధారంగా ప్రకాశం జట్టుకు 3, శ్రీకాకుళం జట్టుకు 1 పాయింట్ కేటాయించారు. రెండో రోజులపాటు జరిగిన తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు 146 పరుగులు సాధించగా, ప్రకాశం జట్టు 281 పరుగులు భారీ స్కోరు చేసి 135 పరుగులు ఆధిక్యతలో నిలిచింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు మంగళవారం ఆట ముగిసే సమయానికి 4.5 ఓవర్లు ఆడి 13 పరుగులతో ఒక వికెట్ నష్టపోయింది. 122 పరుగులు వెనుకబడి ఉంది.

దీంతో ప్రకాశం జట్టు ఆధిక్యతలో ఉండటంతో మూడు పాయింట్లు దక్కాయి.

చంద్రన్నబాట లక్ష్యాలను

చేరుకోలేని అధికారులపై వేటు?

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పని తీరుపై నివేదిక తయారు

ఒంగోలు కర్నూల్‌రోడ్డు: చంద్రన్నబాట కింద గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయతీరాజ్ శాఖ చేయిస్తున్న సీసీరోడ్ల నిర్మాణాలలో లక్ష్యానికి చేరుకోని ఇంజనీరింగ్ అధికారులపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైంది. ఆ శాఖలో ఏఈ నుంచి ఈఈ వరకు వారు నిర్దేశించిన లక్ష్యానికి ఎంత వరకు చేరుకున్నారనే అంశాలపై ఒక్కొక్క అధికారి ప్రొఫర్మేషన్‌పై నివేదిక తయారు చేశారు. ఈ నెల 2న జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ వినయ్‌చంద్ రోజంతా సమీక్ష నిర్వహించారు. అందులో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలపై సమీక్ష చేశారు. ఒక్కొక్క అధికారికి లక్ష్యాన్ని నిర్దేశించాలని ఆ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అందులో కూడా నెలకు ఒక ఏఈ కిలోమీటరు మేర సీసీరోడ్డు నిర్మాణాలు చేయించాలని నిర్దేశించాలన్నారు. 2017-18 సంవత్సరానికి 600 కి.మీ. మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. కానీ ఏవీ కూడా లక్ష్యానికి చేరింది లేదు. దీనిపై పని చేయని అధికారులను (ఏఈఈ, ఏఈలు) ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు బదలాయింపు చేయాలని, మరికొంత మందిని ఫీల్డు నుంచి తప్పించి కార్యాలయలలోనే పని చేయించుకునే విధంగా చేసి మరొకరిని వినియోగించుకోవాలని ఎస్ఈ చంద్రశేఖర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

దీనిపై గత వారం రోజుల నుంచి జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, కందుకూరు డివిజన్‌ల పరిధిలో గల పనిచేసే ప్రతి ఏఈఈ, ఏఈల పని తీరుపై నివేదికలు తయారు చేశారు. త్వరలో లక్ష్యాలు చేరుకోని వారిపై వేటు పడనుందని ఆ శాఖాధికారులు వెల్లడిస్తున్నారు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై ఒప్పందం

ఒంగోలు కార్పొరేషన్ : ఒంగోలు స్మార్ట్ సిటీలో భాగంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎస్సెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఏపీయుఐఏఎంఎల్ సంస్థ సీఈవో ప్రకాష్ గౌర్ ప్రతినిధి బృందం బుధవారం అగ్రిమెంట్ చేసుకుంది. ఈ సందర్భంగా కమిషనరు వెంకటకృష్ణను కార్పొరేషన్ కార్యాలయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ఇతర అంశాలను తమ ప్రాజెక్టు ద్వారా చేపట్టనున్నట్లు వివరించారు.

లోతట్టు ప్రాంతాల్లో కమిషనరు పర్యటన

నగరంలో బుధవారం కురిసిన వర్షాల కారణంగా నీట మునిగిన ప్రాంతాల్లో కమిషనరు పర్యటించారు. ఈ మేరకు భాగ్యనగర్, దక్షిణ బైపాస్ సెంటర్‌లలో రోడ్ల పైకి మురుగు పొంగి పొర్లడంతో సైడు కాలువల్లో పూడిక తీత పనులు పరిశీలించారు. ఎక్స్‌కవేటర్లతో పనులు చేపట్టి వర్షపునీటిని కాలువల్లోకి మళ్లించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ డి. సుందరరామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని హోంలో చేర్చిన చైల్డ్‌లైన్

ఒంగోలునగరం : స్థానిక రైల్వేస్టేషన్‌లో తప్పిపోయి కనిపించిన బాలుడిని చైల్డ్‌లైన్ ప్రతినిధులు బుధవారం స్థానిక క్లౌపేటలోని బాపిస్టు హోంలో చేర్పించారు. వారు తెలిపిన వివరాల మేరకు... ప్లాటు ఫాం నంబర్ ఒకటిలో గుర్తుతెలియని బాలుడు తిరుగుతుండగా గుర్తించిన జీఆర్పీ పోలీసులు ఆ విషయాన్ని చైల్డ్‌లైన్ ప్రతినిధులకు తెలియజేశారు. చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ కిషోర్ కుమార్, ప్రతినిధులు రవికుమార్, ఆంజనేయులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి బాలుడి వివరాలు సేకరించారు. ఆ బాలుడి పేరు మారుతి అని నెల్లూరు జిల్లా కలిగిరి మండలం తెల్లబాడుగా చెప్పాడు. ఇతర విషయాలు చెప్పలేకపోవటంతో బాలుడిని బాలల సంరక్షణ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు క్లౌపేటలోని బాప్టిస్టు హోంకు తరలించారు.

తాలూకా పోలీసుస్టేషన్ ఎదుట భారీగా ట్రాఫిక్ జామ్

- కన్నెత్తి చూడని పోలీసులు

- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు

ఒంగోలు కార్పొరేషన్ : తాలూకా పోలీసుస్టేషన్ ఎదుట బుధవారం రాత్రి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు గంటకు పైగా వాహనాలన్నీ నిలిచి పోయినా, కూత వేటులో ఉన్న పోలీసులు కన్నెత్తి చూడలేదు. హైవేతోపాటు పక్కనే సర్వీసు రోడ్‌లోనూ పలు వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. సుజాతనగర్, చీమకుర్తి, గాంధీనగర్, మంగమూరు రోడ్, సమతానగర్ పలు చోట్లకు ఈ వైపు నుంచే వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. పదేపదే సమస్య ఎదురవు తున్నా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖ పాఠాలు నేర్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు గంటకు పైగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు హారన్‌ల మోత, మరోవైపు చీకటి వాతావరణంతో గంటసేపు గందరగోళ పరిస్థితి కనిపించింది. ఆ తర్వాత నింపాదిగా ఒకరిద్దరు హోంగార్డులు వచ్చి ట్రాఫిక్ నియంత్రించేందుకు నానా తిప్పలు పడ్డారు.

మానవతా విలువలు లోపించాయి

ఒంగోలులీగల్ : మనుషుల్లో మానవతా విలువలు లోపించడం వలనే నిరాశ్రయులు వసతి గృహాలు, వృద్ధాశ్రమాలు సమాజానికి అవసరం అవుతున్నాయని జిల్లా న్యాయసేవాదికార సంస్థకార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి టి.రాజావెంకట్రాద్రి చెప్పారు. నగర పాలక సంస్థ వారి పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వసతి, భోజన సదుపాయాలను పరిశీలించి అక్కడి వారికి చట్టాలపై అవగాహన కలగజేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఒంగోలు నగరం : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మీసుధ చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రగతి భవన్‌లో బుధవారం జరిగిన సభలో రిమ్స్‌ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

నేడు మంత్రి సత్యనారాయణ రాక

ఒంగోలు కలెక్టరేట్ : కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ గురువారం జిల్లాకు రానున్నారు. గురువారం ఉదయం 11గంటలకు చీమకుర్తి చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడకు వెళ్తారు.

ఆంధ్రజ్యోతి
4
అద్దంకి
ప్రకాశం ● గురువారం
10 ఆగస్టు 2017
అద్దంకి । మేదరమెట్ల । బల్లికురవ । పంగులూరు । సంతమాగులూరు

విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలి : ఎంఈవో

అద్దంకిటౌన్ : అద్దంకి మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ఈ నెల 10, 11వ తేదీల్లో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఎంఈవో విజయకుమార్ బుధవారం ప్రకటనతో ఆదేశించారు. పాఠశాలల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, 15వ తేదీన ఉపాధ్యాయులు అందరు కచ్చింగా హాజరుకావాలన్నారు. ఎవరికి సెలవులు మంజూరు చేయకూడదని ఆదేశించారు. గ్రామపెద్దలు, ఎస్ఎంసీ సభ్యులతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు.


ప్రాణం పోసుకున్న శింగరకొండ వద్ద గల పత్తిచేను


ఉప్పుమాగులూరులో పంట పొలాల్లో నిలిచిన నీరు


అద్దంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు


పంగులూరు వద్ద గోతలయమైన రోడ్డు

వానా..వందనం !

● బెట్టకు వచ్చిన పంటలకు జీవం పోసిన వర్షం ● సాగుకు సిద్ధమవుతున్న రైతులు

అద్దంకి: వర్షాభావ పరిస్థితులతో అద్దంకి నియోజకవర్గంలో సాగు చేసిన పంటలు ఎండిపోతూ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు జీవం పోసుకున్నాయి. ఖాళీగా ఉన్న భూములలో పలు రకాల పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పత్తి, జూట్, మినుము, పెసర తదితర పంటల సాగు జరిగింది. ఆపంటలకు ప్రస్తుతం వర్షాలు కొంతమేర జీవం పోయగా పొలాలు బాగా పదును కావడంతో పత్తి, కంది, మినుము, పెసర, మిర్చి తదితర పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి సాగుకు చేపట్టనున్నారు. కాగా పలు వాగులలో కూడా నీరు నిలిచింది. ప్రధానంగా పశుగ్రాసానికి వర్షం మరింత ఉపయోగపడింది. తిమ్మాయిపాలెం వద్ద పల్లపు ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలిచి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు జలమయం

అద్దంకిటౌన్ : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో వాతావరణం చల్లబడింది. అలాగే వర్షంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణంలో వర్షపు నీరు నిలిచింది. అద్దంకిలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ప్రధాన ద్వారాల వద్ద వర్షపు నీరు నిలిచి కార్యాలయంలోకి రాకపోకలు చేయాలన్నా ఇబ్బందిగా మారింది. అద్దంకి భవానీసెంటర్‌లోని ఎల్ఆర్ ఎయిడెడ్ స్కూల్ ఆవరణంలో వర్షపు నీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ సమీపంలో నీరు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

అద్దంకి రూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వెలుపల ప్రాంగణమంతా వర్షపు నీటితో చెరువు తలపించే విధంగా మారింది. దీంతో బుధవారం ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందిపడ్డారు.

17.4 మి.మి వర్షపాతం

పంగులూరు: పంగులూరులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11.30 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వర్షపాతం 17.4 మి.మీ గా నమోదయ్యింది. గత నాలుగు రోజులుగా సాయంత్రం వేళ ఒక మోస్తరు వర్షం పడుతోంది. కాగా పంగులూరులోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఇరువైపులా అక్కడక్కడా నీరు నిలిచింది. దశాబ్దన్నర క్రితం సీసీరోడ్డు నిర్మితమవగా ఇరు వైపులా డ్రైనేజి నిర్మాణం జరగక పోవడంతో ప్రధాన కూడలిలో నీరు నిలబడటం అసౌకర్యంగా మారింది. రోడ్డుకు ఇరు వైపుల డ్రైనేజిని ఎమ్మెల్యే రవికుమార్ సహకారంతో నిర్మిస్తామని సర్పంచ్ బాచిన నీరజ తెలిపారు.


భవానీసెంటర్‌లోని ఎయిడెడ్ స్కూల్‌లో వర్షపు నీరు


శింగరకొండ ఆలయం ఎదుట నిలిచిన నీరు

వర్షాలతో పంటల కళకళ

బల్లికురవ: గత రెండు రోజుల నుంచి బల్లికురవ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు బెట్టకొచ్చి పైరులు ప్రాణం పోసుకున్నాయి. మండలంలోని ఉప్పుమాగులూరు, వేమవరం, కొణిదెన, కొప్పెరపాలెం, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, అంబడిపూడి, కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో వేసిన పత్తి, జూట్, కంది పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వరుసగా వర్షం కురవడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి. వర్షాలు సుబాబులు, జామాయిలు తోటలకు జీవం పోశాయి.

వధూవరులకు ఎమ్మెల్యే రవికుమార్ ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి: అద్దంకి మండల మాజీ ఎంపీపీ, నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు మన్నెం ఏడుకొండలు కుమారుడు రాజేష్, అఖిల వివాహం బుధవారం రాత్రి స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పరిమి దయామణి, కరి పరమేష్, జడ్పీటీసీ వల్లెపు ఆంజనేయులు ఆశీర్వదించారు.

ఫతేపురం మెయిన్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సంతమాగులూరు: ఫత్తేపురం గ్రామస్తుల రోడ్డు కష్టాలు తీరనున్నాయి. చిన్నపాటి చినుకు పడినా తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉండేది. గత నెలలో గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే రవికుమార్ మెయిన్‌రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మెయిన్ రోడ్డు నిర్మాణం కోసం రూ.40 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం గ్రామ నాయకులు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకట్, ఐనాల గోపి, ఏలూరి శ్రీను, కొల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

మేదరమెట్ల: ప్రముఖ సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను మేదరమెట్లలో ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి మేదరమెట్ల నారాయణ చిత్రాలయ ఆవరణలో జరిగిన వేడుకలకు థియేటర్ యజమాని గోవర్ధన గిరి ఇండీవర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహేష్‌బాబు నటించిన కొత్త సినిమా స్పైడర్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇండీవర్ బాబు కేక్‌ను కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ సాయి, సుధీర్, కార్తీక్, అనీల్, కళ్యాణ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మనగుడి కార్యక్రమాలు

అద్దంకిటౌన్ : శ్రావణ బహుళ పంచమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మ ప్రచారపరిషత్ , దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని 56 మండలాల్లో జరిగే మనగుడి కార్యక్రమంలో భాగంగా కృష్ణాష్టమి వేడుకలు ఈనెల 12,13,14 తేదీల్లో జరుగుతాయని ప్రాజెక్ట్ జిల్లా కోర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోని ఎంపిక చేసిన దేవాలయాల్లో 12న ఆలయ శుద్ధి, 13, భజన మండళ్ల ఆధ్వర్యంలో నగర సంకీర్తన, భజన కార్యక్రమం, 14న అద్దంకి, పర్చూరులలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉదయం గోపూజ, సాయంత్రం ఉట్టి కార్యక్రమాలు జరుగుతాయని, అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

రాచపూడి చెరువుకు ఇంజన్లతో వర్షపునీరు మళ్లింపు

మేదరమెట్ల: రాచపూడి చెరువుకు గుండ్లకమ్మ ఎడమ కాలువ నిర్మాణంతో పొలాల నుంచి చెరువుకు వచ్చే వర్షపు నీటికి అడ్డంకి అయ్యింది. దీంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. గత సంవత్సరం వర్షాలు లేకపోవడం, గుండ్లకమ్మ ఎడమ కాలువకు నీరు అందకపోవడంతో రాచపూడి చెరువును నింపలేకపోయారు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున కురిసిన వర్షానికి గుండ్లకమ్మ కాలువలో ప్రవహిస్తున్న వర్షపు నీటిని గ్రామస్తులు ట్రాక్టర్లు ఇంజన్లు పెట్టి చెరువుకు నింపుతున్నారు. భవిష్యత్తులో సక్రమంగా వర్షాలు పడతాయో లేదోనని, కొంత అయినా చెరువును నింపుకుంటే తాగునీటి అవసరాలు తీరతాయని నీటిని ఎత్తిపోస్తున్నామని గ్రామస్తులు చెప్పారు. శాశ్వతంగా చెరువు నింపడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు కారుతుందని ప్రయాణికుల ఫిర్యాదు

● నిలిపివేసిన అధికారులు

అద్దంకి టౌన్: అద్దె బస్సు కారుతుందని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ బస్సును నిలిపి వేశారు. ఈ సంఘటన అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ డిపోలో బుధవారం జరిగింది. ఆర్టీసీ అధికారులు తెలిపిన సమాచారం మేరకు అద్దంకి-ఇంకొల్లు వయా చందలూరు తిరిగే అద్దె బస్సు బుధవారం కురిసిన వర్షంతో టాప్ నుంచి వర్షపు నీరు కారడంతో ప్రయాణికులు అసిస్టెంట్ మేనేజర్ రమణమ్మకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బస్సును నిలిపివేయాలని యాజమాన్యానికి సూచించారు. వెంటనే దానిని నిలిపివేయించారు.

అర్హులకు ఎన్టీఆర్ ఇళ్లు మంజూరు

సంతమాగులూరు: సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం, కొప్పరం, బండివారిపాలెం, ఫత్తేపురం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ గ్రామసభలు జరిగాయి. గతంలో ప్రజాసాధికార సర్వేలో నివేశన స్థలాలు, ఎన్టీఆర్ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు మంజూరు చేస్తామని తహసీల్దార్ టీవీఎల్.కాంతారావు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ప్రకాష్‌రావు, తేల్ప్రోలు వెంకట్రావు, గుంజి లక్ష్మయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, కొల్లి వెంకటేశ్వర్లు, గుంజి కృష్ణయ్య, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్	- ఫిదా
శ్రీరామ	- నక్షత్రం
మినీ వివిఎస్ఎస్	- గౌతమ్‌నంద

మేదరమెట్ల

నారాయణ చిత్రాలయ	- నక్షత్రం

మందు మైకం..

చీరాల నాజ్ థియేటర్‌రోడ్‌లో ఓ మందుబాబు బుధవారం హల్‌చల్ చేశాడు. మద్యం మైకం కమ్మడంతో నడిరోడ్డులో పడిపోయాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి ప్రమాదం జరగకుండా సకాలంలో స్పందించిన పోలీసులు, స్థానికులు అతడిని పక్కకు తరలించడంతో సమస్య సర్దుమణిగింది.

-చీరాల



నడిరోడ్డుపై పడుకున్న మందుబాబు

వాన కురిసింది..జీవం పోసింది!

- వర్షంతో ఊపిరి పీల్చుకున్న పైర్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- సముద్రంలో నిలిచిన వేట
- పలుచోట్ల వీధులు జలయమం

చీరాల : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం పైర్లుకు జీవం పోసింది. అన్నదాత ఒకింత ఊరట చెందాడు. ఎండు ముఖం పట్టిన వేరుశనగ పైరు పచ్చదనం సంతరించుకుంది. సొనల్లో నీళ్లు చేరాయి. మంగళవారం రాత్రి నుంచి మొదలైన వర్షం కొద్దికొద్ది సేపు విరామంతో బుధవారం మధ్యాహ్నం వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పైర్లకు ఈ వర్షంతో ఎంతో మేలు చేకూరింది. చీరాల వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ప్రధానంగా చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం పూత దశలో ఉంది. స్ప్రింక్లర్లు కింద సాగు చేసిన వారి కన్నా వర్షాధారంగా సాగు చేసిన వారికి ఈ వర్షం చాలా ఉపయోగకరంగా ఉంది. వేటపాలెం మండలం పాపాయిపాలెం పరిధిలో వేరుశనగకు నీళ్ల మందు పిచికారి చేసేందుకు చేల వద్ద అందుబాటులో నీరు లేక ఇబ్బంది పడ్డారు. అలాంటి వారికి ప్రస్తుతం కురిసిన వర్షంతో సమస్య తీరింది. తీరప్రాంతంలో సాగు చేసిన ఆకు కూరలు, కూరగాయలు, చీరాలనగర్ ప్రాంతంలో సాగుచేసిన పూలతోటలకు ఈ వర్షం అనుకూలంగా ఉందని రైతులు చెప్తున్నారు.



చీరాల ప్రాంతంలో నవనవలాడుతున్న వేరుశనగ పైరు



కొత్తపేట రోడ్డులో వర్షానికి భారీగా నిలిచిన నీరు

తీరంలో నిలిచిన బోట్లు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సముద్రగర్భంలో మార్పు ఏర్పడింది. వేటకు వెళ్లిన వారికి మత్స్యసంపద సక్రమంగా దొరకటం లేదు. ఆయిల్ ఖర్చులకు కూడా రాకపోవడంతో వేటకు వెళ్లటం మానుకున్నారు. అయితే వర్షం ఆగాక సముద్రంలో వేట బాగుంటుందని, మత్స్యసంపద కూడా సాధారణంగా ఎక్కువగా వలకు చిక్కుతుందని చెప్తున్నారు. దీంతో బోట్లును కొందరు తీరం వెంట సముద్రంలో లంగర్లు వేయగా మరికొందరు ముదుగుకాలువలో నిలిపారు.

వీధులు జలయమం

మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు కొంత ఇబ్బందిపడ్డారు. స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో హాజరుకాలేకపోయారు. నాలుగు రోజులుగా మంగు వాతావరణం, జల్లులతో మగ్గం పనులు నిలిచాయి. రోడ్లు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంలో చినుకు పడితే ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. రచ్చబండ సమీపంలో ప్రధాన రహదారి పల్లంగా ఉంటుంది. సుమారు 100 మీటర్లు మేర వర్షం కురిస్తే నీరు నిలుస్తున్నది. దీంతో వాహనదారులు, గ్రామస్థులు కూడా ఆ దారిన నడవాలంటే అవస్థ పడుతున్నారు. ఒకసారి వర్షం కురిసిందంటే సుమారు వారం రోజుల పాటు ఆ నీరు నిల్వ ఉంటుంది. అలాగే చీరాలలో అంతర్భాగంగా ఉండే కొత్తపేట గ్రామంలో పలు రోడ్లు చిత్తడిగా మారాయి. కొన్ని చోట్ల గుంతలు ఏర్పడి నీరు చేరి పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ కార్యాయలం పక్క వీధిలో రోడ్డు చెరువును తలపిస్తోంది. సక్రమైన డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వేటపాలెం: వేటపాలెం మండలం పరిధిలో గత రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల రోడ్ల జలమయంగా మారాయి. ప్రధాన రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. వేటపాలెం నుంచి చీరాల వెళ్లే వన్‌వే రోడ్డులో దాదాపు వంద మీటర్ల మేరు రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయింది. రావూరిపేట మలుపులో, చీరాల-పందిళ్లపల్లి ప్రధానరోడ్డు మలుపులో వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కుందేరు పొలాల్లో వరి నారుమళ్లు పోసుకొన్న రైతులకు ఈ వర్షం ఎంతో ఆనందానిచ్చింది.





వేటపాలెం వన్‌వే రోడ్డులో, రావూరిపేట మలుపు వద్ద నిలిచిన వర్షపు నీరు

ఇది డబ్బులు వాన..



ప్రస్తుతం కురిసిన వర్షం డబ్బుల వాన. ఇప్పటికే వేరుశనగ బెట్టకు వచ్చింది. ఈ దశలో మంచి వాన పడింది. మంగళవారం కురిసిన వానకే చాలా వరకు పైరు తిప్పుకుంది. బుధవారం ఇంకా పెద్ద వాన పడింది. ఇంకో పది పదిహేను రోజులు దిగులు లేదు. ఈ లోపు ఇంకో వాన పడితే మాకు సరిపోతుంది.

- నాగరాజు, చీరాల

సీఈసీ విద్యార్థుల సంకల్పసిద్ధి ప్రతిజ్ఞ

చీరాల : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులతో కళాశాలల సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్ కుమార్ బుధవారం సంకల్పసిద్ధి ప్రతిజ్ఞ చేయించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మననంచేశారు. ప్రిన్సిపాల్ సయ్యద్‌కమాలుద్దీన్ పాల్గొన్నారు.

యాంటీ న్యూక్లియర్‌డేపై అవగాహన

చీరాల : చీరాలలోని వైపె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం యాంటీ న్యూక్లియర్‌డే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.రమణమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ వెంకయ్య, రసాయనశాస్త్ర అధ్యాపకులు ముత్తారెడ్డి న్యూక్లియర్‌బాంబ్ వల్ల కలిగే దుష్ప్రరిణామాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సమస్యల ప్రస్తావన

చీరాల : రైల్వేశాఖపరంగా చీరాల రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను, నూతనంగా స్టాపింగ్ కల్పించాల్సిన రైళ్ల వివరాలను బుధవారం విజయవాడలో జరిగిన డీఆర్‌యూసీసీ సమావేశంలో మెంబర్లు వై.సత్యనారాయణ(వైఎస్), కొల్లా సుబ్బారాయుడులు చర్చించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తాము తయారుచేసిన నివేదికలను సమావేశం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు చెప్పారు.

తలసైనిక్ క్యాంపునకు ఆరుగురు క్యాడెట్ల ఎంపిక

చీరాల : చీరాలలోని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాలకు చెందిన ఆరుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఢిల్లీలో జరిగే తలసైనిక్ క్యాంపునకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ జాగర్లమూడి రేవతి ఎంపికైన క్యాడెట్లను అభినందించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చీరాల : చీరాలలోని శ్రీకామాక్షికేర్ హాస్పటల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉచిత ఎముకుల సాంద్రత పరీక్షా వైద్యశిబిరం జరుగుతుందని హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చీరాల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఒకరికి గాయాలు

చీరాల టౌన్ : కారు, ఆటో ఢీకొన్న సంఘటన కారంచేడు వద్ద గల ఆర్చీ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు కావడంతో పర్చూరు 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. దీంతో చీరాల-కారంచేడు రహదారిపై కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	ఫిదా
సంగం	గౌతమ్‌నంద
సాయిప్యాలెస్	నక్షత్రం
శాంతి	దర్శకుడు

వాడరేవు టోల్‌గేట్ వద్ద ప్రైవేటు బస్సుల సిబ్బంది పేచీ

చీరాల : వాడరేవుకు రాకపోకలు సాగించే ప్రధాన వాహనాల నుంచి రుసుము వసూలు చేసేందుకు కీర్తివారిపాలెం వద్ద ఇటీవల టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ఈ టోల్‌గేట్ వద్ద వాడరేవు- చీరాల మధ్య తిరిగే ప్రైవేటు బస్సు సిబ్బంది రుసుం చెల్లించబోమని పేచీ పెట్టారు. టోల్‌గేట్ సిబ్బంది పంచాయతీ సెక్రటరీతో మాట్లాడి ఆయన సూచన మేరకు బస్సును నిలిపి వేశారు. ఈక్రమంలో మరో ఐదు బస్సులు ఆగాయి. టోల్‌గేట్‌కు రోజుకు ఒక్కో బస్సుకు రూ.50 చెల్లించాలనేది నిబంధన. వారు అందుకు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో బస్సులు నిలిపారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బస్సుల తరపు వారు పంచాయతీ సెక్రటరీతో మాట్లాడారు. సెక్రటరీ సూచన మేరకు బస్సులను పంపారు. వారు రుసుము చెల్లిస్తామని అంగీకరించారని సెక్రటరీ తెలపటంతో బస్సులు పంపినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. ఆటోకు రూ.20, పెద్ద వాహనాలకు రూ.30, బస్సులకు రూ.50 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకసారి చెల్లిస్తే ఆ రోజులో మరలా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటాలి

చీరాల : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం ఉద్యమంలా చేపట్టాలని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్‌కమాలుద్దీన్ అన్నారు. ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కళాశాల ప్రాంగణంలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అటవీశాఖ వారు మొక్కలను ఉచితంగా సరఫరా చేశారు. ఎన్‌సీపీ విభాగాధిపతి శ్రీధర్‌కుమార్, పర్యావరణ అధ్యాపకుడు జయకుమార్‌జాకబ్‌లను కళాశాల కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్ అభినందించారు.



మొక్కలను నాటుతున్న సయ్యద్‌కమాలుద్దీన్

సహనం ఉపాధ్యాయుల ప్రాథమిక లక్షణం కావాలి : కమిషనర్

చీరాలటౌన్ : సహనం ఉపాధ్యాయుల ప్రాథమిక లక్షణం కావాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు వజ్రం సంతాప సభ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చీరాలలోని ఎన్‌జీఓ హోంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సహనానికి మారుపేరైన వజ్రం అకాల మరణం తీరనిలోటన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా రాణించటమే కాక, సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటంలో వజ్రం ఎప్పుడు ముందుండేవారని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ చేతుల మీదుగా ఆమె కుటుంబసభ్యులకు యూటీఎఫ్ కుటుంబసంక్షేమం నిధి నుంచి రూ.1.40లక్షల చెక్కును అందజేశారు.యూటీఎఫ్ నాయకులు కె.వీరాంజనేయలు, గవిని నాగేశ్వరరావు, కుర్రా రామారావు, పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా శ్రీనివాసరావు, జానీభాషా, చీరాల, వేటపాలెం మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలి

వేటపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలని హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డీవీఆర్.నాగరాజు కోరారు. బుధవారం దేశాయిపేట పంచాయతీ నవజ్యోతి యానాదికాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బొగ్గుల శ్రీనివాసరావు, గుగ్గిలం శ్రీహరి, పి.సురేద్ర, బొడ్డు శ్రీను, సుధాకర్‌రెడ్డి. పీవీ.భాస్కర్, పీవీ.సాంబశివరావు, హెచ్‌ఎం పీవీ.సుబ్బారావు పాల్గొన్నారు.



పుస్తకాలను అందిస్తున్న సభ్యులు

వీఆర్వోలు ఉద్యోగ కేంద్రాల్లోనే నివసించాలి

ముండ్లమూరు : వీఆర్వోలు ఉద్యోగ కేంద్రాల్లోనే ఉండాలని తహసీల్దార్ బి. గంగాధరరావు ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన వారితో సమావేశమయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా పిడుగులతోపాటు వర్షాలు పడుతున్నందున వీఆర్వోలంతా గ్రామాల్లో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పొలం పనులకు వెళ్ళిన వారు ఉరుములు మెరిసేడప్పుడు చెట్ల కిందకి వెళ్లకూడదని గ్రామంలో దండోరా వేయించాలని ఆయన సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె. రవికుమార్, వీఆర్ఓలు శేషగిరిరావు, బి. గురవయ్య, విజయ్‌కుమార్, కోటయ్య, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



ఎన్.సాంబ శివరావు, దొనకొండ ఎంఈవో

35 మంది టీచర్లకు బదిలీ

ప్రశ్న : మండలంలో ఎంతమంది టీచర్లకు బదిలీ అయ్యింది?

జవాబు : మొత్తం 35మంది ఉపాధ్యాయులు ఇతర మండలాలకు బదిలీపై వెళ్తున్నారు.

ప్రశ్న : మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు : ప్రస్తుతం ఉన్న పాఠశాలల రోల్‌ప్రకారం ఇంకా మూడు పోస్టులు అవసరం.

ప్రశ్న : కొత్తగా ఎంతమంది ఉపాధ్యాయులు వచ్చారు?

జవాబు : ఇప్పటికే యూపీ పాఠశాలలకు 12మంది, ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎంలు ఇద్దరు విధుల్లో చేరారు.

ప్రశ్న : మధ్యాహ్న భోజనం పథకం నిధులు మంజూరులో జాప్యం జరుగుతుందా?

జవాబు : బడ్జెట్ మేరకు బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పంపించాం. ట్రెజరీలో సాంకేతిక కారణాల వలన నిధులు మంజూరులో జాప్యం జరుగుతోంది.

ప్రశ్న : శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు భవనాల మంజూరయ్యాయా?

జవాబు : శిథిలావస్థకు చేరిన పాఠశాలల భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించడానికి స్థల సమస్య ఏర్పడుతోంది. అందువల్లే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోతున్నాయి.

- దొనకొండ

అంకిత భావంతోనే గుర్తింపు

తర్లుపాడు : అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంఈవో డి.సుజాత అన్నారు. స్థానిక హిందూ ప్రాథమిక(ఎ.ఎ) పాఠశాల ఉపాధ్యాయులు మేకల చంద్రశేఖర రాజు, బీసీహెచ్ వెంకటేశ్వర్లు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా బుధవారం పాఠశాలలో సన్మానం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చంద్రశేఖరరాజు, వెంకటేశ్వర్లు 8 ఏళ్ల పాటు ఉత్తమ సేవలను అందించారని కొనియాడారు. సర్పంచ్ కందుల విజయకళావతి మాట్లాడు తూ ఇద్దరూ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యను అందించారన్నారు

దర్శి సినిమాలు

వెంకటేశ్వర	:	ఫిదా
శ్రీనివాస	:	నక్షత్రం
శివశంకర్	:	గౌతమ్‌నంద
భాస్కర్	:	బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్

వర్షంతో పైర్లకు జీవం



దర్శిలో కళకళలాడుతున్న సజ్జ పైరు

దర్శి : ఖరీఫ్‌లో సాగుచేసిన పైర్లు మంగళవారం కురిసిన వర్షానికి జీవం పోసుకున్నాయి. గత రెండునెలలుగా సరైన వర్షం లేకపోవడంతో పైర్లు వాడిపోయాయి. జూన్ లో కంది, పెసర, సజ్జ, జొన్న తదితర వాటిని సాగుచేశారు. చాలాచోట్ల పెసర పైరు ఎండిపోయింది. కందిలో అంతరపంటగా వేసిన పెసర పైరు వాడిపోతున్న తరుణంలో వర్షం పడడంతో జీవం పోసుకుంది. గిటక పారిన కందిపైరు వర్షాలకు కళకళలాడుతోంది. కొన్ని ప్రాంతాల్లో సాగుచేసిన సజ్జపైరు గింజ పోసుకునే దశకు చేరుకుంది. పైర్లు వాడి పోతున్న తరుణంలో వరుణదేవుడు కరుణించడంతో రైతులు సంబరపడుతున్నారు. దర్శిలో 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పైర్లకు నోచుకోని భూముల్లో విత్తనం వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఏదిఏమైనా వరుణుడు కరుణతో సాగుచేసిన పైర్లు కళకళలాడుతున్నాయి.

కురిచేడు : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం రైతులకు మేలు చేసినట్టు అయ్యింది. కురిసిన కొద్దిపాటి వర్షంతో పైర్లు కళకళలాడుతున్నాయి. చేలల్లో నీరు నిలచే స్థాయిలో వర్షాలు కురిస్తే పంటలు పుష్కలంగా పండడానికి అవకాశం ఉంది.

ముండ్లమూరులో చిరుజల్లులు

ముండ్లమూరు : మండలంలోని పలుగ్రామాలలో బుధవారం ఉదయం చిరుజల్లులు కురిశాయి. సోమ, మంగళవారాలు భారీ వర్షం కురవగా, బుధవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కురిశాయి. వేముల, కమ్మవారిపాలెం, పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, పులిపాడు, సింగనపాలెం, ముండ్లమూరు, రెడ్డినగర్, నాయుడుపాలెంలో చిరుజల్లులు కురిశాయి. ఏదిఏమైనా 3 రోజులుగా కురిసిన వర్షంతో మెట్టు పైర్లు కళకళాడుతున్నాయి.



పేకాడుతూ పట్టుబడిన జూదరులు

ఏడుగురు జూదరుల అరెస్టు

దొనకొండ : గంగదేవిపల్లెలోని ఓ ఇంట్లో ఏడుగురు వ్యక్తులు బుధవారం పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబట్టారు. వారి వద్ద నుంచి రూ.1350లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ కె.అజయ్‌కుమార్ తెలిపారు. వారిని గురువారం దర్శి కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఏ గ్రామంలో నైనా పేకాడినా, మద్యం బెల్ట్ షాపులు నిర్వహించినా వెంటనే 9440627116 నంబరుకు డయల్ చేయాలని ఆయన కోరారు.

ప్రజా జీవితంలో మమేకం ..ఆకాశవాణి

మార్కాపురం వన్‌టౌన్ : ప్రజల జీవితంలో ఆకాశవాణి మమేకమైందని ఆర్డీవో పి.కిశోర్ అన్నారు. మార్కాపురం ఆకాశవాణి కేంద్రం 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాలు స్థానిక రేడియో కేంద్రంలో ప్రోగ్రాం హెడ్ బీఆర్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అ తిథిగా హాజరైన ఆర్‌డీవో మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఆకాశవాణి కేంద్రం ప్రారంభించి 25 ఏళ్లు పూర్తి చే సుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ఎప్పటి నుంచో అ న్ని వర్గాల ప్రజలకు ఏకైక సమాచార సాధనం రేడియో అ న్నారు. ఇంటర్‌నెట్ వచ్చినా ఆకాశవాణికి ఆదరణ తగ్గలేదన్నా రు. విజ్ఞానం, వినోదం అందిస్తూ మార్కాపురం కేంద్రం ప్రజల జీవితాల్లో భాగమైందని పేర్కొన్నారు. డీఎస్పీ ఎన్‌వీ రామాంజనేయులు మాట్లాడుతూ అతి త క్కువ ఖర్చుతో అన్ని వర్గాలకు చేరువైన ఆకాశవాణి కొత్త కార్యక్రమాలతో శ్రోతలకు మరింత చేరువైందన్నారు. గతంలో తాను కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సిద్ధమయ్యేటప్పుడు ఆకాశవాణిలో వ చ్చే చర్చా వేదికలు, కరెంట్ అఫైర్స్, వార్తలు ప్రామాణికంగా తీసుకొని చదివానన్నారు. వివి .ద భారతి కార్యక్రమాల్లో ఎన్నో మారుమూల ప్రాంతాల నుంచి ఫోన్‌లు రావడం ఆకాశవాణికి ఉన్న ప్రాముఖ్యత తగ్గలేదని ని రూపిస్తుందన్నారు. కంభం గు రుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.డేవిడ్ లివింగ్ స్టన్ మాట్లాడారు.

జూదరులకు జైలు

తాళ్లూరు : తాళ్లూరులో పట్టుబడిన జూదరులను దర్శి కోర్టులో హాజరుపరచగా 10 రోజుల జైలు, రూ.100ల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ విమహేష్ బుధవారం తెలిపారు. పట్టుబడిన వారు మళ్లీ జూదమాడితే రౌడీషీటర్ తెరుస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

తాళ్లూరు : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో సానికొమ్ము సత్యం తెలిపారు. తన కార్యాలంలో బుధవారం ఆయన కార్యదర్శులు, ఎన్ఆర్‌జీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం 10వ తేదీ నుంచి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించిందన్నారు. ఇంచార్జి ఈవోఆర్డీ సి సురేష్ పర్యవేక్షణలో గ్రామాల్లో ఈ పనులు చేపడతామన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద మండంలో 80 ఎకరాల్లో మెక్కలు నాటాలని నిర్ణయించగా, ఇప్పటికే 27 ఎకరాలు గుర్తించినట్టు చెప్పారు.వారం రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో ప్రగతి పనులు చేపట్టాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుధాకర్, ఏపీఎం టీ జీవరత్నం, ఏపీవో సుధాకరరావు, ఇంచార్జి ఈవోఆర్డీ సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర నూర్ బాష సంఘ ఉపాధ్యక్షుడిగా మస్తాన్

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం బిరుదులనరవకు చెందిన దూదేకుల మస్తాన్ రాష్ట్ర నూర్ బాష సంఘ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు కె.నాగుల్ మీరా నియామకపత్రాలు పంపారు.



పెద ఉల్లగల్లు రహదారిపై ఏర్పడిన పగుళ్లు

మూణ్ణాళ్ల ముచ్చట

- రూ.కోటి 60 లక్షలు మట్టిపాలు -

ముండ్లమూరు : పది కాలాలపాటు చక్కగా ఉండవలసిన పక్కా రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. పర్యవేక్షణ లోపించడంతోనే ఈ దుస్థితి నెలకొంటుంది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు చిందరవందరగా తయారవుతున్నాయి. దీంతో ప్రజాధనం వృధా వ్యయమవుతుంది. పెద ఉల్లగల్లు నుంచి పాత జమ్మలమడక రహదారికి రెండేళ్ల కిందట రూ.కోటి 60లక్షలు వెచ్చించి రోడ్డు వేశారు. అయితే ఏడాది తిరగక ముందే రోడ్డుపై బీటలు ఏర్పడ్డాయి. రోడ్డుపై తారు లేచిపోవడంతో నిధులన్నీ రోడ్డుపాలయ్యాయని పలువురు ఆక్షేపిస్తున్నారు. మొత్తం 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రహదారి పలుచోట్ల ధ్వంసం కావడంతోపాటు నెర్రలు వచ్చాయి.చింతలపూడి, వేములబండ, రమణారెడ్డిపాలెం, అయోధ్యనగర్, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర తదితర గ్రామాల ప్రజలు నిత్యమూ ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డును అధ్వానంగా ఏర్పరచడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరమ్మతులు చేయిస్తా : జేఈ

ఉల్లగల్లు-చింతలపూడి ఆర్ అండ్ బీ రహదారి పలుచోట్ల దెబ్బతిన మాట వాస్తవమేనని ఆర్అండ్ బీ జేఈ నాగేశ్వర రావు అంగీకరించారు. సంబంధిత కాంట్రాక్టర్ చేత రోడ్డుకు మరమ్మతులు చేస్తానన్నారు.

వైభవంగా ఆరాధన ఉత్సవాలు



రాఘవేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు : స్థానిక రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. పాఠశాలలో రాఘవేంద్రస్వామి చిత్రపటానికి పూల మాలలువేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రుడి మంత్రాన్ని 108 సార్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు జపించారు. అనంతరం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జేబీ రామారావు, హెచ్‌ఎం అన్నపూర్ణ శాంతి, ఉపాధ్యాయులు బాబు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

పామూరు : బొట్లగూడూరు పంచాయతీ రంగస్వామి పాకాలలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

లక్కవరంలో వైద్యశిబిరం కొనసాగింపు

తాళ్లూరు : లక్కవరం గ్రామంలో జ్వరాలు అదుపులోనికి రానందున మరో 5 రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని డీఎంహెచ్‌వో యాస్మిన్ తెలిపారు. బుధవారం ఆమె గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం క్షీణించడంతోనే పరిస్థితి అదుపు తప్పుతుందన్నారు. గ్రామంలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికి స్వయంగా వెళ్లి జ్వరపీడితులను పరామర్శించారు. గ్రామంలో పరిశుభ్రత లోపించడంతోనే విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. వైద్యపరీక్షలు చేయించుకుని మందులు వాడితే జ్వరాలు అదుపులోకివస్తాయన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని సూచించారు.



ఉపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రసాద్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

దొనకొండ : మల్లంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వైవీ ప్రసాద్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని అక్కడ సర్పంచ్ చింతంగుంట్ల మల్లయ్య పేర్కొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి దర్శి మండలం తూర్పు వెంకటాపురానికి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి బుధవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎం. అర్జున అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ మల్లయ్య మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో మల్లంపేట పాఠశాలకు గుర్తింపు తెచ్చిన ఘనత ప్రసాద్‌కే దక్కిందన్నారు. ఎంపీటీసీ సభ్యులు వడ్లమూడి చెన్నయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతికి ప్రసాద్ వన్నె తెచ్చారని చెప్పారు. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దర్శి : బదిలీపై వెళ్తున్న తానంచింతల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్. మోహన్, బి. వెంకట్రావును పాఠశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్. రామారావు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. వినాయక, కె. మురళీ, హెచ్‌ఎం శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవం

దర్శి : రాజ్యసభ సభ్యుడిగా అహ్మద్‌పటేల్ విజయం సాధించడంపై దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పి. కొండారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో విజయోత్సవం నిర్వహించారు. అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ అధికారం చేపట్టడానికి ఈ విజయం శుభసూచికమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా న్యాయం గెలించిందన్నారు. కాంగ్రెస్ నాయకుల ఎలీషాబాబు, కె. ప్రశాంత్, కె. పుల్లారెడ్డి, ఎన్.అంజిరెడ్డి పాల్గొన్నారు.



స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ప్రహరీ లేక ఇక్కట్లు



పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

దొనకొండ : దొనకొండ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు నానా వస్థలు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిపూట వారికి రక్షణ కరువైంది. పాఠశాల ఆవరణలో వనం-మనం కింద నాటిన మొక్కలకు రక్షణ కరువైంది. ఇటీవల రాత్రిపూట దొంగలు చొరబడడంతో బాలికలు హడలెత్తిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

పత్తి ఆదిశేషయ్య,

పాఠశాల విద్యాకమిటీ చైర్మన్



గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు, పశువులు చొరబడి పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సర్వశిక్షా అభియాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు తక్షణమే స్పందిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

చెదిరిన గూడు

దొనకొండ రైల్వే స్టేషన్ ఆవరణలో దుకాణాల తొలగింపు

రైల్వే అధికారుల నిర్వాకంతో వీధినపడిన వ్యాపారులు



దుకాణాల తొలగింపుతో ఖాళీగా ఉన్న రైల్వే స్టేషన్ పరిసరాలు

దొనకొండ : స్థానిక రైల్వే అధికారులు కన్నెర్ర చేయడంతో 60 మంది చిరు వ్యాపారుల వీధినపడ్డారు. బతుకు పోరు సాగేదెలా అని వారు మధనపడుతున్నారు. దొనకొండ రైల్వేస్టేషన్ ఆవరణలో గత కొన్నేళ్లగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని బతుకు బండిని సాగించేవారు. వారిపై స్థానిక రైల్వే రక్షకదళం సిబ్బంది నెలకొకసారి పెట్టీ కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించినా భరించేవారు. రైల్వే డివిజనల్ స్థాయి అధికారుల పర్యటన దొనకొండలో ఉందన్న సమాచారం అందడంతో వ్యాపారులను ఆఘమేఘాల మీద ఖాళీ చేయించారు. వారు కష్టపడి కట్టుకున్న పందిర్లను తొలగించడంతో వీధినపడ్డారు. దుకాణాలు ఎక్కడ పెట్టుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమను ఆదుకోవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

మాజీ వీఆర్వో పెద్దిరెడ్డికి నివాళులు

దర్శి : తూర్పు చౌటపాలెం మాజీ వీఆర్వో మారం సుందరరామిరెడ్డి ఉరఫ్ పెద్దిరెడ్డి మృతదేహానికి మాజీ ఎంఎల్‌ఏ బూచేపల్లి సుబ్బారెడ్డి బుధవారం నివాళులు అర్పించారు. సుందరరామిరెడ్డి మంగళవారం సాయంత్రం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లపాటు ప్రజలకు రెవెన్యూ సేవలు అందించి అందరి మన్ననలు అందుకున్నారని చెప్పారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ నీటిసంఘం అధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మారం ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

పీసీపల్లి : ఆరోగ్యంపై బాలికలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ సీహెచ్ గురుబ్రహ్మం అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలిలక విద్యాలయంలో బుధవారం జెవీవీ ఆధ్వర్యంలో ఆరోగ్యసూత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు విద్యతోపాటు ఆరోగ్యంపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులు దరిచేరవని సూచించారు. జేవీవీ జిల్లా అద్యక్షుడు వీ. మాలకొండారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అక్బర్‌బాషా, ఇంచార్జి ఎస్‌వో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

దర్శి : దర్శి పట్టణంలోని ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్‌లో బుధవారం విద్యుదాఘాతం ఏర్పడడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మం వద్ద మం టలు చెలరేగడంతో పొగలు కమ్ముకున్నాయి. హైవోల్టేజీ ఏర్పడడంతో అపార్ట్‌మెంట్లలోని అనేక గృహాలలో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

నేడు వైద్య శిబిరం

తాళ్లూరు : తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 10న టీడీపీ నాయకులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు శిబిరం నిర్వాహకులు నాగార్జునరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



నూజిళ్ళపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీధర్

ముండ్లమూరు : ఆధునిక పద్ధతులతో వ్యవసాయంచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి జెడ్. శ్రీధర్ సలహా ఇచ్చారు. నూజిళ్ళపల్లి, సుంకరవారిపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన పెసర, సజ్జ,జొన్న,పంటలను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుకు ముందు పొలానికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తరువాత పంటలు సాగుచేస్తే అధికదిగుబడులు సాధించవచ్చునన్నారు. రైతులు రసాయనిక, పురుగుమందులు విచ్చలవిడిగా వాడవద్దన్నారు. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం ద్వారా అలవర్చుకుంటే తక్కువ పెట్టుబడితో అధికపెట్టుబడులు సాధించవచ్చునన్నారు. రైతులు పోటీతత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు కిషోర్, ఎంపీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు కిలారి హనుమంతరావు, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉప్పువాగు

ముండ్లమూరు : మండలంలో వర్షాలు విరివిగా కురవడంతో వేములబండ సమీపంలోని ఉప్పువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలో వరద నీరు వచ్చి చేరింది. దీంతో వేములబండ, చింతలపూడికి చెందిన మూగజీవాలకు దాహార్తి సమస్య కొంతవరకూ పరిష్కారమైంది. ఉప్పువాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కళకళలాడడంతో భూగర్భ జలాలు మరింత వృద్ధి చెందే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఏదిఏమైనా మూడు రోజులపాటు కురిసిన వర్షానికి చెక్‌డ్యాం నిండుకుండలా దర్శనమిస్తోంది.

అర్హులందరికీ ఎన్టీఆర్ గృహాలు

వలేటివారిపాలెం : అర్హులందరికీ ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ ఎస్వీ సుబ్బారావు తెలిపారు. మండలంలోని పోలినేని చెరువులో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరితగతిన నిర్మించుకోవాలని కోరారు. గతంలో పల్స్‌సర్వేలో 146 మందికి ఇళ్లు లేవన్నట్లు గుర్తించామని, వారి వివరాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం

- గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి
- ఎమ్మెల్యే రామారావు

లింగసముద్రం : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే పోతుల రామారావు పేర్కొన్నారు. మండలంలోని మొగిలిచర్ల, ఆర్‌ఆర్‌పాలెం, లింగసముద్రం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వసతులను ఏర్పాటు చేసేందుకు పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షాభావం కారణంగా గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు పలు చోట్ల ట్యాంకర్ల ద్వారా నీరు రవాణా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మరికొన్ని చోట్ల బోర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్, రోడ్ల సమస్యల పరిష్కారంతో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం ఏర్పడిన కరువు దృష్ట్యా రైతులు పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నారని అందుకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఉపాధి హామీ పనులు మంజూరు చేయిస్తామన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను స్థలాలు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో తలపెట్టిన కార్యక్రమాలు, పనుల వేగవంతానికి ఆయా శాఖల ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిస్థాయిలో సహకారమందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కాకుండా అక్రమ మోటార్లు, పంపులు ఏర్పాటు చేశారని వీటిని తొలగించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో పంచాయతీరాజ్ అధికారులకు త్వరలో మరమ్మతులు చేయించనున్నట్లు ఆయన చెప్పారు.

అలాగే నియోజకవర్గంలో 117 చెరువులకు సంబంధించిన సప్లయ్ చానల్‌లను, వాగులను బాగు చేయించామని, మరికొన్ని చోట్ల బాగు చేయించాల్సి ఉందన్నారు. వీటి ద్వారా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి వ్యవసాయంపై రెట్టింపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్న పార్టీ నాయకులకు, కార్యకర్తలను ఆయన అభినందించారు.

మొగిలిచర్ల గ్రామంలో కౌలు రైతు పత్రాలను పంపిణీ చేశారు.


లింగసముద్రంలో సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు

చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకానికి విద్యుత్ సమస్యల కారణంగా తాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు. అలాగే మొగిలిచర్ల గ్రామంలో డీడీ కట్టిన వారికి కరెంటు కనెక్షన్ ఇవ్వకుండా విడిగా డబ్బులు ఇచ్చినవారికి కనెక్షన్ ఇస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆర్‌ఆర్‌పాలెం గ్రామంలో గ్రేజింగ్ భూములను కన్వర్షన్ చేసి అర్హులైన వారికి పట్టాలు ఇప్పించాలని కోరారు. జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. జంపాలవారిపాలెం చిన ఆనకట్టకు నీరు వచ్చే పాత సప్లయ్ చానల్‌ను పునరుద్ధరించాలని ఆ గ్రామ రైతు జంపాల కృష్ణయ్య కోరారు. లింగసముద్రంలోని పంచాయతీ గ్రేజింగ్ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, గ్రామస్థులు కొల్లగుంట ప్రసాద్, ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కెఆదెన్న, నాయకులు కె.కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ వీరబాబు, జడ్పీటీసీ ప్రభావతి, సర్పంచ్‌లు సీహెచ్ తిరుపతయ్య, గాలంకి ప్రసాదు, అర్ధాకుల వెంకటేశ్వరరావు, పూరిమిట్ల గురునాథం, ఎంపీటీసీ సభ్యురాలు గాలంకి ఆదెమ్మ, బట్టరుశెట్టి రాఘవ, అడపా నరసయ్య, అడపా కోటేశ్వరరావు, తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో వై.మహలక్ష్మి, హౌసింగ్ డీఈ జయరావు, టీడీపీ నాయకులు వేముల గోపాల్‌రావు, మలిరెడ్డి రాఘవరెడ్డి, పాల్గొన్నారు.

ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి

- టీడీపీ నాయకత్వ శిక్షణ శిబిరం డైరక్టర్ రాజా

కందుకూరు : నవ్యాంధ్రప్రదేశ్‌ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ నాయకత్వ శిక్షణ శిబిరం డైరక్టర్ దాసరి రాజా పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని తెలుగు విజయం ప్రాంగణంలో జరుగుతున్న నాయకత్వ శిక్షణ 109వ బ్యాచ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విభజన రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుని తీర్చిదిద్దేందుకు లక్ష్యంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా, నాలెడ్జ్ సొసైటీగా మార్చే లక్ష్యంతో తిరుపతిలో ఐఐటీ, తాడేపల్లిగూడెంలో ఎన్ఐటీ, ఒంగోలు, శ్రీకాకుళంలలో ఐఐఐటీలు, విశాఖపట్నంలో పెట్రోలియం విశ్వవిద్యాలయం, మంగళగిరిలో ఎయిమ్స్ వంటి జాతీయ విద్యాసంస్థలతో పాటు అమరావతిలో ఎస్ఆర్ఎం, విట్, అమృత లాంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకి కృషి చేశారని వివరించారు. కేవలం మూడేళ్లలో ఇన్ని జాతీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలను రాబట్టడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా వినుకొండ, బాపట్ల, పెదకూరపాడు, ప్రకాశం జిల్లా కొండపి, నెల్లూరు జిల్లా కావలి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ, మండల స్థాయి నాయకులు ఈ శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమంలో శిక్షణ శిబిరం కో ఆర్డినేటర్ కాకర్ల మల్లిఖార్జున, కందుకూరు జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్ చౌదరి, శిక్షకులు పసుపులేటి పాపారావు, జె.చైతన్య టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న నాయకులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం : వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారి హర్షవర్ధన్ తెలిపారు. మండలంలోని వలేటివారిపాలెం, దండివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో సందాని, రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.


వేరుశనగ పంటపై రైతులకు సూచనలిస్తున్న ఏఈవో హర్షవర్ధన్

రోడ్డుపైనే మురుగు నీరు

లింగసముద్రం : మండలంలోని వీఆర్‌కోట గ్రామంలో కాలువల్లో మురుగు కదలడం లేదు. దీంతో రోడ్లపైకి మురకి నీరు ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. మురుగు వల్ల కాలుష్యం అధికమై, దోమలు విజృంభిస్తున్నాయన వారు వాపోతున్నారు. మంగళవారం ఎమ్మెల్యే పోతుల రామారావు వీఆర్‌కోట వచ్చిన సందర్భంగా ఈ విషయాన్ని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌బారికి మురుగును తొలగించాలని ఆదేశించారు. త్వరతగతిన చర్యలు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

నేటి నుంచి ఉపాధి పనులు ప్రారంభించాలి

వలేటివారిపాలెం : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఉపాధి పనులు ప్రారంభించాలని ఎంపీడీవో విజయ్‌శేఖర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగినఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను ఓడీఎఫ్ గ్రామాలుగా గుర్తించినట్టు చెప్పారు. ఆ గ్రామాలన్నింటిలోనూ నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మరుగుదొడ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సమీర్‌బాషా, ఈవోఆర్డీ చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలకొండలో ఆక్రమణల తొలగింపు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండలో కొండపైకి ఎక్కే నడక మెట్ల దారిలోని ముఖద్వారంనకు సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా గురువారం ఆక్రమణలను తొలగించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుకు రెండువైపులా ఉన్న ఆక్రమణలను తీసివేసి, దేవాలయానికి అప్పగించాలని కోర్టు నుంచి ఎస్పీకి ఆదేశాలు జారీ అయినట్లు ఆయన చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ఆక్రమణలను తొలగిస్తామని వివరించారు.

17న శాఖవరంలో రైతులకు అవగాహన

వలేటివారిపాలెం : మండలంలోని శాఖవరం ఈ నెల 17న రైతులతో అవగాహన సమావేశం నిర్వహించన్నుట్టు తహసీల్దార్ ఎస్వీ సుబ్బారావు చెప్పారు. రాళ్ళపాడు ఎడమ కాలువ పొడిగింపు, భూసేకరణపై చర్చింస్తామన్నారు. సమావేశానికి రైతులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ఠ

వలేటివారిపాలెం : మండలంలోని కొండసముద్రంలో బొడ్డురాయి ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బొడ్డురాయికి పూజలు నిర్వహించారు. మూడు రోజుల నుంచి జరుగుతున్న ఈ వేడుకలు బుధవారంతో ముగిశాయి.

సినిమాలు

కందుకూరు

రాజ్	- ఇదే దెయ్యం
యువరాజ్	- నిన్నుకోరి
ప్రశాంతి	- నక్షత్రం
కోటేశ్వర	- దర్శకుడు
రాఘవ స్క్రీన్1	- ఫిదా
రాఘవ స్క్రీన్2	- గౌతమ్‌నంద

గృహాలను త్వరగా నిర్మించుకోవాలి

లింగసముద్రం : ఎన్టీఆర్ గృహ పథకం కింద మంజూరైన ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎమ్మెల్యే పోతుల రామారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలిజపాలెం గ్రామంలో ఆయన ఎన్టీఆర్ గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంజూరైన లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్లను నిర్మించుకుంటే బిల్లులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పి.జయరావు, ఏఈ రమేష్‌బాబు, సర్పంచ్ యు.నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బట్టరుశెట్టి రాఘవ, అడపా నరసయ్య, అడపా కోటయ్య, ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత డొల్ల

● పగుళ్లిచ్చిన ఆర్అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం : మండలంలోని వీఆర్‌కోట నుంచి చీమలపెంట మీదుగా తాతాహోటల్ వరకు నిర్మించిన ఆర్అండ్‌బీ తారు రోడ్డు పలు చోట్ల దెబ్బతింది. ఆరేడు నెలల క్రితం ఈ రోడ్డును సుమారు రూ. 80లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొన్ని చోట్ల రోడ్డు దెబ్బతింటుంది. మరమ్మతులకు గురైన చోట వెంటనే బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



వీఆర్‌కోట సమీపంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ తారు రోడ్డు

రాళ్లపాడు ఆయకట్టుకి నష్టం చేసే

జీవోను రద్దు చేయాలి

● రైతు సంఘ నాయకుల డిమాండ్

కందుకూరు : రాళ్లపాడు రిజర్వాయరు నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటుకి సంబంధించిన జీవోను తక్షణం రద్దు చేయాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. రాళ్లపాడు పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాకుమాని మాధవరావు ఆధ్వర్యంలో గుడ్లూరు మండలం దారకానిపాడులో బుధవారం నిర్వహించిన ఆందోళనలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి, రాళ్లపాడు ఆయకట్టు కమిటీ మాజీ అధ్యక్షుడు గనిపినేని నరసింహారావు, పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాళ్లపాడు ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం చేసే ఎత్తిపోతల జీవోని ప్రభుత్వం రద్దు చేసేవరకు ఆందోళనలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం గ్రామ గ్రామాన రైతులను చైతన్యం చేయటం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్లుగా సోమశిల ఉత్తర కాలువ పనులు జరుగుతున్నా నేటికీ రాళ్లపాడు రిజర్వాయరుకి నీరు చేరలేదని, ఇంకెన్నాళ్లకు చేరుతాయో కూడా నమ్మకం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చింతలదేవి భూ సేకరణ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాకపోగా అక్కడ కాలువ తవ్వకం పనులు ఎన్నేళ్లకు ప్రారంభమవుతాయోనన్న సందేహం కలుగుతోందని విమర్శించారు. సోమశిల జలాలు రాళ్లపాడు రిజర్వాయరుకి రాకుండానే, అసలు ఎంత పరిమాణం నీరు వస్తుందో చెప్పకుండా, ఆ నీటిని ప్రామాణికంగా చూపించి రాళ్లపాడు రిజర్వాయరు నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటుకి ప్రభుత్వం జీవో ఇవ్వడం, ఎత్తిపోతల ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఐదేళ్లుగా రాళ్లపాడు ఆయకట్టులో వరిపంట సాగుకి నోచుకోకపోగా ఈ ఏడాది మంచినీటి పథకాలకు నీరందక మూలనపడ్డాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాళ్లపాడు రిజర్వాయరు నుంచి నీటిని తరలించేందుకు ఎత్తిపోతల ఏర్పాటు తగదని, తక్షణం ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి కామధేను ప్రాజెక్టుకి సోమశిల రిజర్వాయరు నుంచి నేరుగా నీరు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు.



దారకానిపాడులో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పొదుపు మహిళలకు శిక్షణ

కందుకూరు : స్వయం సహాయక సంఘాలు, స్లమ్ సంఘాలను బలోపేతం చేసేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు స్థానిక పడమర మంగళిపాలెంలోని సీఆర్‌సీ భవనంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం పటిష్ఠతకు పంచ సూత్రాలు, సంఘ సమావేశ ఏర్పాట్లు, ఆర్‌సీల విధులు, బాధ్యతలు, సామాజిక బాధ్యతలు, పారిశుధ్యం డీఆర్‌పీ టి.కుమారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, పట్టణ సమాఖ్య సభ్యులు, మెప్మా టీఎంసీ సురేంద్ర, సీవో మైమున్నీషా తదితరులు పాల్గొన్నారు. గురువారం కూడా శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని ఆర్‌పీలు, పట్టణ సమాఖ్య సభ్యులు విధిగా హాజరు కావాలని డీఆర్‌పీ టి.కుమారి కోరారు.



పొదుపు మహిళలకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీ కుమారి

11 మందిపై బైండోవర్ కేసులు

ఉలవపాడు (కందుకూరు) : మాలల మహా సంగ్రామం పేరుతో ఉలవపాడులో మాల మహానాడు నాయకులు గురువారం ఆందోళనకు పిలుపునివ్వడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా 11 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్సై వెంకట రమణయ్య బుధవారం సాయంత్రం మాల మహానాడులో క్రియాశీలంగా ఉండే 11 మందిని స్టేషన్‌కి పిలిపించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠినచర్యలు తీసుకుంటామని చెప్పి, బైండోవర్ కేసు నమోదు చేసి పంపించారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

గుడ్లూరు : మండలంలోని గుండ్లపాలెం గ్రామంలో బుధవారం బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేసి, నిర్వాహకుడిని అరెస్టు చేశారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలతో సహా నిందితుడు రమణయ్యను కోర్టుకి హాజరుపరుస్తామని ఎస్సై ఉన్నం వేమన తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సహించేది లేదని, హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరిపితే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తరాలు మారిన తలరాతలు మారడం లేదు

గిద్దలూరు : తరాలు మారిన తలరాతలు మాత్రం మారడం లేదని, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని గిరిజన లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బి.సుబ్బానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిద్దలూరులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 జనాభా ఉన్న తాండాలను, గిరిజన గూడెంలను పంచాయతీలుగా మారుస్తామన్న హామీని తుంగలోకి తొక్కారన్నారు. జీవనాధారం కోల్పోతున్న గిరిజనులకు పాడిగేదెలు, ఆవులు, పొలాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. భూ ఆక్రమణలు, దాడుల నుంచి గిరిజనులను రక్షించాలన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన సంఘాలకు అటవీ ఉత్పత్తులు తెచ్చుకుని అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. కేఎస్‌పల్లి జాయింట్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షుడు మంత్రినాయక్ మాట్లాడుతూ అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగ్స్ తయారీ కేంద్రం ప్రారంభం

కందుకూరు : పట్టణంలోని నందావారి వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన జ్యూట్ బ్యాగ్స్ తయారీ కేంద్రాన్ని రూరల్ ఎస్సై ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంవీ బుచ్చయ్య జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించడమే గాక బ్యాగుల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రీన్ కందుకూరుకి కేటాయించి పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తానని ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాసవీ సేవాదళ్ జిల్లా కోశాధికారి చెక్కా వెంకట కేశవరావు, స్కంధపురి సోమేశ్వరాలయ చైర్మన్ చీతిరాల గోపాల్, ఇస్తాల మధు, సీహెచ్ సుబ్బారావు, బొగ్గవరపు ఫణేంద్ర, గుర్రం పోలిశెట్టి, వెంకటేశ్వర్లు, చీదెళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

వివాహ మహోత్సవానికి ప్రముఖుల హాజరు

కందుకూరు : ప్రముఖ కాంట్రాక్టర్ చిడిపోతు సురేష్‌బాబు మేనల్లుడు బత్తిని లక్ష్మీనారాయణ చౌదరి, శ్రీదేవిల వివాహం బుధవారం కందుకూరులో వైభవంగా జరిగింది. స్థానిక పామూరురోడ్డులోని ఫంక్షన్ హాలులో జరిగిన ఈ వేడుకకు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్, కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు, కొండపి ఎమ్మెల్యే డి.బాలవీరాంజనేయ స్వామి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం దంపతులు, దామచర్ల పూర్ణచంద్రరావు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, జట్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, మలినేని గ్రూప్ ఆఫ్ కాలేజీస్ వైస్ చైర్మన్ మలినేని పెరుమాళ్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ దివి లింగయ్యనాయుడు, మాజీవైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, మాజీఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పోతుల ప్రసాద్, దివి తిరుపతినాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు, తల్లపనేని వెంకటేశ్వర్లు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

బడి బయట 330 మంది పిల్లలు

● జిల్లా ఏఎల్ఎఫ్ కోఆర్డినేటర్ ఏసోబు

గిద్దలూరు : ప్రస్తుతం 330 మంది పిల్లలు బడిబయట ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించడమే తమ లక్ష్యమని జిల్లా ఏఎల్ఎఫ్ కోఆర్డినేటర్ ఏసోబు పేర్కొన్నారు. విద్యార్థి గణన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని సీఆర్‌పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 780 మంది విద్యార్థులు బడిబయట ఉండగా, 350 మందిని ఇప్పటివరకు పాఠశాలలో చేర్పించినట్టు చెప్పారు. మిగిలిన వారిని కూడా సీఆర్పీలు బడిలో చేర్పించాలన్నారు. వలస వెళ్లిన విద్యార్థులను గుర్తించి, వివరాలు నమోదుచేసుకోవాలన్నారు.

వీఆర్వోలు ఉద్యోగ కేంద్రాల్లోనే నివసించాలి

ముండ్లమూరు : వీఆర్వోలు ఉద్యోగ కేంద్రాల్లోనే ఉండాలని తహసీల్దార్ బి. గంగాధరరావు ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన వారితో సమావేశమయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా పిడుగులతోపాటు వర్షాలు పడుతున్నందున వీఆర్వోలంతా గ్రామాల్లో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పొలం పనులకు వెళ్ళిన వారు ఉరుములు మెరిసేడప్పుడు చెట్ల కిందకి వెళ్లకూడదని గ్రామంలో దండోరా వేయించాలని ఆయన సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె. రవికుమార్, వీఆర్ఓలు శేషగిరిరావు, బి. గురవయ్య, విజయ్‌కుమార్, కోటయ్య, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రసం పీల్చు పురుగులను నివారించాలి

కొమరోలు : పత్తి పంటలో రసం పీల్చు పురుగులను నివారించాలని ఏవో జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని రెడ్డిచెర్ల, మల్లారెడ్డిపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సం, బోరాన్‌లను వాడాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తర్లుపాడు : అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంఈవో డి.సుజాత అన్నారు. స్థానిక హిందూ ప్రాథమిక(ఎ.ఎ) పాఠశాల ఉపాధ్యాయులు మేకల చంద్రశేఖరరాజు, బీసీహెచ్ వెంకటేశ్వర్లు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా బుధవారం పాఠశాలలో సన్మానం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చంద్రశేఖరరాజు, వెంకటేశ్వర్లు 8 ఏళ్ల పాటు ఉత్తమ సేవలను అందించారని కొనియాడారు. సర్పంచ్ కందుల విజయకళావతి మాట్లాడుతూ ఇద్దరూ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యను అందించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఎంపీటీసీ సభ్యురాలు వరాలు, ఫాస్టర్ ఎం.విజయకుమార్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.జయమ్మ, సంఘ నాయకులు లింకన్, లక్ష్మయ్య, గుంటు రత్నకుమార్, కొండయ్య పాల్గొన్నారు.

ప్రజా జీవితంలో మమేకం ..ఆకాశవాణి

మార్కాపురం వన్‌టౌన్ : ప్రజల జీవితంలో ఆకాశవాణి మమేకమైందని ఆర్డీవో పి.కిశోర్ అన్నారు. మార్కాపురం ఆకాశవాణి కేంద్రం 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాలు స్థానిక రేడియో కేంద్రంలో ప్రోగ్రాం హెడ్ బీఆర్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఆకాశవాణి కేంద్రం ప్రారంభించి 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ఎప్పటి నుంచో అన్ని వర్గాల ప్రజలకు ఏకైక సమాచార సాధనం రేడియో అన్నారు. ఇంటర్‌నెట్ వచ్చినా ఆకాశవాణికి ఆదరణ తగ్గలేదన్నారు. విజ్ఞానం, వినోదం అందిస్తూ మార్కాపురం కేంద్రం ప్రజల జీవితాల్లో భాగమైందని పేర్కొన్నారు.

11న దేవాదాయ భూముల కౌలు వేలం

జరుగుమల్లి : ఈ నెల 11న ఉదయం 10 గంటలకు శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో కౌలు భూముల బహిరంగ వేలం జరుగుతుందని ఆలయ చైర్మన్ బండ్లమూడి నరసింహారావు తెలిపారు. కౌలు బహిరంగ వేలంపాటలో పాల్గొనే రైతులు రూ.2000 నగదు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని ఆలయన చైర్మన్ తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే స్వామి పిలుపు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

మర్రిపూడి : అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేస్వామి పిలునిచ్చారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన గృహనిర్మాణ లబ్ధిదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సభకు గృహనిర్మాణ శాఖ డీఈ దశరథ శర్మ అధ్యక్షత వహించారు. కొండపి నియోజకవర్గంలో రూ.55.41కోట్ల ఖర్చుతో 4,250 గృహాలు మంజూరు చేసినట్లు స్వామి చెప్పారు. గృహనిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. మండలంలో గృహనిర్మాణాలు ఊపు అందుకోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళు నిర్మించుకోనేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోతే ఆ గృహలను రద్దు చేసి అర్హులైన వారికి ఇస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల సౌకర్యం కోసం ప్రభుత్వం సిమెంట్ ధరలపై రూ.100ల రాయితీ అందజేసిందని పేర్కొన్నారు. నిరుపేదల లబ్ధిదారులు పునాదులు వేసుకోనేందుకు అవసరమైతే స్త్రీ నిధి నుంచి ఆర్థికసహాయం అందించేందుకు కృషిచేస్తానని చెప్పారు. జన్మభూమి కమిటీ సభ్యులు గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

గార్లపేట పంచాయతీ పరిధిలోని కాంచీపురంలో నిర్మించునున్న గిరిజన కాలనీకి రూ.10లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో రూ.83కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కెల్లంపల్లి, అగ్రహారం, రామాయపాలెం, పెట్లూరు రహదారులను రూ.4కోట్లతో తారురోడ్డుగా మార్చినట్లు వెల్లడించారు. మండలంలో అపరిష్కృతంగా రహదారులను అభివృద్ధి చేయనిదే తిరిగి ఓట్లను అడుగుబోనని సభ ముఖంగా స్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును కాల్చిచంపాలన్న జగన్ లాంటి ప్రతిపక్షనేతకు బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం 69 మందికి ఇంటిస్థలాలకు పట్టాలు అందజేశారు.

మరో 40 మందికి గృహనిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యులు తుళ్ళూరి నరిసింహారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంతు హనుమారెడ్డి, ఎంపీడీఓ ఎవీ సుబ్బారావు, కాకర్ల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రేగుల వీరనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు చేరెడ్డి నరసారెడ్డి, ఆర్ఐ కె. డేవిడ్‌రాజ్, ఏఏలు రామలింగయ్య, దాసు, ఎపీఓ వెంకట్రావు, ఎపీఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ ఫుటేజీ చూస్తున్న ఎస్ఐ

టోల్‌గేట్‌లో దొంగ నోటు

చిల్లర మార్చిన యువకుడు

టంగుటూరు: టోల్‌గేట్ ఉద్యోగి అందరి కళ్లు గప్పి రూ.500 దొంగ నోట్లను చిల్లర కింద మార్చుతున్న ఉదంతం ఆలస్యంగా వెలుగు చూ సింది. ఈ సంఘటనపై ఎస్సై సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన సమాచారం ఇది. టంగుటూరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలకు టోల్‌గేట్ చెల్లిం చేందుకు రూ.2వేలు నోట్ ఇచ్చి తిరిగి చిల్లర తీసుకునే వారిలో కొందరికి నకిలీ రూ500 నోట్లు వస్తున్నాయి. కొందరికి ప్రతి రెండు రూ500 నోట్లకు మధ్యలో ఒక నకిలీ రూ500 నోట్ వస్తుంది. ఈ విషయమై టోల్‌ప్లాజా అధికారుల నుంచి టంగుటూరు పోలీసులకు పిర్యాదు అందింది. వెంటనే రంగంలో దిగిన ఎస్సై వెంకటేశ్వర్లు టోల్‌ప్లాజా వద్దకు చేరుకొని బుధ వారం విచారణ చేపట్టాడు. విచారణ ద్వారా దొంగనోట్ల సూత్రధారిని గుర్తించారు.

గత 6నెలల క్రితం ఇక్కడ ఉద్యోగంలో చేరిన జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన వై.రాజేష్ నకిలీ రూ.500 నోట్ ముద్రణ సూత్రధారి అని పోలీసులు గుర్తించారు. ఇతనే టోల్‌గేట్ కోసం రూ.2వేలు నోటు ఇచ్చే వారికి తిరిగి చిల్లర చెల్లించే సమయంలో రెండు రూ.500 నోట్ల మధ్యన ఒక రూ.500 నకిలీ నోట్ చేర్చి ఇచ్చేవాడని, ఈవిధంగా తన నకిలీ నోట్ల భాగోతం నడిపించాడని ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలిస్తున్నామని ఎస్సై చెప్పాడు.

రోడ్డు తవ్వేస్తున్నా పట్టించుకోరా?

జరుగుమల్లి : ప్రజలు, రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం లక్షలు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్న ఇటువంటి రోజుల్లో రొడ్డును యుదేశ్చగా తవ్వేస్తున్నా పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తిన్నట్లు చూస్తున్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామం నుంచి అక్కచెరువుపాలెం పోలాల్లోకి ప్రభుత్వం గతంలో రోడ్డు నిర్మించింది. రహదారి పక్కనే ఉన్న భూయజమాని అధికారపార్టీ నాయకుల అండతో జెసిబితో యుదేశ్చగా భూమిని తవ్వేస్తున్నాడు. ఇదే మని ప్రశ్నించే అధికారులు లేక పోవడంతో రొడ్డును తవ్వేసి తన పొలంలో కలుపుకుని దున్నేసాడు.



పొలం మధ్యలోరోడ్డును తవ్వుతున్న దృశ్యం

పోరంబోకు భూములు పరిశీలించిన జేసీ



చింతతోపును పరిశీలిస్తున్న జేసీ నాగలక్ష్మి

జరుగుమల్లి : గత కొంతకాలంగా కె.బిట్రగుంట గ్రామంలో సమస్యాత్మకంగా మారిని చింతతోపు పోరంబోకు భూమిని బుధవారం జేసీ నాగలక్ష్మి పరిశీలించారు. కె.బిట్రగుంటలోని 438, 439 సర్వే నెంబరులో చింతతోపులో 9.44 సెంట్ల భూములపై ప్రభాకరరెడ్డి, చిమ్మిరి పిచ్చయ్య లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి, విక్రయాలు చేస్తున్నారని, భూమి లేని పేదలకు ఆ స్థలాలను మంజూరు చేయాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ నాగలక్ష్మి బిట్రగుంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ భూముల్లో నివాసముంటున్న కొందరు తమ కుటుంబీకులు వందేళ్లుగా నివాసముంటున్నారని జేసీకి వివరించారు. దానిపై జేసీ స్పందిస్తూ వాస్తవ భూమిని పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆ భూమిలో 64 మంది శాశ్వత భవనాలు నిర్మించుకొగా, 33 మంది తాత్కాలిక భవనాలు నిర్మించుకున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు కొంత స్థలాన్ని కేటాయించి, లబ్ధిదారులకు పోను మిగతా స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మల్లికార్జునరావు, డీపీవో ఎన్ఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీవో విజయలక్ష్మీ, వీఆర్వో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కె.క్రిష్ణ తదితరులు ఉన్నారు.



బీమా నగదు అందజేస్తున్న తన్నీరు

పేదలు చంద్రన్న బీమాలో చేరాలి

సింగరాయకొండ : ప్రతి పేదా చంద్రన్న బీమాలో చేరాలని పట్టణ టీడీపీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు రామకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం పేదల కోసం తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యం కల్పింస్తుం దన్నారు. స్థానిక ప్రశాంతి థియేటర్ సమీపంలోని ఇస్లాంపేటకు చెందిన సయ్యద్ మజహార్ బాషా గుండెపోటు కారణంగా బుధవారం మృతి చెందారు. ఈ సం దర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల ని మిత్తం రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కూనపురెడ్డి సుబ్బారావు, షేక్ జిలానీ, బీమా మిత్ర శైలజ పాల్గొన్నారు.

ప్రసవాలు ఆసుపత్రిలో జరగాలి

సింగరాయకొండ : ప్రతి ప్రసవం వైద్యశాలలోనే జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని సింగరాయకొండ సర్పంచ్ డా.కుంభా నాగమణి పేర్కొన్నారు. స్థానిక ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అధిక రిస్క్ గర్భాల గురించి స్కానింగ్ ద్వారా ముందుగానే తెలుసుకోవడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.

కార్యక్రమం ప్రతి నెల తొమ్మిదవతేదిన ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహిస్తారన్నారు.ఈ సందర్భంగా 25 మంది గర్భవతులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించగా అందులో ముగ్గురిని ఒంగోలు రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డా. ప్రద్మజ, డా. క్రాంతి కిరణ్, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటితోనే ఆరోగ్యం : ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మీ

జరుగుమల్లి : పరిశుభ్రమైన నీరే ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ఎంపీడీవో విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పైడిపాడు, సతుకుపాడు, రెడ్డిపాలెం, కామేపల్లి, కె.బిట్రగుంట గ్రామాలోనిటి సంఘం సభ్యులకు తాగునీటి వినియోగంపై సూచనలు సలహాలు ఇచ్చారు. పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్ర పంచ బ్యాంకు నిధులతో తాగునీటి పథకాలు చేపట్టినట్లు ఆమె సూచించారు. తాగునీటి వినియోగం, క్లోరినేషన్ చేపట్టే విధానంపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కల్పన, సూపరిండెంట్ రామక్రిష్ణ, వరల్డ్ బ్యాంకు నిధుల కోఆర్డినేటర్ పుల్లన్న, రిసోర్స్ పర్సన్స్ భారతి పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు

మూలగుంటపాడు (సింగరాయ కొండ) : అర్హత గల ప్రతి కుటుంబానికి ఎన్టీఆర్ గృహం మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ జమీవుల్లా పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చుక్కా కిరణ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పల్స్ సర్వేలో గ్రామంలో కొంత మందికి స్వంత గృహాలు లేకపోయినా ఉన్నట్లుగా తప్పుగా నమోదైందన్నారు. వీటి సవరణల కోసం ప్రస్తుతం మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముళ్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి ఎల్.బ్రహ్మయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

కొండపి: కొండపి ప్రాంతంలో బుధవారం ఉదయం ఓ మోస్తరు వర్షం దాదాపు రెండు గంటలపాటు కురిసింది. గ్రామాల్లోని గుంటలు, పతుల్లోకి నీరు చేరింది. మండలంలోని పలు గ్రామాల్లో వేసిన కంది, పైరుజొన్న, నువ్వు, సామాజిక వనాలకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు అంటున్నారు. గట్టి జల్లు పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లోగా పొజిషన్ సర్టిఫికెట్లు

- అధికారులకు ఆర్డీవో ఆదేశం
- గృహనిర్మాణ, శ్మశానవాటికలపై సమీక్ష

కొండపి : రెండు రోజుల్లోగా నియోజకవర్గంలోని తహసీల్దార్లు, వీఆర్వోలు సమన్వయంతో పనిచేసి గృహనిర్మాణ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కందుకూరు డివిజన్ ఆర్డీవో మల్లికార్జున రావు వీఆర్వోలను, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం రాత్రి కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో డివిజన్ పరిధిలోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు, జరుగుమల్లి, శింగరాయకొండ మండలాల తహసీల్దార్లు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2016-17, 2017-18, 2018-19 సంవత్సరాల్లో ఇళ్ల మంజూరైన గృహనిర్మాణ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదన్న కారణంగా ఇళ్ల నిర్మాణాలు ఆగకూడదన్నారు. స్థల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే కారణాలు రాసి ఇవ్వాలని ఆర్డీవో తహసీల్దార్లకు, వీఆర్వోలకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపని వారయితే అదే విషయాన్ని రాసిస్తే, కొత్తవారికి మంజూరు చేస్తారని, రెండు రోజుల్లోగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆర్డీవో అన్నారు. అదేవిధంగా శ్మశాన వాటికలు స్థల వివాదాలుంటే తెలపాలని ఆర్డీవో కోరారు.

మండలాల వారీగా మంజూరైన గృహాలు పొజిషన్ సర్టిఫికెట్లు పెండింగ్ వివరాలపై రెవెన్యూ అధికారులతో, శ్మశాన వాటికల పురోగతిపై పీఆర్ ఏఈలతో సమీక్షించారు.

సమన్వయంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే స్వామి

అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపాలని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంగన్‌వాడీ భవనాల స్థలాల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని అందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో కొండపి ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, హౌసింగ్ డీఈ వారణాశి దాశరథి శర్మ, కొండపి ఎంపీడీవో ఎ.ప్రభాకరరావు, కొండపి తహసీల్దార్ శ్రీశిల్ప రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో, ఎమ్మెల్యే

విద్యుత్ షాక్‌కు గేదె మృతి

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం

మర్రిపూడి : నిత్యం జనసమర్ధంగా ఉండే కార్యాలయాల సముదాయం పక్కనే వందలాది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్న విద్యాలయం. మేత కోసం రహదారి వెంట వెళ్తున్న ఓ గేదె బుధవారం ఉదయం కార్యాలయ గేటు సమీపంలో హఠాత్తుగా ఆహాకారాలు చేస్తూ ఉన్నట్టుండి కుప్పకూలిపోయింది. ఏమైందో కూడా కొంతసేపు స్థానికులకు అర్థం కాని పరిస్థితులో స్థానికులు కలవరానికి గురి అయ్యారు. ఇంతలో వెనుక వైపు వస్తున్న గేదె యాజమాని భార్య విద్యుత్ ఘాతానికి గురి అయిందని గ్రహించి అప్రమత్తమైంది. వెంటనే స్థానికులు గేదె విద్యుత్‌ఘాతంతో మృతి చెందడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారుల అవగాహన కార్యక్రమం ఉండడంతో మండలంలోని అన్నీ గ్రామాలను ప్రజలు పెద ఎత్తున తరలి వచ్చారు. ఆ క్షణంలో గేదె మృతిచెందక పోవుంటే పెద జన నష్టం జరిగి ఉండేది. మంగళవారం రాత్రి నుంచి జోరువర్షం కురుస్తుండడంతో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్ళే విద్యుత్ తీగలపై అర్థుక్కడ ఉన్న టెలిఫోన్ స్థంభం పగలడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగింది. నేల తేమగా ఉండడంతో విద్యుత్‌ఘాతం తో గేదె మృతిచెందిన వెంటనే స్థానిక విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేసి తీగను తొలగించడంతో ప్రాణనష్టం తప్పిపోయింది. మర్రిపూడికి వచ్చిన ఎంఎల్‌ఏ స్వామి మృతి చెందిన గేదెను చూసి ప్రమాద సంఘటనపై ఆరా తీశారు. గేదె యాజమాని పాలగిరి అంకిరెడ్డిని పరామర్శించారు. విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నప్పటికి వాటిని సరిచేయకపోవడంపై ఆశీసన సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యాన్ని మండల ప్రజలు తప్పు పడుతున్నారు.

విద్యార్థుల గణన నివేదికను అందజేయాలి

సింగరాయకొండ రూరల్: పట్టణంలోని స్థానిక విద్యావనరుల శాఖ కార్యాలయంలో బుధవారం సర్వశిక్షాఅభియాన్ సమన్వయకర్త వి.సత్యసాగర్ విద్యార్థి గణనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజాసాధికార సర్వేలో భాగంగా ఇచ్చిన వివరాలను సంపూర్ణంగా పరిశీలించి విద్యార్థుల గణన నివేదికను అందజేయాలని సూచించారు. కొంతమంది విద్యార్థులు ఈ ప్రాంతంలో ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతే గ్రామంలో ఉన్న పెద్దలతో ఎక్కడికి వెళ్లారో వివరాలు సేకరించాలని ఆయన కోరారు. వీరి వెంట ఎంఈవో బి.శివన్నారాయణ, సీఆర్పీలు కె.వంశీ, నూకసాని శ్రీనివాసులు, ఆశా సమన్వయకర్త శ్రీహరి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పొన్నలూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహ కారం అభినందనీయమని విప్ప గుంట స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ ఎన్ శివరామకృష్ణ అన్నారు. మండలంలోని విప్పగుంట ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 85 మందికి బుధవారం నాడు పలు రకాల వస్తువులను అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం దాతలు నీలిశెట్టి వెంకటేశ్వర్లు ప్లేట్లు, రామాలయం ట్రస్టు తరఫున జాలలమూడి రవీంద్ర బెల్టులు, టైలు, జీవిడాన్- సిన్‌ఫైట్ కార్పొరేషన్ సంస్థ వారు బ్యాగ్స్, రాత పుస్తకాలు, వాటర్ బాటిల్స్, మన ఊరి చారిటబుల్ ట్రస్టు వారు నోటు పుస్తకాలు మొత్తం 16వేల రూపాయల ఖరీదు చేసే వస్తువులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల సిబ్బంది విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమ్మిశెట్టి మాల్యాద్రి, ఉపాధ్యాయులు ప్రసన్నమాధురి, సువర్ణలత, దాత వేముల లక్ష్మమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలను అందజేస్తున్న శివరామకృష్ణ

అర్జీదారులకు ఆర్డీవో ఫోన్

కొండపి: గతనెల 11 వతేదీన కొండపిలో నియోజకవర్గ స్థాయిలోని 5 మండలాల స్థాయిలో కొండపిలోని సాయి సీతారామ కల్యాణ మండపంలో ప్రజాదర్బార్ నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. 30 రోజుల్లోగా అర్జీదారుల సమస్యలకు పరిష్కారం, లేదా పరిష్కరించకపోవడానికి కారణాలు అర్జీదారులకు తెలపడం ప్రజాదర్బార్ ఉద్దేశ్యం. సమస్యలు పరిష్కరించిన అర్జీదారులతో ఆర్డీవో బుధవారం సాయంత్రం నేరుగా ఫోన్‌లో సంభాషించారు. సమస్య పరిష్కారం పట్ల అర్జీదారుల స్పందనను స్వయంగా ఆర్డీవో తెలుసుకున్నారు. ప్రజాదర్బార్‌లో కొండపి మండలం నుంచి 72 అర్జీలు రాగా, 58 పరిష్కారమయ్యాయి. మర్రిపూడి మండలం నుంచి 76 రాగా 74 పరిష్కారమయ్యాయి. శింగరాయకొండ మండలం నుంచి 22 రాగా అన్నీ పరిష్కారమయ్యాయి. పొన్నలూరు మండలం నుంచి 62 అర్జీలు రాగా 21 పరిష్కరించారు. జరుగుమల్లి మండలం నుంచి 42 అర్జీలు రాగా 12 పరిష్కరించారు. మిగతా వాటికి ఎందుకు పరిష్కారం కావో లిఖిత పూర్వకంగా అర్జీదారులకు వివరణ అధికారులు రాసిచ్చారు.

'క్విట్ ' ఉద్యమానికి 75 సంవత్సరాలు

సింగరాయకొండ రూరల్: సోమరాజుపల్లి పరిధిలో స్థానిక పీఎన్‌సీపీ కళాశాల నందు బుధవారం క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రను 75 సంవత్సరాలను పురస్కరించుకున్న సందర్భంగా దినోత్సవ వేడుకలు కరస్పాండెంట్ గీతారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమ చరిత్రలో 1942 ఆగస్టు9న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం అత్యంత కీలకమైనదని ఈ ఉద్యమంలో జాతిపిత మహాత్మగాంధీ డూ ఆర్ డై అనే నినాదంతో విజయమో వీరస్వర్గమో అని తెల్సుకోవాలని స్వాతంత్ర్య ఉద్యమ కారులకు పిలుపునిచ్చారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

మూలగుంటపాడు(సింగరాయకొండ) : ప్రజల దాహార్తి తీర్చడానికి ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు మూలగుంటపాడు సర్పంచ్ చుక్కా కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్, తిలక్ రోడ్, డాక్టర్ తోట తదితర ప్రాంతాల్లో బుధవారం ట్యాంకర్ల తాగునీటి సరఫరా ను ప్రారంభించారు. రోజుకు ఒక్కో ట్యాంకర్ 11 ట్రిప్పులతో రోజుకు 33 ట్రిప్పులతో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి ఛైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు,ఎంపీటీసీలు బసవయ్య, సన్నెబోయిన మల్లికార్జున,గ్రామ తెదేపా అధ్యక్షుడు సన్నెబోయిన వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ముళ్లపూడి సత్యనారాయణ, చెనికల శ్రీను, అంబటి శ్రీను,పంచాయతీ కార్యదర్శి ఎల్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

తాను దళిత సర్పంచ్‌ని అని అధికారులు, గ్రామ పెద్దలు అవమానిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు తనకు సహకరించడంలేదని మూలగుంటపాడు సర్పంచ్ చుక్కా కిరణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఒక ప్రాంతంలో ట్యాంకర్‌లతో నీటి సరఫరా కార్యక్రమం నిర్వహిస్తే అధికారులు అక్కడకు రాకుండా, మరో ప్రాంతంలో ట్యాంకర్ల సరఫరా ప్రాంతానికి అధికారులు వెళ్లారన్నారు. స్థానిక నాయకులు తనకు సహకరించలేదని దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాల ఉన్నతికి పాటుపడ్డ డానియేల్

జయవరం (టంగుటూరు): తాను పని చేసిన 8 ఏళ్లలో పాఠశాల ఉన్నతికి డానియేల్ ఎంతగానో కృషి చేశారని గ్రామస్తులు కొనియాడారు. జయవరం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉంటూ బదిలీ అయిన కసుకుర్తి డానియేల్ సన్మాన సభ బుధవారం జరిగింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామంలో అత్యంత వెనుకబడ్డ బండ వర్గానికి చెందిన వారి బిడ్డలను ఉన్నత పాఠశాల చదువుల వరకు తీసుకెళ్లిన ఘనత డానియేల్‌దేనన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్తున్న శోభారాణి,నాగమోనికను సన్మానించారు



డానియేల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

15 నుంచి చంద్రన్న బీమాలో సభ్యుల రెన్యూవల్, నమోదు

టంగుటూరు: చంద్రన్న భీమా యోజన పథకంలో ఇప్పటికే నమోదులో ఉన్న సభ్యుల రెన్యూవల్, అలాగే అర్హులైన కొత్తవారి పేర్లు నమోదు కార్యక్రమం ఈనెల 15 నుండి ప్రారంభం అవుతుందని వెలుగు ఏపీఎం తూమాటి రాజారావు బుధవారం తెలిపారు. గతంలో జరిగిన నమోదు ఆధారంగా ఈ పథకంలో ఇప్పటికి 28,880 మంది సభ్యులుగా ఉన్నారు. వీరందరినీ రెన్యూవల్ చేస్తూనే అర్హులైన కొత్త సభ్యులను నమోదు చేస్తారు. గతంలో జరిగిన సాధికార సర్వే సిబ్బందికి డ్వాక్రా సంఘాల నుంచి సహాయకులుగా పని చేసిన విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ల ద్వారా ఈసారి సభ్యుల రెన్యూవల్, కొత్తవారి నమోదు చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్థానికంగా ఉండే డ్వాక్రా సంఘాల వీఓలకు వారి ప్రాంతంలోని సభ్యుల నమోదు బాధ్యత ఇస్తామని, దీని వలన అర్హులెవరూ మిస్ కాకుండా జాగ్రత్త పడుతున్నట్లు చెప్పారు.

సభ్యుల నమోదుకు అవసరమైన వారిని ఎంపిక చేసి ఎన్‌రోల్‌మెంట్ టీమ్స్‌లోని వారి పేర్లను ఇప్పటికే డీఆర్‌డీఏ కార్యాలయానికి పంపించాం అన్నారు. గత ఏడాది అక్టోబర్ 2 నుంచి ప్రారంభమైన ఈ పథకం తిరిగి ఈఏడాది అక్టోబర్ 2న రెన్యూవల్ అవుతుందని, ఆసమయానికి రెన్యూవల్, కొత్త పేర్లు నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆయన వివరించారు. గతంలో అవగాహన లేని వారు ఈసారి చంద్రన్న బీమాలో సభ్యులుగా చేరాలని ఏపీఎం రాజారావు కోరారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా

కనిగిరి : కనిగిరి ప్రాంతంలో పేదల కోసం పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని వైఎస్సార్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ ముత్యాల వెంకట సుబ్బారెడ్డి అభయమిచ్చారు. వెలిగండ్ల పంచాయతీ కార్యాలయంలో బుధవారం నెల్లూరు మోడ్రన్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మోడ్రన్ ఐ ఆస్పత్రి డాక్టర్లు రోగులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కనిగిరి ప్రాంతంలో కంటి వ్యాధులు, శుక్లాలతో అనేకమంది పేదలు అవస్థలు పడుతున్నారని గుర్తించారు. వారికి పూర్తిస్థాయి సేవలు అందిస్తామని సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. పులి శ్రీనివాసులురెడ్డి, తాతపూడి నాని, సురేష్, గోనా సందానంద పాల్గొన్నారు.

ఏబీఆర్ కళాశాల వలంటీర్ల శ్రమదానం

కనిగిరి టౌన్ : స్వచ్ఛాభారత్‌ను స్ఫూర్తిగా తీసుకున్న ఏబీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేపట్టారు. చిన ఇర్లపాడు గ్రామంలో ఎంపీ యూపీ స్కూల్ పరిసరాలను వారు శుభ్రం చేశారు. స్కూల్ అవరణలోని చెత్తాచెదారాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. స్కూల్ అవరణలోని మురుగు కాల్వలను శుభ్రంచేశారు. కాల్వల్లో పేరుకు పోయిన పూడికను తొలగించి మురుగు పారుదలకు వీలు కల్పించారు. పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రపరిచారు. స్కూల్ విద్యార్థులకు స్వచ్ఛాభారత్ లక్ష్యాన్ని వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని వలం టీర్లు వివరించారు. పరిసరాల పరిశుభ్ర తపై ప్రచారం చేయాలని కోరారు. స్కూల్ ఆవరణలోనే కాకుండా విద్యార్థుల ఇళ్ల వద్ద కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచిం చారు. స్కూల్ అవరణలో మొక్కలునాటారు. వలంటీర్లను ఏబీఆర్ కళాశాల చైర్మన్ ఆవుల బసిరెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రహంతుల్లా, కళాశాల విద్యార్థులు, హెచ్ఎం బాలగంగాధర్ పాల్గొన్నారు.



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

అందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

వెలిగండ్ల(కనిగిరి) : ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ఎంఈవో డి. దాసు ప్రసాద్ పిలుపునిచ్చారు. వెలిగండ్లలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బహిరంగ మలమూత్ర విసర్జనకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ఎందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బహిరంగ మల, మూత్ర విసర్జన వల్ల పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకొని పరిశుభ్రత పాటించాలని కోరారు. ర్యాలీలో హెచ్ఎం విజయభాస్కరరెడ్డి, సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల మాయం

పొలం పిలుస్తోందిలో ఏవో ఆర్నూరి దీప

కనిగిరి : విత్తన శుద్ధితో తెగుళ్ల నుంచి బయటపడవచ్చునని ఏవో ఆర్నూరి దీప సలహా ఇచ్చారు. చిన ఇర్లపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కిలో విత్తనాలకు గ్రాము కార్బన్ డిజన్‌ను పట్టించి విత్తన శుద్ధిచేసుకోవాలని సలహా ఇచ్చారు. వరినారు నాటే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీల చొప్పున కాలి బాటలు వేయాలని సూచించారు. కంది, సజ్జలో కలుపులేకుండా చూసుకోవాలన్నారు. నారు నాటబోయే ముందు 20 కిలోల జింకు సల్ఫేట్ దమ్ములో వేసుకోవడం ఉత్తమమన్నారు. రైతులు సూక్ష్మపోషకాలను వినియోగించుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామూరు : పంట పొలాల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎంపీఈవోలు రోషన్‌రాజు, పీ సుబ్బారావు సలహా ఇచ్చారు. తూర్పుకోడిగుడ్లపాడు, తిరగలదిన్నెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయనిక ఎరువులకు బదులు, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న బీమా సొమ్ము అందజేత

పీసీపల్లి : మూత్రపిండాల వ్యాధితో ఓ వ్యక్తి మృతి చెందటంతో ఆయన కుటుంబానికి చంద్రన్నబీమా ద్వారా ఆర్థిక సహాయాన్ని బుధవారం ఐకేపీ సిబ్బంది అందజేశారు. నేలపాటిపల్లికి చెందిన ఇజ్రాయేల్ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి మూత్రపిండాల వ్యాధి సోకి తీవ్ర అనారోగ్యానికి గురై రెండురోజుల కిందట మృతిచెందాడు. మృతుడు చంద్రన్న బీమాలో సభ్యుడు కావడంతో మృతుడు భార్య రూతమ్మకు మట్టి ఖర్చుల కింద రూ. 5వేలు అందజేశారు.



నగదు పంపిణీ చేస్తున్న బీమా మిత్ర

టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ భోజయ్యచారి

పామూరు : పట్టణంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు బీవీ భోజయ్యచారి పిలుపునిచ్చారు.స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఏ రాష్ట్రంలోను అమలు కాని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌ల అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. నంద్యాలలో జరిగే ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం తథ్యమన్నారు.పాబోలు శివ, ఎన్ విజయ్, సాంబ, మాచర్ల షరీఫ్, షేక్ నాయబ్‌రసూల్, ఆర్ఆర్ రఫీ, రాఘవ, కె. సుభాషిణి, లూనా జబీన్, ముబినా మౌలాలి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

పీసీపల్లి : విరలాపురం గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ఇటీవల ఆంధ్రజ్యోతి "విరలాపురంలో దాహం కేకలు" అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూస్ అధికారులు స్పందించి గ్రామానికి బుధవారం నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్థుల నీటి సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

'బత్తిన' మృతి బీజేపీకి తీరని లోటు

పామూరు : బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు, రాష్ట్ర హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిన నరసింహరావు మరణం తమ పార్టీకి తీరని లోటని జిల్లా బీజేపీ కార్యదర్శి కేవీ రమణయ్య పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బత్తిన నరసింహరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బత్తిన నరసింహరావు లాంటి నాయకులు తమ మధ్య లేకపోవడం దురదుష్టకరమన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఏ. సురేష్, ఆర్. రమేష్, పందిటి వెంకటేశ్వర్లు, కె. సుబ్బారావు, పీ విజయకుమార్ ఉన్నారు.



'బత్తిన'కు నివాళులు అర్పిస్తున్న రమణయ్య

పొంగిన వాగులు


ప్రవహిస్తున్న ఏనుగుమంద వాగు

కనిగిరి : హనుమంతునిపాడు మండలంలో బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పిడుగుపాటుకు లింగంగుట్ల గ్రామానికి సమీపం లోని తాటిచెట్లు మూడు దగ్ధ మయ్యాయి. వేములపాడుకు ఆనుకొని ఉన్న పశ్చిమంగా కొం డలపై భారీ వర్షం కురవటంతో ఏనుగుమంద వాగుకు వరద పోటెత్తింది. వేములపాడు, గా యంవారిపల్లి గ్రామాల మధ్య చప్టాపై వరద నీరు ప్రవహించ డంతో బుధవారం ఉదయం వాహ నాలు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. హనుమంతునిపాడు మండలంలో 70 మి.మీల వర్షపాతం నమోదైంది. ఏనుగుమంద వాగుతో పాటు ఇతర చెక్‌డ్యామ్‌లకు నీరు చేరింది. తిమ్మారెడ్డిపల్లి చెరువుకు నీరు వచ్చింది. ఇటీవల నీరు - చెట్టు పథకం కింద వాగులు, వంక ల్లో పూ డిక తీయడంతో అవి నిండుకుండలా దర్శనమిస్తున్నాయి.

జీవం పోసుకున్న మెట్టపంటలు

ఖరీఫ్‌లో సాగుచేసిన సజ్జ, నువ్వు పైర్లకు వర్షాలు జీవం పోశా యి. మండలంలో 10వేల ఎకరాల్లో సజ్జ సాగుచేయగా, మరికొన్ని ఎక రాల్లో కంది సాగుచేశారు. ఈ వర్షాలతో సజ్జపంటకు మేలు చేకూ రినట్లు అయ్యింది. అలాగే బోర్లలో జల మట్టం పెర గడంతో వరిసాగుకు రైతులు సిద్ధమవు తున్నారు. కనిగిరి ప్రాంతంలోను చెదురుమొదురుగా వర్షాలు కురవడంతో రైతులు సంబరపడుతున్నారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : ఫిదా
సుదర్శన్ : నక్షత్రం

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

ఇంకొల్లు : రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పర్చూరు డివిజన్ కార్యదర్శి మాచవరపు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఈ బంద్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాలతో పాటు విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

చినగంజాం : స్థానిక భూసమేత భావనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నూతన ఉత్సవబింబ సంప్రోక్షణ సుదర్శన, నారసింహ విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఈవో ఎం.శ్రీనివాసరావు, సభ్యులు వలివేటి శివనారాయణ, వెంకట రామానుజం, విశ్వనాధబాబు, ఆలయ సేవాదళ్ సభ్యులు తెలిపారు.

నీటి తొలగింపులో వివాదం

పర్చూరు(దేవరపల్లి): దేవరపల్లిలో ఇటీవల తవ్విన భూములలో వర్షానికి నీరు చేరగా దానిని బయటకు పంపించే క్రమంలో స్వల్ప వివాదం నెలకొంది. అధికారులు సామరస్యంగా వ్యవహరించి సర్దుబాటు చేశారు. తవ్విన భూమిలోని నీటిని తొలగిస్తుండగా తమను గ్రామస్థులు అడ్డుకొంటున్నారని తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత వాసులు ఆందోళనకు దిగారు. తహసీల్దారు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి భూములో నుంచి నీటిని బయటకు పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తామని చెప్పటంతో సమస్య సద్దుమణిగింది.

ఘనంగా మహేష్ జన్మదిన వేడుకలు

పర్చూరు: సీనీనటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను పర్చూరులో బుధవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. నేతాజీ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కేకును తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కట్ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసరావు, తులసి శ్రీనివాసరావు, వాలీ, శివనాగేశ్వరావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వాగులకు జలకళ

- నాలుగేళ్ల తరువాత నీరు
- రైతుల్లో హర్షం


పర్చూరులోని అద్దంకి మాన్యంలో గృహాల వద్ద నిలిచిన నీరు

పర్చూరు: కొంతకాలం నుంచి చుక్క నీరు కూడా లేకుండా ఉన్న వాగులు, వంకలు, కుంటలు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జలకళను సంతరించుకున్నాయి. పంట పొలాల్లో వర్షం నీరు చేరటంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌లో సాగు చేసుకున్న మెట్ట పైర్లు కొంతకాలంగా వర్షాలు పడక పోవటంతో అవి ఎండే దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలు ఎంతగానో మేలు చేకూరుస్తాయని చెబుతున్నారు. మరో వైపు వర్షాలతో లోతట్టు ప్రాంతంల్లో ఉన్న గృహాలతో పాటు, శివారు కాలనీల్లో ఉన్న గృహాల్లోకి నీరు చేరటంతో ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు. పర్చూరు ప్రాంతంలోని అత్యధిక శాతం చెరువులు వాగుల ద్వారానే నింపాల్సి ఉంది. వాగుల్లో నీరు లేకపోవటంతో అనేక గ్రామాల్లో తాగునీటి చెరువులు నీరు లేని పరిస్థితి. వర్షాలతో వాగులకు భారీగా నీరు చేరటంతో చెరువులను నింపుకోవచ్చని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గమైన పర్చూరులో ఉన్న రెండు తాగు నీటి చెరువుల నుంచి కొన్ని రోజులుగా సక్రమంగా నీరు అందక పోవటంతో కొంత ఇబ్బందులు పడుతున్నారు.


దేవరపల్లి చెరువులోకి చేరిన నీరు

అనధికారికంగా ఆక్స్‌ఫర్డ్ కళాశాల నిర్వహణ

- చేర్చవద్దని తల్లిదండ్రులకు ఆర్ఐవో సూచన
- ఇప్పటికే చేరిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పర్చూరు: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ కళాశాలను ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు బుధవారం కళాశాలను తనిఖీ చేసిన ఆర్ఐవో మనోహర్‌బాబు స్పష్టం చేశారు. అనుమతులేమి లేకుండానే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారన్నారు. ఆర్భాటంగా కళాశాల నిర్వహణ పేరిట వారికి అనుబంధమైన ఎయిడెడ్ కళాశాలలో హాజరు చూపుతూ మరోవైపు ప్రైవేట్ కళాశాల పేరుతో ఆక్స్‌ఫర్డ్‌ను నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. ఇప్పటికే చేరిన వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అదే కళాశాలకు అనుబంధమైన ఎయిడెడ్ కళాశాలలో ఎటువంటి ఆటంకం లేకుండా విద్యను అందించే విధంగా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చేర్పించేటపుడు గుర్తింపు ఉందో లేదో గమనించాలన్నారు. అనుమతి లేకుండా కళాశాలను నిర్వహిస్తున్న యాజమాన్యానికి ఇప్పటికే నోటీసులు జారీ చేయ టం జరిగిందని, త్వరలో చర్యలు తీసుకొంటామన్నారు. దీంతో పాటు సహకారం అందించిన ఎయిడెడ్ కళాశాల యాజమాన్యానికి కూడా నోటీసులు జారీ చేస్తామన్నారు. ఇంటర్ విద్యను పటిష్ట పరిచేందుకు జిల్లా వ్యాప్తంగా కళాశాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ ఎస్.పి.కళాధర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఐవో

చికిత్స పొందుతూ మోటారుసైక్లిస్టు మృతి

చినగంజాం : ఒంగోలుకు చెందిన జోరిగ రాజేష్(28) గత నెల 20వ తేదీన చీరాలలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా కొమ్మమూరు కాలువ బ్రిడ్జి దగ్గర ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు పడిపోయి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్ళారు. పరిస్థితి ఆందోళనకరంగా 21వ తేదీన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. చినగంజాం పోలీసులు బుధవారం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కాలువలను పరిశీలించిన ఎంపీడీవో

మార్టూరు: మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో బుధవారం ఎంపీడీవో సింగయ్య, జోనల్ మలేరియా అధికారి ఉమారాణిలు సైడు కాలువలను పరిశీలించారు. ఫాగింగ్ చర్యలు చేపట్టాలని, పూడికతీత పనులు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పటిష్ఠతకు ప్రత్యేక చర్యలు


సీడీపీవోను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్‌కుమార్

శిశు సంక్షేమశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

పర్చూరు: అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్ఠ పరిచి చిన్నారులకు నాణ్యమైన పౌషికాహారంతో పాటు, విద్యను అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని శిశు సంక్షేమశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ అన్నారు. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఎప్పటకప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు నూతనంగా ప్రభుత్వం సీఏఎస్ విధానం చేపట్టింది. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు బుధవారం ఢిల్లీ నుంచి బృంద సభ్యులు స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కార్యాలయాన్ని సందర్శించారు. సీడీపీవో విజయగౌరి నుంచి కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నఅమృత హస్తం పథకా న్ని బృంద సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శిశుసంక్షేమ శాఖ జాయింట్ కమిషనర్ శ్యాంసుదరి, సీడీపీవో విజయగౌరి, బృంద సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలు పంపిణీ చేయాలి

మార్టూరు: మార్టూరు డివిజన్‌లో చంద్రన్న రైతు క్షేత్రాలు సాగు చేసే రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలు అందజేయాలని గుంటూరు కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జేడీఏ పద్మావతి అధికారులను ఆదేశించారు. మార్టూరులోని వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం మార్టూరు డివిజన్‌కు చెందిన అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. చంద్రన్న రైతు క్షేత్రాల ఉపయోగం గురించి తెలియజేయాలని సూచించారు. ఆయా మండలాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి కె.వెంకటకృష్ణ, పంగులూరు వ్యవసాయాధికారి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ఇంకొల్లు : వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి అమర్‌నాథ్ సూచించారు. వెలుగు కార్యాలయంలో బుధవారం వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, ఏపీఎం శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

రేపు విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ఇంకొల్లు : గంగవరం గ్రామంలో 31 అడుగుల అభయాంజనేయ విగ్రహ నిర్మాణానికి శుక్రవారం ఉదయం 9.26 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

240 ఎన్టీఆర్ ఇళ్ల మంజూరు

ఇంకొల్లు(చీరాల) : దుద్దుకూరు గ్రామానికి 240 ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయి. గ్రామసర్పంచ్ చిగురుపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభలో తహసీల్దార్ లక్ష్మీకుమారి సమక్షంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ లబ్ధిదారుల జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వపరంగా రూ.2 లక్షలు దశలవారీగా అందజేయటం జరుగుతుందన్నారు. ఏ దశలో ఎంత అందజేస్తారనే విషయాన్ని ఏఈ రామకృష్ణ వివరించారు. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి సమీక్షించారు. 10వ తేదీలోపు జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారులు పనులు ప్రారంభించాలని సూచించారు.

పోలీసు పంతులు మృతి

చినగంజాం : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పర్వతరెడ్డి వెంకటేశ్వర్లు అలియాస్ పోలీసు పంతులు బుధవారం అనారోగ్యంతో స్వగృహంలో మృతిచెందారు. మొదట ఆయన పోలీసు ఉద్యోగిగా జీవితం ప్రారంభించాడు. అప్పటికే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిడిగా శిక్షణ పొంది ఉండటంతో ఉద్యోగాన్ని వదిలివేసి ఉపాధ్యాయునిగా చేరారు. అప్పటి నుంచి ఆయనను పోలీసు పంతులుగా పిలుస్తారు. యూటీఎఫ్ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

చీమకుర్తి: విద్య ద్వారానే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా గురువారం వైసీపీ ఆధ్వర్యంలో చీమకుర్తిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ ఎస్టీ విభాగం జిల్లా నాయకుడు పేరం శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కిష్టిపాటి శేఖర్‌రెడ్డి, షేక్ బాషా, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, సోమా శేషాద్రి, రాము పాల్గొన్నారు.

ఎన్‌జీపాడులో భారీ వర్షం.. రైతుల వర్షం

నాగులుప్పలపాడు : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లాలోనే అత్యధికంగా 98.0 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. తాజా వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. భూములు పదునెక్కడంతో ఖరీఫ్ పైర్ల సాగు ముమ్మరమయ్యే అవకాశం ఉంది. మరోవైపు అప్పటికే అరకొర విస్తీర్ణంలో సాగు చేసి ఎండుముఖం పట్టిన పైర్లు ఊపిరి పోసుకున్నాయి. ఉప్పుగుండూరు నాగన్నవాగుపై ఉన్న చెక్‌డ్యాం నిండింది. వాగులో మూడడుగల మేర నీరు ప్రవహిస్తోంది. పలు చోట్ల పొలాల్లో వర్షపు నీరు నిలిచింది.


నాగులుప్పలపాడు సమీపంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

పాఠశాలకు వంట పాత్రల అందజేత

చీమకుర్తి: నగర పంచాయతీలోని మూడో వార్డు కౌన్సిలర్ పాటిబండ్ల కోటయ్య కుమారుడు పోలురాజు తాను విద్యనభ్యసించిన ఆర్‌సీపీఎం పాఠశాలకు బుధవారం వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కౌత్రపు రాఘవరావు, వైస్‌చైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, పాటిబండ్ల కోటయ్య, హెచ్‌ఎం బెర్నాడ్ రెడ్డి, మధు, మోమిన్, మర్రి లక్ష్మీనారాయణ, మస్తాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

మద్దిపాడు : స్వచ్ఛభారత్, సంపూర్ణ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం మద్దిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఇది స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమై బస్టాండ్ సెంటర్ వరకూ సాగింది. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్. కృష్ణ, వ్యవసాయాధికారి జి. స్వర్ణలత, సీడీపీవో భారతి, పశువైద్యాధికారి మల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం

- **క్వారీ యజమానులకు డీడీఎంఎస్‌ల సూచన**

చీమకుర్తి : వర్షాకాలంలో క్వారీయింగ్ విషయమై అప్రమత్తంగా ఉండాలని మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్లు నీరజ్‌కుమార్, రామ్‌లు క్వారీ యజమానులకు సూచించారు. గనుల భద్రతా వారోత్సవాల్లో మూడోరోజైన బుధవారం వారు చీమకుర్తి పరిసరాల్లోని పెరల్, వీరభద్ర, పోకర్ణ, యాక్, ఒంగోలు గెలాక్సీ, హరికృష్ణసాయి, ఎలిజన్ క్వారీలను సందర్శించారు. అక్కడ భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్వారీల యజమానులకు పలు సూచలను చేశారు. పెరల్ కంపెనీకి చెందిన క్వారీలో భద్రతపై కార్మికులపై ప్రతిజ్ఞ చే యించారు. ఈ కార్యక్రమంలో క్వారీ అధిపతి చలువాది నాగరాజు, భద్రతావారోత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


క్వారీల్లో భద్రతా చర్యలను పరిశీలిస్తున్న డీడీఎంఎస్‌లు నీరజ్‌కుమార్, రామ్

నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించాలి

నాగులుప్పలపాడు : మండలంలోని ప్రతి గ్రామంలో నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించి ఓడీఎఫ్‌గా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి అయిన బీసీ సంక్షేమ శాఖాధికారి లక్ష్మీసుధ అధికారులు, సిబ్బందిని కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, ఎన్టీఆర్ గృహ నిర్మాణం, ఉపాధి హామీ పనులు, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం చేపట్టే పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి. సుజాత, ఎంపీడీవో శిలార్, ఈవోఆర్‌డీ బి. సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ చంద్ర, ఏపీఎం కె. అంజిబాబు, ఆయా శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

చీమకుర్తి : ప్రముఖ సినీనటుడు ఘట్టమనేని మహేష్‌బాబు జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి నేకునంబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మహేష్ అభిమానులు కర్నాటి హరిబాబు, బత్తిన యోనాతానా, వి. వెంకటేశ్, భాగ్యరాజు, శివ, అహరోన్‌లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.


కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి శిద్దా

చీమకుర్తిలో శిద్దా జన్మదిన వేడుకలు

చీమకుర్తి : రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు బుధవారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. 12 గంటల సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, టీడీపీ నాయకుల సమక్షంలో చీమకుర్తిలోని తన స్వగృహంలో కేక్‌ను కట్ చేశారు. ఆయన సతీమణి లక్ష్మీపద్మావతి, కుమారుడు సుధీర్‌కుమార్, శ్రుతి, కుమార్తె సునీత, అల్లుడు ఫణిధర్ తదితరులు శిద్దాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
12
ఒంగోలు
ప్రకాశం ● గురువారం 10 ఆగస్టు 2017

భూముల ఆన్‌లైన్ నిలిచిపోవటంపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొత్తపట్నం(ఒంగోలు నగరం): కొత్తపట్నం మండలంలో ఐదు నెలలుగా భూముల ఆన్‌లైన్ నిలిచిపోయిందంటూ ఆంధ్రజ్యోతి మినీలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పందించారు. కథనాన్ని ఉటంకిస్తూ ఆయన మంగళవారం కొత్తపట్నం తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల భూముల ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోవటం తో పాటు గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకూ పొజిషన్ చూపించటం లేదంటూ వార్తలో ప్రచురితమైన విషయంపై వివరణ కోరారు. ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, పేదలకిచ్చిన స్థలాలకే పొజిషన్‌ను చూపించాలని ఎమ్మెల్యే సూ చించారు.

సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

ఒంగోలు రూరల్ : బొద్దులూరివారిపాలెం సర్పంచ్ మలినీడి శ్రీధర్ మృతదేహాన్ని బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ శ్రీధర్ మొదట నుంచి తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణగా ఉండి గ్రామస్థుల మన్ననలు పొందాడని తెలిపారు. చిన్న వయస్సులో గుండె నొప్పితో మృతి చెందడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిని కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుటుం బసభ్యులను పరామర్శిం చారు. టీడీపీ మండల అధ్యక్షుడు కామేపల్లి శ్రీనివాసరావు, కరవది పీఏసీఎస్ అధ్యక్షుడు పోలవరపు వెంకట్రామ య్య, నాయకులు యర్రంనేని నరసింహారావు, యర్రంనేని వెంకట శేషయ్య, పిల్లుట్ల సుధాకర్ పాల్గొన్నారు.


శ్రీధర్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న దామచర్ల

11న మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 11న ఒంగోలు రానున్నారు. నగరంలో జరిగే పలు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.